www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 3-11-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 215 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 10.06 తదుపరి తదియ; నక్షత్రం: అనూరాధ పూర్తి; వర్జ్యం: ఉ.10.19-12.03; దుర్ముహూర్తం: సా.4.08-4.53; అమృతఘడియలు: రా.8.45-10.29; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 5.38 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సదర్ ఉత్సవం..
అధికారికం

రాష్ట్ర పండుగగా గుర్తింపు
ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పర్యవేక్షణ బాధ్యత
జిల్లాల్లో కలెక్టర్లకు అప్పగింత

12



టీటీడీలో హిందూయేతరులు లేనపుడు.. వక్ఫ్ బోర్డులో
ముస్లిమేతరులు ఎందుకు?

వక్ఫ్ సవరణ బిల్లు.. రాజ్యాంగ ఉల్లంఘన
బీఆర్ఎస్ వాళ్ల జాతకాలు మా దగ్గరున్నాయి
నేను నోరు విప్పితే వాళ్లు తట్టుకోలేరు: అసదుద్దీన్ ఒవైసీ

నా సలహా వంద కోట్లు!



పార్టీల నుంచి తీసుకునే ఫీజు ఇదీ
కొన్నిసార్లు ఇంతకంటే ఎక్కువే..
దీంతో రెండేళ్లు పార్టీ నడపగలను
నా వ్యూహాలతో 10 ప్రభుత్వాలు
సివిల్‌కోడ్‌పై ప్రజాభిప్రాయం ముఖ్యం
జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు

2



వచ్చే ఏడాదీ
గోల్డ్ జిగేల్!

11

ఇన్వెస్టర్లకు మళ్లీ రెండంకెల్లో రిటర్నులు
3,000 డాలర్లకు ఔన్స్ బంగారం!?
బులియన్ విశ్లేషకుల అంచనా ఇదీ..
గత ఏడాదిలో పసిడి 32 శాతం అప్
39 శాతం పెరిగిన వెండి విలువ

సంక్రాంతిలోపు..
కొత్త సర్పంచ్‌లు

డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు
వచ్చే 4 ఏళ్ల ఒక నెలపాటు రేవంత్‌రెడ్డే సీఎం
2 రోజులు అటూఇటుగా రాజకీయ బాంబులు
6 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
20లోపు లబ్ధిదారుల జాబితాలు ఖరారు
మహిళల పేర మంజూరు.. 4 దశల్లో సాయం
పథకం పర్యవేక్షణకు 16 శాఖల ఇంజినీర్లు
మమ్మల్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేది ఇదే..
మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామాల్లో సంక్రాంతిలోపు కొత్త సర్పంచ్‌లు, వార్డు సభ్యులు వస్తారని, డిసెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే నాలుగేళ్ల ఒక నెల పాటు (ఐదేళ్ల పదవీకాలం వరకూ) రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటారని, అందులో ఎలాంటి సందేహాలు లేవన్నారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగిన అనంతరం మళ్లీ సీఎం ఎవరన్న విషయాన్ని తమ పార్టీ జాతీయ కమిటీ (ఏఐసీసీ) నిర్ణయిస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది జూన్-డిసెంబర్ మధ్య రాష్ట్రానికి కొత్త సీఎం వస్తారంటూ బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఈ వివరణ ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు, ఆరోపణలు టీ కప్పులో తుపాను లాంటివంటూ కొట్టివేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని పరిష్కరిస్తామన్నారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మంత్రి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా దీపావళికి ముందే పొలిటికల్ బాంబులు పేలుతాయన్నారు కదా అని విలేకరులు ప్రశ్నించగా.. రెండురోజులు అటూ ఇటుగా పేలుతాయి, అప్పుడు చూస్తారుగా అని

మిగతా 12వ పేజీలో...

4లోగా పత్తి కొనుగోలు కేంద్రాలు
ప్రారంభించండి

తేమ శాతంపైనా సడలింపివ్వండి
సీసీఐని కోరిన మంత్రి తుమ్మల

12



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వివిధ విశ్వవిద్యాలయాల కొత్త వైస్ చాన్స్‌లర్లు

ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశాం
ప్రతిష్ఠ పెంచండి

వర్సిటీలను ప్రక్షాళన చేయాల్సిందే
దెబ్బతిన్న వ్యవస్థల్ని బాగుచేయండి
పనితీరు ద్వారా మంచిపేరు తెండి
అందుకు మీకు స్వేచ్ఛ, సహకారం
డ్రగ్స్, గంజాయిపై కన్నేయండి
తప్పు చేస్తే ఆశ్చర్యకర నిర్ణయాలు
వర్సిటీల కొత్త వైస్ చాన్స్‌లర్లతో ముఖ్యమంత్రి రేవంత్

13

మోదీజీ.. మీవన్నీ
అపోహలు, అవాస్తవాలే

ఎవరూ చేయనట్లు రైతుల్ని రుణ విముక్తుల్ని చేశాం
25 రోజుల్లోనే రూ. 18 వేల కోట్లు జమ చేశాం
22,22,365 మంది రైతులకు ఇప్పుడు రుణాల్లేవ్
అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రూ. 10 లక్షల వైద్యం.. మహిళలకు ఉచిత బస్సు
ఉచిత విద్యుత్తు, గ్యాస్ సిలిండర్లతో వారు హ్యాపీ
11 నెలల్లోనే 50 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ
మెస్, కాస్మెటిక్ చార్జీలను 40% పైగా పెంచాం
మా హయాంలో ఇంచు చెరువు కూడా కబ్జా కాలే
ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): "అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాకుండానే దేశంలో ఇప్పటి వరకూ ఎవరూ చేయని విధంగా రుణ మాఫీ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో అమలు చేశాం. రైతును రాజును చేశాం. రాష్ట్రంలో 22,22,365 మంది రైతులు ఇప్పుడు రుణ విముక్తులయ్యారు. రూ.2 లక్షల వరకూ వారి పేరిట ఉన్న అన్ని రుణాలనూ మాఫీ చేశాం. కేవలం 25 రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.18 వేల కోట్లకుపైగా జమ చేశాం" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణ, తన సర్కారుకు సంబంధించి ఆయన అపోహలు, అవాస్తవాలతో ప్రకటన చేశారని తప్పుబట్టారు. గత డిసెంబరు 7న కాంగ్రెస్ అధికారం చేపట్టగానే, పదేళ్ల బీఆర్ఎస్ చీకటి పాలన నుంచి విముక్తి కలిగిందని రాష్ట్ర ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో నెలకొన్న నిరాశా నిస్పృహలు, చీకటిని తమ 11 నెలల పాలనలో పారదోలామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయించే సూర్యుడిలా తెలంగాణ రాష్ట్రం పురోగమిస్తోందని

మిగతా 13వ పేజీలో...

ఫ్యూచర్ సిటీ దిశగా..

- 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూసేకరణ
- 449.27 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- భూములకు పారదర్శకంగా హేతుబద్ధమైన పరిహారం
- వాటిలో క్రయవిక్రయాలు జరపొద్దని ఆదేశం

13

5న రాష్ట్రానికి రాహుల్

- కుల గణనపై సమావేశానికి హాజరు
- ఖర్గే కూడా పాల్గొనే అవకాశం
- 6 లేదా 7న అఖిలపక్ష సమావేశం

100 రోజులన్నారు..
300 రోజులైంది

2 లక్షల ఉద్యోగాల హామీలో 10 శాతం కూడా భర్తీ చేయలే
అర్హులైన రైతుల్లో సగానికి పైగా రుణమాఫీ కాలేదు
నియామకాలపై ముఖ్యమంత్రి రేవంత్ తప్పుడు ప్రచారం
వైఫల్యాలను విజయాలుగా చూపెట్టడం సిగ్గుచేటు
రాష్ట్ర ప్రజలతో పాటు దేశాన్నీ తప్పుదోవ పట్టిస్తున్నారు
మాజీ మంత్రి హరీశ్ ధ్వజం
ముఖ్యమంత్రి ట్వీట్‌కు కౌంటర్



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలతోపాటు దేశాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉద్యోగ నియామకాల అంశంలో సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత సాధించిన ప్రగతిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సీఎం రేవంత్ శనివారం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌కు స్పందించిన హరీశ్ రావు... సీఎం పేర్కొన్న అంశాలను తప్పుబడుతూ కౌంటరిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలనే కాక దేశాన్నే తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 1,61,000 పోస్టులు భర్తీ చేసిందన్నారు. కానీ ఈ నియామకాలపై సీఎం తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని హరీశ్

మిగతా 12వ పేజీలో...

రేవంత్ తుగ్లక్ నిర్ణయాలతో ఇబ్బందులు

'హెచ్ఎండీఏ' పంచాయతీల్లో లే అవుట్ల రిజిస్ట్రేషన్ల బంద్ మూర్ఖత్వం
పేదలు, మధ్య తరగతి గురించి ఆలోచించడం లేదు: కేటీఆర్

12



సంయుక్త భాగస్వామ్యంతో
మెట్రో రెండో దశ

రూ. 24,269 కోట్లతో 76.4 కి.మీ. మార్గం
కేంద్రం వాటా 18%.. తెలంగాణది 30%
పాలనాపరమైన అనుమతి జారీ

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో రూ.24,269 కోట్ల వ్యయంతో మెట్రో రైలు రెండో దశ పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు కారిడార్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగనుంది. దీని కోసం అయ్యే మొత్తం వ్యయంలో 48 శాతాన్ని జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ నుంచి రుణంగా తీసుకోనుండగా, 30 శాతం మొత్తాన్ని (రూ.7,313 కోట్లను) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. 18 శాతాన్ని (రూ.4,230 కోట్లను) కేంద్రం వాటా కింద సమీకరిస్తారు. నాలుగు శాతాన్ని (రూ.1033 కోట్లను) ప్రైవేట్ భాగస్వామి పెట్టుబడిగా పెట్టనుంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి

మిగతా 12వ పేజీలో...

మళ్లీ క్రీడా గ్రామంగా టిమ్స్ 13

మరీ ఇంత నీచమా?



కొత్త పలుకు

దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబం బజారున పడింది.

అధికారంతో పాటు సంపద కూడా పోగవడంతో పంపకాల్లో వివాదం ఏర్పడింది.

అన్న, చెల్లెలు(జగన్, షర్మిల) ఏ ఆస్తుల కోసం గొడవ పడుతున్నారో ఆ ఆస్తులన్నీ అక్రమ సంపాదన అంటూ సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసి జగన్ రెడ్డికి వ్యతిరేకంగా చార్జిషీట్లు కూడా దాఖలు చేశాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే క్విడ్ ప్రో కో అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ అంతులేని సంపదను పోగేసుకున్నారని, పలు కంపెనీలు ఏర్పాటు చేశారని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి.

ఆస్తి పంపకాలలో కూతురికి అన్యాయం జరగడాన్ని జీర్ణించుకోలేని విజయలక్ష్మి నోరు విప్పారు.

రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం ఎందుకు జరగలేదన్నది ఇప్పుడు కీలకం. వాస్తవానికి 2004కు ముందు రాజశేఖర రెడ్డికి ఉన్న ఆస్తులను జగన్, షర్మిల మధ్య పంచారు. తంటా అంతా 2004లో రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాక సమకూరిన ఆస్తుల విషయంలోనే. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నెలకొల్పిన కంపెనీలు, సమకూర్చుకున్న ఆస్తులు జగన్ పేరు మీదనే ఎందుకున్నాయో ఆడిటర్‌గా ఉన్న విజయసాయి రెడ్డికి తెలుసు. ఒక దశలో విజయసాయి రెడ్డిని రాజశేఖర రెడ్డి పిలిపించుకొని 'సాయీ.. ఆస్తులు, కంపెనీలు అన్నీ జగన్ పేరు మీదనే ఎందుకు ఏర్పాటు చేస్తున్నావు? మా షర్మిల పరిస్థితి ఏమిటి? ఆమెకు కూడా సమానంగా వాటా ఉండాలి. నా భార్య విజయలక్ష్మి పేరిట ఆస్తులు ఏమీ వద్దు' అని ఆయన స్పష్టంచేశారు.

రాజకీయంగా ఉపయోగపడినంత వరకే తల్లీ, తండ్రీ, చెల్లీ ఎవరైనా జగన్‌కు గుర్తుకువస్తారు.

తమాషా ఏమిటంటే తమ కుటుంబంలో ఆస్తుల వివాదం ఏర్పడటానికి చంద్రబాబు కారణమని జగన్ అండ్ కో తాజాగా ప్రచారం చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి మరణానికి కారణమైన బాబుతో తల్లీ చెల్లీ చేతులు కలిపారని బురద చల్లిస్తున్నారు. బాబు అవకాశవాద రాజకీయాలు చేస్తారని విమర్శించేవారు ఉన్నారు కానీ హత్యా రాజకీయాలు చేస్తారని ఆయన ప్రత్యర్థులు కూడా చెప్పలేరు.

ప్రజా జీవితంలో ఉండే అర్హత లేని వ్యక్తులకు బాసటగా నిలవడం చరిత్రాత్మక తప్పిదం అవుతుంది. జగన్ రెడ్డి వంటి వారు ప్రజా జీవితంలో ఉండటానికి అర్హులా? అన్న విషయమై ఇప్పుడు చర్చ జరగాలి.

జగన్ రెడ్డి ఎలాంటివారో తెలుసుకొనే అవకాశం ప్రజలకు మరో మారు వచ్చింది. అప్పనంగా వచ్చిపడిన ఆస్తుల కోసం జగన్ రెడ్డి ఇంత దిగజారాలా? కుటుంబ సభ్యుల మధ్య ఇంత రాద్ధాంతం అవసరమా? అన్న అభిప్రాయం ప్రజల్లో బలపడకుండా ఉంటుందా?

నిజానికి జగన్ అనుభవిస్తున్న ఆస్తులు ఆయన స్వార్జితం కావు. అవి ప్రజల సొత్తు. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఈ ఆస్తుల వివాదం చినికి చినికి గాలివానగా మారి అసలుకే మోసం తేవొచ్చు. అందుకే జగన్ రెడ్డి ఇప్పటికైనా దురాశకు పోకుండా చెల్లి షర్మిలకు న్యాయం చేస్తే మంచిది.

భౌతిక సంపదను పోయేటప్పుడు ఎవరూ తమతో తీసుకెళ్లరు. కొడుకు ప్రవర్తన చూసి రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మి తాను ఎందుకు జీవించి ఉన్నాను? అని చింతించే పరిస్థితి ఏర్పడకూడదని ఆశిద్దాం.

4



లాంచీలో చలో చలో

- సాగర్-శ్రీశైలం మధ్య ప్రయాణం మళ్లీ ప్రారంభం
- ఇటు సోమశిల నుంచి శ్రీశైలానికి కూడా..
- లక్నవరం సరస్సు మరింత ఆకర్షణీయం
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాట్లు

14

6 గ్యారంటీల అమలుపై
పాదయాత్ర చేయండి

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
కాంగ్రెస్ గ్యారంటీలు.. నీటి మీద బుడగలే
నెరవేర్చడానికి పదివేల రోజులూ సరిపోవని వ్యాఖ్య



హైదరాబాద్/మల్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి నమ్మితే.. ఆ అంశాన్ని వివరిస్తూ పాదయాత్ర చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. ప్రజల వద్దకు వెళ్తే.. నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు అన్నది

మిగతా 12వ పేజీలో...

క్షయ కేసులు 26% భారత్‌లోనే

న్యూఢిల్లీ, నవంబరు 2: ప్రపంచంలోని క్షయ కేసులు 26 శాతం భారత్‌లోనే ఉన్నాయి. మొత్తం కేసుల్లో 56 శాతం కేవలం అయిదు దేశాల్లో ఉండగా, వాటన్నింటిలోనూ భారత్‌లోనే అధికంగా ఈ వ్యాధి ప్రభావం కనిపిస్తోంది. ఇండోనేషియాలో 10%, చైనాలో 6.8%, ఫిలిప్పీన్స్‌లో 6.8%, పాకిస్థాన్‌లో 6.3 శాతం కేసులు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) విడుదల చేసిన గ్లోబల్ టీబీ రిపోర్ట్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. టీబీ కారణంగా జరిగే మరణాల్లో 81 శాతం ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లోనే ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. మందులకు లొంగని మల్టీడ్రగ్ రెసిస్టెన్స్ టీబీ బాక్టీరియా (ఎండీఆర్-టీబీ) ప్రభావం కూడా భారత్‌లోనే అధికంగా ఉంది. క్షయ నివారణకు వినియోగించే ఐసోనియాజిడ్, రిఫాంపిన్ మందులకు కూడా లొంగని బాక్టీరియానే ఎండీఆర్-టీబీగా వ్యవహరిస్తున్నారు. కాగా, 2023లో దేశవ్యాప్తంగా మొత్తం 27 లక్షల క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించగా అందులో 25.1 లక్షల మందికి అధికారులు చికిత్స అందించారు.

మోదీవి చిల్లర రాజకీయాలు: సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల రంగు బయటపడుతోందని, వాటి రద్దుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో శుక్రవారం పెట్టిన పోస్టుపై సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. చిల్లర రాజకీయ నాయకుల తరహాలో ప్రధాని అబద్ధాలు చెప్పడం విచారకరమన్నారు. గ్యారెంటీల అమలు విజయవంతంగా సాగుతోందని తెలిపారు. ఆర్థిక పరిస్థితిని అధిగమించి పథకాలను అందిస్తుంటే.. వెన్ను తట్టి ప్రోత్సహించాల్సిన ప్రధాని ఒక చిల్లర రాజకీయ నాయకుడి తరహాలో అసత్య ఆరోపణలు చేయడం కర్ణాటక రాష్ట్రాన్ని, కన్నడిగులను అవమానించినట్లే అని పేర్కొన్నారు. దేశంలో అత్యధిక పన్ను వసూళ్లలో మహారాష్ట్ర తర్వాత 11.9 శాతం కన్నడిగులదేనన్నారు. అన్నింటినీ రాజకీయ రంగులో చూసే ధోరణి వీడాలని ప్రధానికి హితవు పలికారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కూడా ప్రధానిపై విరుచుకుపడ్డారు. అబద్ధాలు, మోసం, నకిలీ, లూటీ వంటివి మోదీ ప్రభుత్వ మూల మంత్రాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు సాధ్యమయ్యాయా? అని ప్రశ్నించారు. 2004తో పోలిస్తే 2022లో మహిళలు, దళితులు, చిన్నారులపై 1.7శాతం నేరాలు పెరిగాయని అన్నారు. బీజేపీ పాలన క్రూరమైన జోక్ అని ఖర్గే విమర్శించారు.

అయ్యప్ప స్వాములకు రూ.5 లక్షల ఉచిత బీమా

కొట్టాయం, నవంబరు 2: ఈ ఏడాది మండలం-మకరవిలక్కు పూజల నిమిత్తం శబరిమల వచ్చే అయ్యప్ప స్వాముల కోసం కేరళ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ తెలిపారు. శబరిమల వచ్చే భక్తులందరికీ ఆలయాన్ని నిర్వహించే ట్రావెంకోర్ దేవస్వోమ్ బోర్డు (టీడీబీ) ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తుందని వెల్లడించారు. శబరిమలలో పూజలు జరిగే అన్ని రోజుల పాటు విధులు నిర్వర్తించేందుకు 13వేల మంది పోలీసులు, 2,500 మంది అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సిబ్బంది, 1,000 మంది పారిశుధ్య కార్మికులను నియమించామని మంత్రి తెలిపారు. వైద్య సదుపాయల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. సన్నిధానం, పంబ, అప్పచ్చిమేడు, నీలక్కల్ ఇతర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అక్కడ గుండెకు సంబంధించిన వ్యాధుల చికిత్సకు కూడా ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు.

హిందీపై మాకు ఎలాంటి ద్వేషం లేదు: ఉదయనిధి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హిందీ భాషపై తమకెలాంటి ద్వేషం లేదని, అయితే నిర్బంధంగా తమపై రుద్దడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. బీజేపీ ఒకే భాష, ఒకే సంప్రదాయం, ఒకే ఎన్నిక విధానాన్ని తమిళనాడు, కేరళ ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ... ద్రావిడం అనేది తమిళ సంస్కృతి సంప్రదాయాలకు గౌరవం తెస్తోందన్నారు.దేశంలో ప్రాంతీయ భాషలు సజీవంగా ఉన్నాయంటే ద్రావిడ ఉద్యమమే కారణమన్నారు.

బ్రిడ్జిపై నుంచి విసిరేస్తే చెట్టు కొమ్మల్లో చిక్కిన శిశువు

» కన్న తల్లిదండ్రులే దుర్మార్గులు.. చిన్నారిని కాపాడిన స్థానికులు

న్యూఢిల్లీ, నవంబరు 2: కన్న తల్లిదండ్రులే తమ రెండు నెలల నవజాత శిశువును ఓ వంతెనపై నుంచి విసిరేస్తే? ఈ అమానవీయ ఘటన యూపీలోని హమీపూర్‌లో జరిగింది. అంతెత్తునుంచి పడేస్తే ఆ బిడ్డ బతుకుతుతాడా? బతికాడు... మధ్యలోనే ఓ పెద్ద చెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయాడు. నేరుగా కొమ్మల్లో పడటంతో వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. కాకులు పొడిచాయి. ఓ జంతువు దాడి చేసింది. బిడ్డ శరీరంపై మొత్తంగా 50 చోట్ల గాయాలయ్యాయి. శిశువు ఏడుపు విని స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో ఉంచి ఆరు వారాల పాటు వైద్యులు చికిత్స చేశారు. బాబు పూర్తిగా కోలుకున్నాడు. అనంతరం.. బిడ్డను శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

జంతు సంరక్షణ బిష్ణోయ్ సమాజ్ యూత్ అధ్యక్షుడిగా లారెన్స్ బిష్ణోయ్!

న్యూఢిల్లీ, నవంబరు 2 : గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్(33) ఆలిండియా జంతు సంరక్షణ బిష్ణోయ్ సమాజ్ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అక్టోబరు 29న జరిగిన ఆ సంఘం సమావేశంలో లారెన్స్ నియామకం జరిగినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 1977లో ఏర్పాటైన ఆలిండియా జంతు సంరక్షణ బిష్ణోయ్ సమాజ్.. అటవీ జంతువులు ముఖ్యంగా కృష్ణజింకల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తుంటుంది. కాగా, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్నాడు. సుపారీ తీసుకుని హత్యలకు పాల్పడతాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న లారెన్స్ బిష్ణోయ్‌పై పంజాబ్, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్‌లోని వేర్వేరు పోలీసు స్టేషన్లలో 36కు పైగా కేసులున్నాయి.

ఆంక్షలపై అమెరికాతో చర్చిస్తున్నాం: భారత్


న్యూఢిల్లీ, నవంబరు 2: రష్యాకు సాయం చేస్తున్నారనే కారణంతో భారతీయ కంపెనీలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించడంపై భారత్ స్పందించింది. సమస్యల పరిష్కారానికి అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. వ్యూహాత్మక వాణిజ్యం, నియంత్రణకు సంబంధించి భారతదేశం బలమైన చట్టాలను కలిగి ఉందని అలాగే ఐక్యరాజ్యసమితి ఆంక్షలపై కూడా అవగాహన కలిగి ఉందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. దేశంలోని చట్టాలు, ఐక్యరాజ్యసమితి నిబంధనలకు అతీతంగా ఏ భారతీయ కంపెనీ వ్యవహరించలేదని, దీని గురించి అమెరికాకు వివరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. కాగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు సాయం చేస్తున్నారనే కారణంతో ప్రపంచవ్యాప్తంగా 400 సంస్థలు, వ్యక్తులుపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన 19 కంపెనీలు, ఇద్దరు వ్యక్తులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు అగ్ని పరీక్షేనా..!

సంక్లిష్టంగా బీజేపీతో ముఖాముఖి.. మహారాష్ట్రలో మిత్రుల ఓటు బదిలీపైనే ఆశలు

» హరియాణా ఎన్నికల తర్వాత ఆచితూచి అడుగులేస్తున్న హస్తం

» పోటీలో 50 మంది రెబెల్స్..!



న్యూఢిల్లీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ-కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. సుస్థిరాభివృద్ధి పేరుతో బీజేపీ దూసుకుపోతుండగా.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించి సత్తా చాటేందుకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. అయితే.. హరియాణా ఎన్నికల్లో బీజేపీతో ముఖాముఖి తలబడి.. దెబ్బతిన్న కాంగ్రెస్ మహారాష్ట్రలోనూ భారీ అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. మహారాష్ట్ర విధానసభలో మొత్తం 288 అసెంబ్లీ సీట్లుండగా.. 75 స్థానాల్లో బీజేపీ-కాంగ్రెస్ నేరుగా తలబడుతున్నాయి. కొన్ని స్థానాల్లో నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగనుండగా.. మరికొన్ని చోట్ల మిత్ర పక్షాల ఓటు బదిలీపై ఈ రెండు జాతీయ పార్టీలు ఆధారపడుతున్నాయి. మిత్రపక్షాల ఓటు బదిలీ విషయంలో బీజేపీ ధీమాగా ఉండగా.. కాంగ్రెస్ శిబిరంలో కల్లోలం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరువు ప్రాంతమైన విదర్భతోపాటు.. పశ్చిమ, ఉత్తర మహారాష్ట్రలు, మరాఠ్వాడా, కొంకణ్‌తోపాటు.. ముంబై, థానె ప్రాంతాల్లో కమలం-హస్తం మధ్య గట్టిపోటీ నెలకొంది.

గత ఫలితాల్లో కమలం హవా

2019 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ ముఖాముఖి తలపడ్డ చోట్ల కమలనాథులు పైచేయి సాధించారు. విదర్భ ప్రాంతంలో 32 చోట్ల ఈ రెండు పార్టీలు తలపడగా.. 23 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ తొమ్మిదింటితో సరిపెట్టుకుంది. మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార పీఠానికి చేరువవ్వాలంటే.. విదర్భలో సత్తా చాటాలనే ఆనవాయితీ కొనసాగుతోంది. బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, విపక్ష నేత(కాంగ్రెస్) విజయ్ వెడట్టివార్ ఈ ప్రాంతానికి చెందినవారే. ఇక ముంబై మహానగరంలో అత్యధిక స్థానాలను సాధించే పార్టీ అధికారపీఠానికి చేరువవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ 12 సీట్లు ఉండగా.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్కచోట మాత్రమే విజయం సాధించింది. పట్టణ ఓటర్లు చాలా వరకు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని.. పారిశ్రామికవేత్తలు పూర్తిగా ఆ పార్టీ నియంత్రణలో ఉండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముంబైలో కాంగ్రెస్‌కు మిత్రపక్షం శివసేన(యూబీటీ) ఓట్లు పక్కాగా బదిలీ అయితే తప్ప.. ఆ పార్టీ సత్తా చాటే అవకాశాలు అంతంత మాత్రమే నంటున్నారు. మరాఠ్వాడలో 10 స్థానాలకు గాను.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మూడుచోట్లే సఫలమైంది. పశ్చిమ మహారాష్ట్రలో ఏడు స్థానాలుండగా.. బీజేపీ ఐదింటిని, కాంగ్రెస్ రెండింటిని దక్కించుకున్నాయి.

తిరుగుబాటు బావుటాలు..

టికెట్ల జారీ తర్వాత అసంతృప్తులను, రెబెల్స్‌ను బుజ్జగించడం బీజేపీ- కాంగ్రెస్‌లకు కత్తిమీద సాములా మారినట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలకు చెందిన 50 రెబెల్స్ నామినేషన్లు వేయగా.. ఈ నెల 4న ఉపసంహరణ గడువులోగా వారిని సముదాయించే దిశలో ముఖ్య నేతలు చర్యలు తీసుకుంటున్నారు. 36 మంది మహాయుతి నుంచి టికెట్ ఆశించి భంగపడి.. రెబెల్స్‌గా నిలబడ్డారు. వీరిలో అత్యధికంగా బీజేపీ నుంచి 19 మంది, శివసేన(శిందే వర్గం) నుంచి 16 మంది, ఒకరు ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) నుంచి ఉన్నారు. ఎంవీఏకు చెందిన 14 మంది నేతలు.. తిరుగుబాటు అభ్యర్థులుగా నిలిచారు. వీరిలో అత్యధికంగా 10 మంది కాంగ్రెస్ నుంచి, నలుగురు శివసేన(యూబీటీ) ఉన్నారు. ఇదిలా ఉండగా, రాజ్ థాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సమితి(ఎంఎన్ఎస్)కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్‌థాక్రే కుమారుడు అమిత్‌తోపాటు.. ఆ పార్టీ నుంచి బరిలోకి దిగిన బలమైన అభ్యర్థులకు కమలనాథులు ఏకపక్ష మద్దతునిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది శివసేన(శిందే) వర్గానికి ఇబ్బందికరంగా మారనుంది.

ప్రచారానికి 14 రోజులే..

ఈ నెల 4తో నామినేషన్ల ఉపసంహరణ ముగుస్తుంది. 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకు.. అంటే.. 14 రోజులు మాత్రమే ప్రచారానికి అవకాశం ఉంటుంది. ఈ మధ్యలో ఉండేవి రెండు ఆదివారాలు మాత్రమే..! దీంతో అభ్యర్థులు ఉరుకులు-పరుగులతో ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రెండు ఆదివారాల్లో స్టార్ కాంపెయినర్లు సుడిగాలి పర్యటనలు నిర్వహించాల్సి వస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా బీజేపీ సోషల్ మీడియా విభాగం డిజిటల్ ప్రచారాన్ని ముమ్మరం చేయగా.. కాంగ్రెస్ ఈ విషయంలో ఒకింత వెనకబడి ఉందని తెలుస్తోంది.


నా సలహా ఖరీదు 100 కోట్లు!

» పార్టీల నుంచి వసూలు చేసే ఫీజు ఇదే

» వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వెల్లడి



పట్నా, నవంబరు 2: ఎన్నికల వ్యూహకర్త, బిహార్‌లోని జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిషోర్ తాను వసూలు చేసే ఫీజు ఎంతో వెల్లడించారు. దేశంలోని పలు రాజకీయ పార్టీలకు వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ వాటికి తానందిచిన సేవలకు గానూ తీసుకునే ఫీజు ఎంతో ప్రకటించారు. బిహార్ ఉప ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్... తన ఫీజుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీ నిర్వహణకు తనకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడుగుతున్నారని, తాను ఏదైనా పార్టీకి వ్యూహకర్తగా సేవలందిస్తే అందుకు ఫీజుగా రూ.100 కోట్లు, అంతకుమించి కూడా తీసుకుంటానని చెప్పారు. వివిధ రాష్ట్రాలలో పది ప్రభుత్వాలు తన వ్యూహాలతో నడుస్తున్నాయని ప్రశాంత్‌కిషోర్ చెప్పుకొచ్చారు. తాను ఒక ఎన్నికలకు వ్యూహకర్తగా పనిచేస్తే వచ్చే సొమ్ముతో రెండేళ్ల రాజకీయ పార్టీని నిర్వహించగలనని అన్నారు. ఒక పార్టీ నుంచి వంద కోట్లు, ఆపైన తీసుకునే తాను ఆర్థికంగా బలహీనంగా ఉన్నట్లా? అంటూ ప్రశాంత్ కిషోర్ ఎదురు ప్రశ్నించారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వ్యూహకర్తగా పనిచేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రశాంత్ కిషోర్‌కు ఆ ఎన్నికలలో నరేంద్ర మోదీ విజయం సాధించడంతో తిరుగు లేకుండా పోయింది. ఆ తర్వాత 2015 ఎన్నికలలో బిహార్‌లో జేడీయూ-ఆర్జేడీ కూటమికి ప్రశాంత్ కిషోర్ పనిచేశారు. 2021లో పంజాబ్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించడంలో ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు పనిచేసాయి. 2019లో ఏపీలో వైసీపీకి సలహాదారుగా వచ్చిన ప్రశాంత్...ఆ ఎన్నికలలో జగన్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2020లో ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఘన విజయానికి, 2021లో పశ్చిమబెంగాల్‌లో టీఎంసీకి ప్రశాంత్ కిషోర్ కీలకంగా పనిచేశారు. కాగా, కామన్ సివిల్ కోడ్ విషయంలో ప్రజాభిప్రాయంతో పని లేకుండా ముందుకెళ్లాలనుకోవడం సరైంది కాదని ప్రశాంత్ కిషోర్ అన్నారు. అలా చేస్తే వ్యవసాయ చట్టాల్లాగానే ఉపసంహరించుకోవాల్సి వస్తుందన్నారు.



వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ఉగ్రవాదులు హతం

» నలుగురు జవాన్లకు గాయాలు

» కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఘటన

శ్రీనగర్, నవంబరు 2: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేత కొనసాగుతోంది. శనివారం ఉదయం అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ముష్కరులు హతమయ్యారు. నలుగురు సైనికులు గాయపడ్డారు. శుక్రవారం బుద్గామ్ జిల్లాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వలసకార్మికులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు ముష్కరుల కోసం కూంబింగ్ చేపట్టాయి. అనంత్‌నాగ్ జిల్లాలోని ఖాన్యార్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో గాలింపు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో సైనికులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో జవాన్లు ఎదురుదాడి చేశారు. ఈ ఘటనలో ఓ ఉగ్రవాదిని హతమార్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం హల్కాన్ గాలి ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న క్రమంలో మరో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు చెప్పారు. ఈ ఘటనలో నలుగురు సైనికులు గాయపడ్డారు.

ఉగ్రవాదులను చంపొద్దు.. పట్టుకోవాలి

జమ్మూకశ్మీర్‌లో ఇటీవలి కాలంలో వరుస ఉగ్రవాద దాడులు పెరగడంపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధినేత, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా అనుమానం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ఎవరో కుట్ర పన్ని దాడులు చేయిస్తున్నట్లు ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి ఉగ్రవాద దాడులపై కేంద్రం దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్లలో చంపకుండా, ప్రాణాలతో పట్టుకొని ప్రశ్నిస్తే.. వారి వెనుక ఉన్నవారెవరో బయటకు వస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది.

ఎయిర్ ఇండియా విమానంలో తూటా

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, ఖాట్మాండూ, నవంబరు 2: విమానాలకు వరుస బాంబు బెదిరింపుల వేళ అప్రమత్తంగా ఉండాల్సిన తరుణంలో భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. అక్టోబరు 27న దుబాయ్ నుంచి ఢిల్లీ వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో తూటా లభ్యమైంది. ఏఐ 916 విమానంలో సిబ్బంది శుభ్రం చేస్తుండగా ప్రయాణికుల సీట్ పాకెట్‌లో తూటా దొరికింది. దీంతో ఆయుధ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి శనివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఖాట్మాండూ నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో బాంబు ఉందంటూ అగంతకులనుంచి సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నేపాల్ రాజధాని ఖాట్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు 4 గంటల పాటు తనిఖీలు చేశారు. చివరకు బాంబు బెదిరింపు ఉత్తిదే అని తేల్చారు. ఈ నెల 28న కూడా నేపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానానికి కూడా ఇలాగే బాంబు బెదిరింపు వచ్చింది. సోషల్ మీడియా ద్వారా శనివారం మొత్తం 19 ఇండిగో విమానాలకు బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. గత రెండు వారాల్లో ఇప్పటివరకు 510 స్థానిక, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. కాగా, బిహార్‌లోని దర్భంగా నుంచి న్యూఢిల్లీ వచ్చే బిహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు కూడా శుక్రవారం సాయంత్రం ఇలాంటి హెచ్చరికే వచ్చింది. దీంతో రైలును మధ్యలో ఓ స్టేషన్‌లో నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

మీ చర్యలు బాధ్యతారహితం

ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.. కెనడాకు భారత్ గట్టి హెచ్చరిక

» అమిత్ షాపై కెనడా మంత్రి మోరిసన్ నిరాధార ఆరోపణలు: రణధీర్ జైస్వాల్



న్యూఢిల్లీ/ఒట్టావా, నవంబరు 2: కెనడాలో ట్రూడో ప్రభుత్వంపై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఆ దేశ మంత్రి అసంబద్ధ, నిరాధార వ్యాఖ్యలు చేయడంపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేసింది. కెనడాలోని భారత దౌత్యవేత్తలను ఆడియో, వీడియో నిఘాలో ఉంచడంపై ట్రూడో ప్రభుత్వానికి అధికారికంగా నిరసన తెలిపినట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. శనివారం ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. 'ఈ అంశంపై కెనడా హైకమిషన్ ప్రతినిధికి శుక్రవారం సమన్లు జారీ చేశాం. కేంద్ర హోంమంత్రిని ఉద్దేశించి పబ్లిక్ సేఫ్టీ అండ్ నేషనల్ సెక్యూరిటీ స్టాండింగ్ కమిటీ ముందు ఆ దేశ మంత్రి డేవిడ్ మోరిసన్ ఇటీవల అసంబద్ధమైన, నిరాధారమైన వ్యాఖ్యలు చేయడాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టంగా తెలియజేశాం. భారత్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి, ఇతర దేశాలను ప్రభావితం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే కెనడా అధికారులు అంతర్జాతీయ మీడియాకు నిరాధార సమాచారం లీక్ చేశారు. కెనడాలోని ప్రస్తుత ప్రభుత్వ రాజకీయ అజెండా, ప్రవర్తనా సరళిపై భారత్‌కు చాలాకాలంగా ఉన్న అభిప్రాయాన్ని ఇది ధ్రువీకరిస్తోంది. ఇటువంటి బాధ్యతారాహిత్యమైన చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి' అని జైస్వాల్ పేర్కొన్నారు. 'కెనడాలోని కొందరు భారత దౌత్యవేత్తలు ఆడియో, వీడియో పర్యవేక్షణలో ఉన్నారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వం వారికి ఇటీవల సమాచారం ఇచ్చింది. వారి కమ్యూనికేషన్లను కూడా అడ్డుకున్నారు. ఈ చర్యలు దౌత్య, కాన్సులర్ ఒప్పందాలను ఉల్లంఘించడమే. మన దౌత్య సిబ్బంది ఇప్పటికే తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో పనిచేస్తున్నారు. దౌత్య నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కెనడా చర్యలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి" అని జైస్వాల్ ఆరోపించారు. కెనడాలోని పార్లమెంట్ హిల్‌లో దీపావళి వేడుకలు రద్దు కావడం దురదృష్టకరమన్నారు.

కెనడా మరో కవ్వింపు చర్య

భారత్‌పై కెనడా మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. ఖలిస్థానీ తీవ్రవాదులతో పాటు తమ ప్రభుత్వ నెట్‌వర్క్‌లను హ్యాక్ చేయడానికి భారత అధికారులు సైబర్ టెక్నాలజీని ఉపయోగించారని ట్రూడో ప్రభుత్వం ఆరోపించింది. కెనడాపై సైబర్ దాడికి పాల్పడతాయని అనుమానిస్తున్న దేశాల జాబితాలో భారత్‌ను కూడా చేర్చింది. ఆ దేశ గూఢచార సంస్థ సీఎస్ఈ (కమ్యూనికేషన్స్ సెక్యూరిటీ ఎస్టాబ్లిష్‌మెంట్) తాజాగా విడుదల చేసిన నేషనల్ సైబర్ థ్రెట్ అసెస్‌మెంట్ 2025-26 నివేదికలో చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాతో పాటు ఐదో స్థానంలో భారత్ పేరును కూడా పేర్కొంది. కెనడా సహా ఇతర దేశాల్లోనూ ఖలిస్థానీ శక్తులు, ప్రభుత్వ అసమ్మతివాదులను ట్రాక్ చేయడానికి భారత్ తన సైబర్ సామర్థ్యాలను దుర్వినియోగం చేసిందని సీఎస్ఈ నివేదిక ఆరోపించింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని ఆరోపణలు చేసిన తర్వాత కెనడా మిలిటరీకి చెందిన వెబ్‌సైట్లతో పాటు అనేక కెనడియన్ వెబ్‌సైట్లపై భారత్ అనుకూల హ్యాకర్ల గ్రూపు దాడి ప్రారంభించిందని ఆరోపించింది. ఈ ఆరోపణలపై రణధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. 'ఎప్పటిలాగా ఏ ఆధారాలు లేకుండానే వారు ఇలాంటి ఆరోపణలు చేస్తుంటారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత్‌కు ఎవరితో మేలు!



అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సిద్ధమైంది. మంగళవారమే దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. ఈనేపథ్యంలో ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ట్రంపా? కమలా? ఎవరు గెలిస్తే భారత్‌కు మేలు జరుగుతుంది? అనేదానిపై అనేక విశ్లేషణలు తెరమీదికి వస్తున్నాయి.

కమల హారిస్ గెలిస్తే!

కమల హారిస్.. భారత మూలాలు ఉన్న నాయకురాలు. ఆమె తల్లి తమిళనాడుకు చెందినవారుకాగా, తండ్రి జమైకా దేశానికి చెందిన వారు. ఇరువురు అమెరికాలో వివాహం చేసుకున్నారు. కమల తరచుగా చెన్నైకు రావడమే కాకుండా దక్షిణాది వంటకాలను ఎంతో ఇష్టపడతారు. భారతీయ సంప్రదాయాలను కూడా ఆమె అర్థం చేసుకున్నారు. అయితే, ఆమె భారత్‌కు అత్యంత అనుకూలంగా ఉన్నారా? అనే విషయంలో ఇతమిత్థంగా ఏమీ చెప్పలేని పరిస్థితి ఉంది. గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలు దీనికి బలాన్ని చేకూరుస్తున్నాయి. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు కమల తనదైన శైలిలో స్పందించారు. "ఈ ప్రపంచంలో కశ్మీరీలు ఒంటరిగా లేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. పరిస్థితిని మేం నిశితంగా గమనిస్తున్నాం. అవసరమైనప్పుడు, పరిస్థితులు డిమాండ్ చేసినప్పుడు మేం జోక్యం చేసుకుంటాం" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు, భారత అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని పరిశీలించవచ్చని కూడా అన్నారు. భారత్ వ్యవహారంలో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ విధానాలను ఆమె కొనసాగిస్తే ఆందోళన తప్పదన్న భావన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా భారత్‌లో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, అంతర్గత విషయాల్లో బైడెన్ కొన్ని అభ్యంతరకర విధానాలను అనుసరిస్తున్నారు. ప్రధానంగా ముస్లింలు ఇతర మైనారిటీల విషయంలో మోదీ ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని బైడెన్ సర్కారు ఆరోపిస్తోంది. అయితే, ఇటీవల.. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల మాట్లాడుతూ.. తన పాలన బైడెన్ పాలనకు భిన్నంగా ఉంటుందన్నారు. కమల తన ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్‌ను ప్రకటించారు. వాల్జ్‌కు చైనాతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడం, తరచుగా ఆయన బీజింగ్‌లో పర్యటించడం వంటివి భారత్‌కు భవిష్యత్తులో ఇబ్బందికర పరిణామాలేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలావుంటే, ఇమ్మిగ్రేషన్, ఎనర్జీ అంశాలలో కమల హారిస్ వల్ల భారత్‌కు మేలు జరుగుతుందని చెబుతున్నారు. హెచ్-1బీ వీసాలను మరింత పెంచే అవకాశం ఉందని, ఇది భారత ఐటీ సేవల రంగానికి భారీ మేలు చేస్తుందని అంటున్నారు.

ట్రంప్ విజయం సాధిస్తే!

రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ విజయం దక్కించుకుంటే.. భారత్‌కు ఎలాంటి మేలు జరుగుతుందన్న చర్చ కూడా సాగుతోంది. ప్రధాని మోదీతో ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. భారత్ కూడా ట్రంప్ విజయాన్నే కోరుకుంటున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మోదీ-ట్రంప్ పలు విషయాలపై కలిసి పనిచేయడం, 2020 ఎన్నికల్లో 'అబ్ కీబార్-ట్రంప్ సర్కార్'(ఈ సారి ట్రంప్ ప్రభుత్వమే) అంటూ మోదీ నినదించడం వంటివి ఇరువురి మధ్య బంధాన్ని స్పష్టం చేస్తున్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రంప్ పాలనలో ఇరువురు నేతలు కలిసిమెలిసి పనిచేసినట్టు చెప్పుకొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు భారత్‌కు దన్నుగా మారుతున్నాయి. తాను అధ్యక్ష పీఠం ఎక్కగానే ఈ యుద్ధాన్ని తక్షణం నిలిపివేస్తానని ట్రంప్ హామీ ఇస్తున్నారు. ఇది.. మాస్కోతో చెలిమి చేస్తోందన్న పాశ్చాత్య దేశాల విమర్శల నుంచి బయట పడేందుకు భారత్‌కు ఉపయోగపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే.. ట్రంప్ విజయం సాధిస్తే.. భారత దిగుమతులు, ఎగుమతులపై సుంకాలు పెంచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

- సెంట్రల్ డెస్క్

ఎల్లుండే అమెరికా ఎన్నికలు

» జనవరి 20న శ్వేతసౌధంలోకి కొత్త అధ్యక్షుడు



అమెరికా అధ్యక్ష ఎన్నికలు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 5న ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో అధ్యక్ష రేసులో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ అభ్యర్థి కమల హారిస్‌లలో ఎవరు గెలుస్తారు? ఫలితం ఎప్పుడు వస్తుంది? అనే అంశాలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇరు పార్టీలు చరిత్రాత్మకంగా భావిస్తున్న ఈ ఎన్నికల్లో ఇప్పటికే వివిధ దశల్లో 4.1 కోట్ల మంది అమెరికన్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 5న పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే, అధ్యక్షుడిని ప్రకటించేందుకు కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. స్థానిక మీడియా వర్గాల సమాచారం ప్రకారం.. ఓట్ల లెక్కింపు చేపట్టిన రాత్రి లేదా మరుసటి రోజు విజేతను ప్రకటించవచ్చని తెలుస్తోంది. ఇక, 'అసోసియేటెడ్ ప్రెస్' వంటి పెద్ద సంస్థలు ఇప్పటికే పలు సర్వేలు చేశాయి. పోలింగ్ ప్రక్రియ ముగియగానే ఈ సర్వే ఫలితాలను వెల్లడించనున్నాయి. సాధారణంగా 270 లేదా అంతకన్నా ఎక్కువ ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా పరిగణిస్తారు. ఇక, ఎవరు విజయం దక్కించుకున్నా.. 2025, జనవరి 20న శ్వేత సౌధంలో అడుగు పెట్టనున్నారు.

అత్యంత కీలక రాష్ట్రాలివే

అధ్యక్ష బరిలో ఉన్న వారి జాతకాలను నిర్ణయించే అత్యంత కీలక రాష్ట్రాలు ఏడు ఉన్నాయి. వీటిని స్వింగ్ స్టేట్స్‌గా పిలుస్తారు. జార్జియా, మిచిగాన్, పెన్సిల్వేనియా, అరిజోనా, విస్కాన్సిన్, నెవాడా, ఫ్లోరిడా రాష్ట్రాల ఓటర్లే అంతిమంగా అధ్యక్ష అభ్యర్థిని నిర్ణయిస్తారు. వీరితోపాటు మరో కీలక రాష్ట్రం ఓహియో కూడా ఉంది. గత రెండు దఫాలుగా ఈ రాష్ట్ర ప్రజల తీర్పు కూడా నిర్ణయాత్మకంగా ఉంటోంది. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టాలనుకునేవారికి ఈ రాష్ట్రాల్లో గెలుపు అత్యంత కీలకం. మరీ ముఖ్యంగా గత కొన్ని ఎన్నికల నుంచి పెన్సిల్వేనియా కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడ 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఉన్నాయి. ఇవి దక్కించుకోవడం కోసం అభ్యర్థులు చమటోడుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రసుత్త ఎన్నికల్లోనూ ఈ రాష్ట్రం ఇదే తరహా పాత్ర పోషించనుందని సర్వేలు చెబుతున్నాయి. 2020 ఎన్నికల్లో అరిజోనా, జార్జియా, విస్కాన్సిన్, నెవాడాలలో జో బైడెన్ స్వల్ప ఆధిక్యంతో ట్రంప్‌ను ఓడించారు. అధ్యక్ష ఎన్నికల ఫలితం ఎప్పుడు వస్తుందనేది కూడా.. కీలక రాష్ట్రాలపై ఆధారపడి ఉంటుంది. 2020 ఎన్నికల్లో జో బైడెన్‌ను విజేతగా ప్రకటించేందుకు నాలుగు రోజుల సమయం పట్టింది.

- సెంట్రల్ డెస్క్

తూర్పు మణిహారం విశాఖ

త్వరలో థియేటర్ లెవెల్ కమాండ్ .. త్రివిధ దళాల కేంద్రంగా నగరం.. సమన్వయంతో ఉమ్మడి ఆపరేషన్లు

- దేశ రక్షణలో తూర్పు నౌకాదళం కీలకం
- 'సిటీ ఆఫ్ డెస్టినీ'కి ఎన్నెన్నో ప్రత్యేకతలు
- 3 అణు జలాంతర్గాముల తయారీ
- 2 నెలల వ్యవధిలోనే 2 జలప్రవేశం



తూర్పు నౌకాదళం ఇటీవల స్టార్ ఎస్-4 అణు జలాంతర్గామిని ప్రారంభించడంతో విశాఖపట్నం పేరు ప్రపంచమంతా మార్మోగిపోయింది. రెండు నెలల క్రితమే ఐఎన్ఎస్ అరిఘాత్ సేవలను ప్రారంభించగా, ఆ వెంటనే స్టార్ ఎస్-4 జలప్రవేశం చేయడంతో ప్రపంచం ఆశ్చర్యపోయింది. స్వదేశీ పరిజ్ఞానంతో విశాఖలో తయారు చేసిన మూడో అణు జలాంతర్గామి ఇది. మన దేశ రక్షణ రంగంలోనే తూర్పు నౌకాదళం అత్యంత వ్యూహాత్మక, కీలకమైనది. విశాఖ కేంద్రంగా సేవలందిస్తున్న తూర్పు నౌకాదళంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు తీరానికి మణిహారం విశాఖపట్నం. దేశ రక్షణలో ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా సైనిక దళం(ఆర్మీ), విశాఖలో తూర్పు నౌకాదళం ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ కేంద్రం ఉన్న ఏకైక నగరంగా విశాఖ నిలిచింది. అమెరికా, చైనా దేశాల మాదిరిగా త్రివిధ దళాలు కలిసి ఒక్కచోటే పనిచేసేలా కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం త్వరలో 'థియేటర్ లెవెల్ కమాండ్'లను ఏర్పాటు చేయనుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ మూడూ ఒక్కచోటే ఉండి సమన్వయంతో పనిచేస్తూ ఉమ్మడి ఆపరేషన్లు నిర్వహిస్తాయి. అలాంటి థియేటర్ లెవెల్ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతోంది.

విశాఖ ప్రత్యేకతలు ఇవీ..

'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరున్న విశాఖకు ఉన్న ప్రత్యేకతలే దేశ రక్షణలో కీలకంగా నిలిచేలా చేస్తున్నాయి. భారతదేశానికి వలస వచ్చిన ఆంగ్లేయులు నాడు చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న ఈ ప్రాంతం సముద్ర వ్యాపార కేంద్రానికి అనువుగా ఉంటుందని గుర్తించారు. నౌకలు లంగరు వేసుకోవడానికి సహజ సిద్ధమైన తీర ప్రాంత అమరిక ఉండడంతో పోర్టు నిర్మాణం, ఆ తర్వాత దేశ రక్షణ కోసం నౌకాదళం ఏర్పాటయ్యాయి. దేశంలో భౌగోళికంగా అది పెద్దది విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళమే. దీని పరిధిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలు ఉన్నాయి. బంగాళాఖాతంతో పాటు హిందూ మహా సముద్రంలో సగభాగానికి ఈ దళమే బాధ్యత వహిస్తోంది. త్రివిధ దళాల్లో అతి పెద్దది తూర్పు నౌకాదళం. ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అన్నింటిలోకి అతి పెద్ద సంస్థ. వేలాది మంది పనిచేస్తున్నారు. తూర్పు నౌకాదళంలో యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అణు జలాంతర్గాములు, యుద్ధ విమానాలతో పాటు మూడు నేవల్ ఎయిర్ స్టేషన్లు ఉన్నాయి. విశాఖలో ఐఎన్ఎస్ డేగా, తమిళనాడులో ఐఎన్ఎస్ రజాలి, దక్షిణ తమిళనాడులో ఐఎన్ఎస్ పరందు ఉన్నాయి. వీటిలో నిఘా విమానాలు పీ8ఐలు కూడా పనిచేస్తున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా విశాఖ కేంద్రంగానే పని చేయనుంది. న్యూక్లియర్ సబ్‌మెరైన్లు కూడా ఇక్కడే నావల్ డాక్‌యార్డులోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో తయారవుతున్నాయి.

చెరగని ముద్ర

కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేయడంలో తూర్పు నౌకాదళం కీలకంగా వ్యవహరిస్తోంది. యూపీఏ ప్రభుత్వం 'లుక్ ఈస్ట్ పాలసీ' అమలు చేసినపుడు తూర్పు తీర దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగించింది. తర్వాత వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా మార్చింది. తూర్పు దేశాలతో స్నేహమే కాకుండా ఆర్థిక, సాంస్కృతిక బంధాలు బలోపేతం చేయాలన్నది దీని ఉద్దేశం. దీనిని అమలు చేయడానికి 2022లో మిలాన్ పేరుతో అతి పెద్ద కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించినపుడు 50 దేశాలు పాల్గొన్నాయి. విశాఖ కేంద్రంగా రెండేళ్లకోసారి ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. అంతకు ముందు 2006లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ నిర్వహించారు. సునామీ వచ్చిన రెండేళ్లకు 2016లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ నిర్వహించారు.

స్వదేశీ పరిజ్ఞానంతో

భారత నౌకాదళం తొలుత రష్యా నుంచి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్రను లీజుకు తీసుకుంది. ఆ తరువాత విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదట ఐఎన్ఎస్ అరిహంత్‌ను నిర్మించింది. ఇది 2016లో నేవీలో చేరి సేవలు అందిస్తోంది. రెండు నెలల క్రితం ఆగస్టు 29న ఐఎన్ఎస్ అరిఘాత్ అన్ని పరీక్షలు పూర్తి చేసుకొని నేవీలో చేరింది. తాజాగా అక్టోబరు 16న మూడో అణు జలాంతర్గామి స్టార్ ఎస్-4 పేరుతో సముద్ర జలాల్లో ప్రవేశించింది. దీనికి ఐఎన్ఎస్ అర్ధమాన్ అని పేరు పెడతారని విశ్వసనీయ సమాచారం.

నిరంతరం దేశ రక్షణలో..

రక్షణ శాఖ పరిధిలోని రెండు సంస్థలు విశాఖ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అందులో ఒకటి హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్. మరొకటి ఆటోనగర్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్). షిప్‌యార్డ్‌లో నేవీ నౌకలు నిర్మితమవుతుండగా, బీడీఎల్‌లో రక్షణ శాఖకు అవసరమైన పరికరాలు తయారవుతున్నాయి. రక్షణ శాఖకు పరిశోధనలు చేసే డీఆర్‌డీఓకు దేశంలో 24 లేబొరేటరీలు ఉండగా అందులో విశాఖపట్నం అతి ప్రధానమైనది. అదే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ. నేవీకి సంబంధించిన రాడార్లు, సోనార్లు, టార్పెడోలు ఇక్కడే రూపుదిద్దుకుంటున్నాయి. వరుణాస్త్రకు ఇక్కడే రూపకల్పన చేశారు. మెరైన్ కమెండోలకు శిక్షణ ఇచ్చేందుకు భీమిలి సమీపాన ఐఎన్ఎస్ కర్ణ.. సబ్‌మెరైన్లలో పనిచేసే వారికి శిక్షణ ఇచ్చేందుకు ఐఎన్ఎస్ శాతవాహన.. నౌకా నిర్మాణంలో ఆర్కిటెక్చర్, హల్ మౌంట్, సెయిలర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఐఎన్ఎస్ విశ్వకర్మ శ్రమిస్తున్నాయి. ఇక ఐఎన్ఎస్ డేగాలో జెట్ ఫైటర్లు, మిగ్ 29-కేలపై శిక్షణ ఇస్తున్నారు.

కొత్త యువ ఓటర్లు 4.74 లక్షలు

- మొత్తం ఓటర్లు 3.34 కోట్లు.. అందులో మహిళలే అధికం
- 4.14 లక్షల డూప్లికేట్ల తొలగింపు.. జనవరిలో తుది జాబితా
- ఈ నెల 9, 10న స్పెషల్ డ్రైవ్: సీఈఓ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 4,73,838 మంది యువ ఓటర్లు కొత్తగా నమోదయ్యారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సారి కొత్తగా సుమారు 8 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. కొత్త వారితో కలిపి రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,34,26,323కు చేరిందని ఆయన వివరించారు. వీరిలో 1,66,16,446 మంది పురుష ఓటర్లు, 1,68,07,100 మంది మహిళా ఓటర్లు, 2777 మంది థర్డ్ జెండర్‌కు చెందిన వారు ఉన్నారన్నారు. బీఆర్‌కే భవన్‌లోని ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సుదర్శన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఓటర్ల తుది జాబితా జనవరి 6న ప్రకటిస్తామన్నారు.

ఓటర్ల నమోదుకు ఈ నెల 9, 10న స్పెషల్ డ్రైవ్

ఓటర్ల నమోదుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 9, 10న స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు, యువత నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఆ రెండు రోజులు అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. నేరుగా వెళ్లి లేదా, సీఈవో అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 వరకు స్వీకరిస్తామని సీఈవో తెలిపారు. అధికారిక సోషల్ మీడియా వేదిక ద్వారా కూడా తమ అభ్యంతరాల్ని అధికారుల దృష్టికి తేవచ్చన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1950కు కూడా తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. పరిశీలన అనంతరం 4 లక్షల 14 వేల 165 డూప్లికేట్ ఓట్లు తొలగించామని సుదర్శన్ రెడ్డి తెలిపారు.

నిర్మల్ జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల పట్టివేత

నర్సాపూర్ (జి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీ మండలం అర్లి కె ఎక్స్ రోడ్డు వద్ద శనివారం మండల విస్తరణాధికారి నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. భైంసా మండలం చాత గ్రామానికి చెందిన చందుల మహేశ్ అనే వ్యక్తి విత్తనాల బస్తాలను బైక్‌పై తీసుకెళుతుండగా గమనించి, అనుమానం వచ్చి పరిశీలించగా అవి నకిలీవని తేలింది. మొక్కజొన్న బ్యాగులపై ఉన్న క్యూఆర్ కోడ్‌పై స్కాన్ చేయగా వివరాలు రాలేదు. బస్తాలపై బ్యాచ్ నెంబర్ కూడా లేకపోవడంతో స్థానికంగా ఉన్న పయనీర్ కంపెనీ ప్రతినిధి చంద్రకాంత్‌ను పిలిపించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న మొక్కజొన్న విత్తనాల విలువ రూ.71 వేల వరకు ఉంటుందని అధికారి తెలిపారు. కాగా, పయనీర్ కంపెనీ ఒరిజినల్ బ్యాగు ధర మార్కెట్‌లో రూ. 1900లు ఉండగా, ఈ నకిలీ విత్తనాల బ్యాగులపై రూ. 2,392 ఉండడం కొసమెరుపు.

హోటళ్లను బట్టి ఫుడ్ ఇన్‌స్పెక్టరు

- ప్రభుత్వం యోచన.. కసరత్తు మొదలు
- రాష్ట్రంలో హోటళ్ల వివరాల సేకరణ
- లెక్క తేలాక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల భర్తీ

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై నిరంతరం నిఘా పెట్టేందుకు ఇకపై జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రంలో హోటళ్ల సంఖ్య ఆధారంగా ఆహార తనిఖీ అధికారుల(ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు)ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని హోటళ్లు ఉన్నాయన్నదానిపై వైద్య ఆరోగ్యశాఖ ఆరా తీస్తోంది. హోటళ్ల సంఖ్య లెక్కతేలిన తర్వాత.. ఎన్ని హోటళ్లకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలన్న దానిపై నిర్ణయానికి రానున్నారు. దీనిపై ఒక కమిటీని వేసే యోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) లెక్కల ప్రకారం ఈ ఏడాది జూన్ చివరికి హైదరాబాద్‌లో 74,807 రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవి కాకుండా తగిన అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన హోటళ్లు, రెస్టారెంట్లు వేల సంఖ్యలో ఉంటాయి. ఏటా ఈ హోటళ్ల ద్వారా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ఇంత భారీ స్థాయిలో ఫుడ్ బిజినెస్ జరుగుతున్నప్పటికీ హోటళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించే విషయంలో రాష్ట్ర అధికార యంత్రాంగం బాగా వెనుకబడింది. మానవ వనరుల కొరత కారణంగా పర్యవేక్షణ అసలే ఉండటం లేదు. హైదరాబాద్‌లో 74 వేల రెస్టారెంట్లు ఉంటే కేవలం 23 మందే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లున్నారు. అంటే ప్రతీ 3,552 రెస్టారెంట్లకు ఒక ఆహార తనిఖీ అధికారి ఉన్నారన్నమాట. దీన్ని బట్టి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓ అధికారి సెలవు రోజులు మినహాయించి, రోజుకు 10 చొప్పున హోటళ్లు తనిఖీ చేసినా కూడా ఒక ఏడాదిలో అన్ని హోటళ్లను తనిఖీ చేయడం అసాధ్యం. కాగా, ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని అనేక హోటళ్లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నిర్వహించగా దాదాపు అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార నాణ్యతను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తేలింది.

ఇనుప ర్యాక్‌ల మంచం మీద పడి..

ఐదో తరగతి విద్యార్థి మృతి

జహీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్‌కు అనుబంధంగా ఉన్న ఓ హాస్టల్‌లో ర్యాక్‌లతో కూడిన మంచం మీద పడి ఐదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌లో జరిగింది. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాకు చెందిన సాత్విక్(12) జహీరాబాద్‌లోని సెవెంత్‌డే అడ్వెంటిస్టు ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లోనే విద్యార్థి ఉంటున్నాడు. శనివారం ఉదయం సాత్విక్ ఇనుప ర్యాక్‌లతో ఉండే మంచంపై నుంచి దిగుతూ ముందుకు బోర్లా పడ్డాడు. అదే సమయంలో మూడు ర్యాక్‌ల మంచం కూడా అతడిపై పడింది. తీవ్ర గాయాలైన సాత్విక్‌ను వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించారు.

కేదార్‌నాథ్‌కు అఘోరీ

నెన్నెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి నుంచి అఘోరీ శుక్రవారం అర్ధరాత్రి కేదార్‌నాథ్‌కు బయలుదేరింది. కుటుంబసభ్యుల సమక్షంలో అఘోరీని పోలీసులు రాష్ట్ర సరిహద్దు దాటించారు. ధర్మ పరిరక్షణ కోసం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆత్మార్పణం చేస్తానని ప్రకటించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని స్వగ్రామం కుశ్నపల్లికి తరలించిన సంగతి తెలిసిందే. కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఏసీపీ రవికుమార్, సీఐ అఫ్జలుద్దీన్ అఘోరీకి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే వినోద్ అఘోరీ తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామస్తులు, భక్తులు ప్రాణత్యాగం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. దీంతో అఘోరీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో శివుడికి ప్రత్యేక పూజలు చేయాల్సి ఉందని ప్రస్తుతానికి కేదార్‌నాథ్ వెళ్తున్నానని చెప్పింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

మరీ ఇంత నీచమా?

దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబం బజారున పడింది. నిన్నటి దాకా వివేకానంద రెడ్డి హత్య నేపథ్యంలో కుటుంబంలో గొడవలు ఏర్పడగా, ఇప్పుడు ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పదహారు మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరిలో కాసు బ్రహ్మానంద రెడ్డికి మినహా మిగతా అందరికీ పిల్లలు ఉన్నారు. చాలా మంది ముఖ్యమంత్రుల పిల్లలు ఎవరో, ఇప్పుడేం చేస్తున్నారో, ఎక్కడ ఉంటున్నారో కూడా చాలా మందికి తెలియదు. మాజీ ముఖ్యమంత్రుల పిల్లల్లో ఒక్క జగన్మోహన్‌రెడ్డి మాత్రమే రాజశేఖర రెడ్డి వారసత్వంతో ముఖ్యమంత్రి కాగలిగారు. అదే సమయంలో రాజశేఖర రెడ్డి కుటుంబంలో మరే ఇతర మాజీ ముఖ్యమంత్రుల ఇళ్లలో జరగని విధంగా గొడవలు కూడా తార స్థాయికి చేరాయి. అధికారంతో పాటు సంపద కూడా పోగవడంతో పంపకాల్లో వివాదం ఏర్పడింది. అటు అధికారంలోనూ, ఇటు సంపద పంపిణీలోనూ అన్న జగన్మోహన్‌రెడ్డి తనకు న్యాయం చేయలేదన్న ఆవేదనతో చెల్లి షర్మిల రాజకీయంగా వేరు కుంపటి పెట్టుకున్నారు. ఏ పార్టీని అంటిపెట్టుకొని రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారో ఆ పార్టీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని ఆగ్రహించి జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని ముఖ్యమంత్రి కాగా, చెల్లి షర్మిల తన తండ్రి నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకే రాష్ట్ర అధ్యక్షురాలిగా ఇప్పుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ఉన్న ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. తాను ఆశించిన రాజ్యసభ పదవి లభించి ఉంటే అన్నతో షర్మిల విభేదించి ఉండేవారు కాదు. వైసీపీలో తన పాత్ర లేకుండా పోవడానికి వదిన భారతి కారణం అన్నది షర్మిల భావన! అదే సమయంలో రాజశేఖర రెడ్డి సొంత తమ్ముడైన వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాశ్ రెడ్డికి జగన్ దంపతులు వత్తాసు పలకడం కూడా రాజశేఖర రెడ్డి కుటుంబంలో విభేదాలు భగ్గుమనడానికి ప్రధాన కారణమైంది. ఇప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం కూడా వచ్చిపడింది. దీంతో రాజశేఖర రెడ్డి భార్య శ్రీమతి విజయలక్ష్మి నోరు విప్పాల్సి వచ్చింది. కుటుంబ ఆస్తులలో జగన్, షర్మిలకు సమాన హక్కు ఉందని, అలా ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆజ్ఞ అని ఆమె బహిరంగ లేఖ ద్వారా తేల్చి చెప్పారు. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. అయితే విజయలక్ష్మి చెప్పిన విషయాలతో జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న వారు విభేదిస్తున్నారు. సోషల్ మీడియాలో పలువురు పోస్టులు, వీడియోల రూపంలో జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఆస్తుల్లో వాటా ఉన్న మాట నిజమైతే షర్మిలపై కేసులు ఎందుకు లేవు? ఉమ్మడి ఆస్తులైతే ఎంఓయూ అవసరం ఏమిటి? వంటి ప్రశ్నలను లేవనెత్తడంతో పాటు షర్మిలను విలన్‌గా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో చిత్తుగా ఓడిన తర్వాత కూడా జగన్‌రెడ్డికి మద్దతుగా సోషల్ మీడియాలో అంతమంది నిలబడడం ఆశ్చర్యంగా ఉంది. దీన్నిబట్టి వారందరినీ జగన్‌రెడ్డి బాగా సంతృప్తిపరుస్తున్నట్టు భావించాలి. రాజశేఖర రెడ్డి భార్యగా, కుటుంబ పెద్దగా విజయలక్ష్మి చెప్పిన అంశాలతో కూడా జగన్ మద్దతుదారులు విభేదించడం ఆశ్చర్యం కలిగించింది. అప్పట్లో ఏమి జరిగిందో చెప్పగలిగే అర్హత విజయలక్ష్మికి కాక మరెవరికి ఉంటుంది? రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు, తర్వాతా ఏం జరిగిందో ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుంది? అయినా విజయలక్ష్మి చెబుతున్న దాంట్లో వాస్తవం లేనట్టుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? అవి అక్రమ ఆస్తులా? సక్రమ ఆస్తులా? అన్న అంశాలు మరుగున పడిపోయాయి. అన్న, చెల్లెలు ఏ ఆస్తుల కోసం గొడవ పడుతున్నారో ఆ ఆస్తులన్నీ అక్రమ సంపాదన అంటూ సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసి జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా చార్జిషీట్లు కూడా దాఖలు చేశాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే క్విడ్ ప్రో కో అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్‌రెడ్డి అంతులేని సంపదను పోగేసుకున్నారని, పలు కంపెనీలు ఏర్పాటు చేశారని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇందులో నిజం ఉందా? లేదా? అన్నది న్యాయస్థానంలో తేలాల్సి ఉంది. వ్యవస్థలను, వ్యక్తులను ప్రభావితం చేస్తుండటం వల్ల సదరు కేసులు విచారణకు నోచుకోకుండా మూలుగుతున్నాయి. జగన్‌రెడ్డి నిజంగానే అనితర సాధ్యమైన తెలివితేటలతో సదరు ఆస్తులను సమకూర్చుకొని ఉంటే విచారణలో జాప్యం జరగకుండా సహకరించి తాను నిర్దోషినని రుజువు చేసుకుంటే ఏ గొడవా ఉండదు. అలా జరగడం లేదంటేనే అనుమానాలు బలపడుతున్నాయి. వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో కూడా ఇదే జరుగుతోంది. ఈ కేసు విచారణ జరిగే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదని హైకోర్టు న్యాయమూర్తి స్వయంగా వ్యాఖ్యానించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అక్రమాస్తులో, సక్రమాస్తులో నిర్ధారణ కాని ఆస్తుల పంపకాలపై అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు రాజుకున్నాయి. ఆస్తి పంపకాలలో కూతురికి అన్యాయం జరగడాన్ని జీర్ణించుకోలేని విజయలక్ష్మి నోరు విప్పారు.

అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా..

ఇప్పుడు విజయలక్ష్మి లేఖలోని అంశాల విషయానికి వద్దాం. ఆస్తులు ఎలా పంచుకోవాలో రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారని విజయలక్ష్మి చెబుతున్నందున అలా ఎలా? అని అడిగే అర్హత ఇతరులకు, ముఖ్యంగా జగన్ మద్దతుదారులకు ఉండదు. షర్మిల వాదనలో పస లేదని రాజశేఖర రెడ్డి తోడల్లుడైన వైవీ సుబ్బారెడ్డి, అప్పటి ఆడిటర్, అవినీతి కేసుల్లో ఏ–2గా ఉన్న విజయసాయి రెడ్డితో జగన్‌రెడ్డి చెప్పించడంతో విజయలక్ష్మి రంగప్రవేశం చేశారు. ఇదీ నిజం అంటూ బహిరంగ లేఖ రాశారు. అయినా సోషల్ మీడియాలో జగన్ మద్దతుదారులు విజయలక్ష్మిపై కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారి పిల్లలు ఎవరూ కూడా ఇలా ఆస్తుల కోసం కొట్టుకోలేదన్న విషయాన్ని జగన్ మద్దతుదారులు విస్మరిస్తున్నారు. విజయలక్ష్మి లేఖ తర్వాత ఆస్తుల్లో షర్మిలకు సమాన హక్కు ఉన్న పక్షంలో ఎంఓయూ రాసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని వైసీపీ నాయకులు కూడా ప్రశ్నిస్తున్నారు. మామూలుగా అయితే ఇందులో లాజిక్ ఉంది. ఎంఓయూ అవసరం ఏమిటో తెలియాలంటే రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఏమనుకున్నారో, ఏం జరిగిందో తెలుసుకోవాలి. ముందుగా విజయలక్ష్మి తన లేఖలో పేర్కొన్న విషయాలు నిజం కాని పక్షంలో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి వాటిని ఎందుకు ఖండించలేదో చెప్పాలి. ఎందుకంటే విజయలక్ష్మి చెప్పినవన్నీ అక్షర సత్యాలని ఆ ఇద్దరికీ తెలుసు. అందుకే వారు అబద్ధాలు చెప్పారని విజయలక్ష్మి అన్నప్పటికీ నోరు మెదపడంలేదు. షర్మిలకు వ్యతిరేకంగా, జగన్‌కు అనుకూలంగా వైవీ సుబ్బారెడ్డి విలేఖరుల సమావేశం పెట్టిన తర్వాత.. ఆయన కుమారుడు విజయలక్ష్మి వద్దకు వెళ్లి 'మా నాన్నను అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా. జగన్ వద్ద మేం జీతగాళ్లం మాత్రమే. మమ్మల్ని అర్థం చేసుకోండి' అని చెప్పుకొన్నారు. ఇది నిజమో కాదో జగన్ మద్దతుదారులు తెలుసుకోవాలి. దీన్నిబట్టి ఎవరు చెబుతున్నది నిజమో? ఎవరి పక్షాన ధర్మం ఉందో? ఎవరు న్యాయం చేయాలనుకుంటున్నారో? ఎవరు అన్యాయం చేస్తున్నారో స్పష్టమవుతుంది.

సాయీ.. బిడ్డకు అన్యాయం జరగొద్దు!

రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం ఎందుకు జరగలేదన్నది ఇప్పుడు కీలకం. వాస్తవానికి 2004కు ముందు రాజశేఖర రెడ్డికి ఉన్న ఆస్తులను జగన్, షర్మిల మధ్య పంచారు. తంటా అంతా 2004లో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సమకూరిన ఆస్తుల విషయంలోనే. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నెలకొల్పిన కంపెనీలు, సమకూర్చుకున్న ఆస్తులు జగన్‌రెడ్డి పేరు మీదనే ఎందుకున్నాయో ఆడిటర్‌గా ఉన్న విజయసాయి రెడ్డికి తెలుసు. ఒక దశలో విజయసాయి రెడ్డిని రాజశేఖర రెడ్డి పిలిపించుకొని 'సాయీ.. ఆస్తులు, కంపెనీలు అన్నీ జగన్‌రెడ్డి పేరు మీదనే ఎందుకు ఏర్పాటు చేస్తున్నావు? మా షర్మిల పరిస్థితి ఏమిటి? ఆమెకు కూడా సమానంగా వాటా ఉండాలి. నా భార్య విజయలక్ష్మి పేరిట ఆస్తులు ఏమీ వద్దు' అని ఆయన స్పష్టంచేశారు. దీనికి విజయసాయి రెడ్డి బదులిస్తూ 'ఇప్పుడు ఆస్తులు, కంపెనీలు షర్మిల పేరు మీదకు బదిలీ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. మొత్తం ఆస్తులు జగన్ పేరిట ఉన్నప్పటికీ అన్న జగన్ తన చెల్లి షర్మిలకు గిఫ్ట్‌గా ఎప్పుడైనా ఇవ్వవచ్చు' అని చెప్పడంతో 'అదేదో జాగ్రత్తగా చూడు. నా బిడ్డకు అన్యాయం జరగకూడదు' అని రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారు. ఇది నిజమో కాదో విజయసాయి రెడ్డి, జగన్‌రెడ్డి చెప్పాలి. ఈ నేపథ్యంలోనే ఆస్తుల్లో పిల్లలు ఇద్దరికీ సమాన హక్కు ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆజ్ఞ అని విజయలక్ష్మి తన లేఖలో స్పష్టంచేశారు. మనవళ్లు, మనవరాళ్లకు కూడా ఆస్తుల్లో సమాన హక్కు ఉండాలని రాజశేఖర రెడ్డి భావించేవారు. 2019లో అధికారంలోకి వచ్చే వరకు తల్లీ చెల్లితో జగన్‌రెడ్డి సఖ్యతగానే ఉన్నారు. ఆస్తుల పంపకాల ప్రస్తావన తేలేదు. ముఖ్యమంత్రి కాగానే ఆస్తులు పంచుకుందాం అన్న ప్రతిపాదన జగన్‌రెడ్డి తెర మీదకు తెచ్చారు. సదరు ఆస్తుల్లో షర్మిలకు వాటా లేని పక్షంలో పంపకాల ప్రస్తావనను జగన్ ఎందుకు తెచ్చారో, ఎంఓయూ ఎందుకు రాశారో చెప్పాలి కదా! రాజశేఖర రెడ్డి ఆజ్ఞ మేరకు షర్మిలకు సమాన హక్కు ఉన్నప్పటికీ ఆస్తుల్లో 40 శాతం మాత్రమే ఇస్తానని జగన్ ఎందుకు అడ్డం తిరిగారు? ఆస్తులను 55:45 శాతం నిష్పత్తిలోనైనా పంచమని విజయలక్ష్మి ప్రతిపాదించినా జగన్‌రెడ్డి అంగీకరించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 40 శాతం వాటాకే షర్మిల అంగీకరించాల్సి వచ్చింది. అప్పట్లో ఆ కుటుంబంలో ఏం జరిగిందో తెలుసుకొనే ప్రయత్నం చేయకుండానే పేటీయం బ్యాచ్‌తో పాటు జగన్‌రెడ్డి మద్దతుదారులుగా ఉంటున్న ఉన్మాద మూక విజయలక్ష్మి, షర్మిలను సోషల్ మీడియాలో బండ బూతులు తిడుతున్నారు. జగన్‌రెడ్డి అతి మంచితనం వల్ల ఈ సమస్య వచ్చిందని విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వారు చెప్పడం వినడానికి కూడా రోతగా ఉంది.

ఆ రెంటిపైనే ప్రేమ!

జగన్‌రెడ్డికి నిజంగానే అంత వ్యాపార దక్షత ఉండి ఉంటే 2004కు ముందు కొత్త కంపెనీలు ఎందుకు ప్రారంభించలేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి కదా! ఇబ్బడిముబ్బడిగా కంపెనీలు ఏర్పాటు కావడం, వాటిల్లోకి ఎవరెవరో పెట్టుబడులు పెట్టడం వెనుక చిదంబర రహస్యం చిత్రగుప్తుడు విజయసాయి రెడ్డికి తెలియదా? ఆస్తుల్లో వాటా ఉండి ఉంటే షర్మిలపై కేసులు ఎందుకు లేవో చెప్పాలి? అని ప్రశ్నిస్తున్న వారికి విజయసాయి రెడ్డే సమాధానం చెప్పగలరు. రాజశేఖర రెడ్డి కోరుకున్నట్టు సగం ఆస్తులను షర్మిల పేరిట విజయసాయి రెడ్డి ఏర్పాటు చేసి ఉంటే ఆమెపై కూడా కేసులు పెట్టి ఉండేవారు. జగన్‌రెడ్డి నిజంగా అంత మంచివాడైతే తుచ్ఛమైన ఆస్తుల కోసం రక్తం పంచుకుపుట్టిన చెల్లితో గొడవలకు దిగుతారా? సొంత తల్లి పైనే కోర్టుకు ఎక్కుతారా? కనీస వాస్తవాలు తెలుసుకోకుండా జగన్‌రెడ్డికి మద్దతుగా మాట్లాడిన వారు ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారు? సొంత తల్లి, చెల్లికి వ్యతిరేకంగా రోత మీడియాలో అడ్డమైన రాతలు రాయిస్తున్న జగన్‌రెడ్డి మంచివాడా? తన భార్యను కూడా బజారుకు ఈడుస్తారని తెలిస్తే రాజశేఖర రెడ్డి రోత మీడియా ఏర్పాటుకు అంగీకరించి ఉండేవారు కారు. జగన్‌రెడ్డికి రెండు విషయాల మీదనే ప్రేమ ఉంటోంది. ఒకటి అధికారం, రెండవది సంపద. ఇప్పుడు భార్య భారతి మీద కూడా అపరిమితమైన అనురాగం ఏర్పడింది. తల్లీ చెల్లి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న జగన్‌రెడ్డిలో అతి మంచితనం ఉందంటే నమ్మేవారు ఉంటారా? ఉంటారులెండి.. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒక వర్గం ప్రజలను విచక్షణతో ఆలోచించలేని స్థితికి తీసుకువెళ్లిన ఘనత జగన్‌రెడ్డి సొంతం. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయనకు కుడి భుజంగా మెలిగిన వారందరూ ఇప్పుడు జగన్‌రెడ్డితో ఎందుకు లేరు? అని ఆలోచించగలిగే శక్తి వారికి లేకుండా చేశారు. జగన్మాయతో రాష్ట్రంలో కొత్తగా ఉన్మాద మూక పుట్టుకొచ్చింది. పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నప్పుడల్లా తండ్రి రాజశేఖర రెడ్డి అవసరాన్ని జగన్‌రెడ్డి గుర్తిస్తారు. అందుకే తాజా ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజశేఖర రెడ్డి బొమ్మను వాడుతున్నారు. తన బిడ్డ జగన్‌ను ఆశీర్వదించమంటూ గతంలో విజయలక్ష్మి విడుదల చేసిన వీడియోలను తాజాగా సోషల్ మీడియాలో వదులుతున్నారు. రాజకీయంగా ఉపయోగపడినంత వరకే తల్లీ, తండ్రీ, చెల్లీ ఎవరైనా జగన్‌కు గుర్తుకువస్తారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిన తర్వాత కూడా జగన్‌రెడ్డి వైఖరిలో మార్పు రాకపోవడం పట్ల కొందరు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

అదీ వైఎస్ స్థాయి.. మరి జగనెక్కడ?

జగన్ మనస్తత్వాన్ని విశ్లేషిస్తే ఆయన ఎలాంటి వారో తెలుస్తుంది. అలాంటి లక్షణాలు ఉన్న వారెవరూ మారరు. ఈ కారణంగానే కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కూడా గడవక ముందే ఉన్మాద మూకను ఉసిగొల్పారు. తుచ్ఛమైన ఆస్తుల కోసం తల్లీ చెల్లీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న జగన్‌రెడ్డి, ఆయన మద్దతుదారుల విషయంలో ప్రజలే అప్రమత్తంగా ఉండాలి. రాజశేఖర రెడ్డి మీద అభిమానంతో ఇంకా ఎవరైనా జగన్‌రెడ్డిని అభిమానిస్తుంటే వారికంటే అమాయకులు ఎవరూ ఉండరు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటనను ఇక్కడ గుర్తుచేసుకుందాం. రాజకీయంగా అండగా ఉన్న మరో పార్టీకి చెందిన నాయకుడికి ఇంత డబ్బు పంపు అని రాజశేఖర రెడ్డి తన ఆత్మబంధువు కేవీపీకి సూచించారు. ఆ మొత్తం ఎంతో విని కేవీపీ రామచంద్రరావు అంతెందుకు అని ప్రశ్నించగా 'మనమేమైనా మట్టి పని చేసి సంపాదించామా? అధికారంలో ఉన్నందుకు డబ్బు వచ్చి పడుతోంది. చెప్పినట్టు చెయ్యి' అని స్పష్టంచేశారు. మరో సందర్భంలో ఒకాయన తన కుమార్తె వివాహ పత్రికను అందించడానికి రాజశేఖర రెడ్డిని కలిశారు. శుభలేఖ అందించి బయటకు వచ్చిన కొద్దిసేపటికి ఆయనను కేవీపీ కలిసి 'మీ అమ్మాయి అయినా మా అమ్మాయి అయినా ఒకటే. పెళ్లి ఘనంగా జరిపించడానికి ఎంత కావాలో చెప్పండి' అని రాజశేఖర రెడ్డి తరఫున అడిగారు. దీనికి ఆయన ఉబ్బితబ్బిబై[illegible]ప్పటికీ మృదువుగా తిరస్కరించారు. అలాంటి రాజశేఖర రెడ్డి ఎక్కడ? ఆస్తుల కోసం తల్లీ చెల్లీ అని కూడా చూడకుండా వారిని బూతులు తిట్టిస్తున్న జగన్‌రెడ్డి ఎక్కడ? తమాషా ఏమిటంటే తమ కుటుంబంలో ఆస్తుల వివాదం ఏర్పడటానికి చంద్రబాబు కారణమని జగన్ అండ్ కో తాజాగా ప్రచారం చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి మరణానికి కారణమైన చంద్రబాబుతో తల్లీ చెల్లీ చేతులు కలిపారని బురద చల్లిస్తున్నారు. చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు చేస్తారని విమర్శించేవారు ఉన్నారు కానీ హత్యా రాజకీయాలు చేస్తారని ఆయన ప్రత్యర్థులు కూడా చెప్పలేరు. రాజశేఖర రెడ్డి మరణానికి సోనియాగాంధీ కారణమని కొంతకాలం, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కారణం అని మరికొంత కాలం ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధి పొందిన జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబును ఎంచుకున్నారు. చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని నిందించడానికి కూడా జగన్‌రెడ్డి వెనుకాడటం లేదు. రాజశేఖర రెడ్డి కుటుంబంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు దివంగత నేత ఆత్మబంధువులు, ఆయన అంటే పడి చచ్చేవారు తీవ్రంగా కలత చెందుతున్నారు. జగన్‌రెడ్డి నైజం తెలుసు కనుకే వారెప్పుడూ జగన్ అధికారంలో ఉండగా దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడలేదు. జగన్‌రెడ్డి ఎలాంటి వాడో తెలుసు కనుకే రాజశేఖర రెడ్డి కుటుంబంలో ఏర్పడిన విభేదాలలో మధ్యవర్తిత్వం నెరపడానికి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. అన్నం ఉడికిందో లేదో తెలియడానికి ఒక మెతుకు పట్టుకుని చూస్తే చాలు అని అంటారు. అలాంటిది జగన్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పే సంఘటనలు ఇన్ని జరిగినా, జరుగుతున్నా మేధావులుగా, విశ్లేషకులుగా ప్రచారం చేసుకుంటున్న కొందరు ఇప్పటికీ అతనికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వింతగానే ఉంది. ఇలాంటి వారి వల్ల చంద్రబాబుకు ఎలాంటి నష్టం జరుగుతుందో తెలియదు గానీ, రాష్ట్రానికి మాత్రం కచ్చితంగా ఎంతో కొంత నష్టం జరిగి తీరుతుంది. ప్రజా జీవితంలో ఉండే అర్హత లేని వ్యక్తులకు బాసటగా నిలవడం చరిత్రాత్మక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వంటి వారు ప్రజా జీవితంలో ఉండటానికి అర్హులా? అన్న విషయమై ఇప్పుడు చర్చ జరగాలి. విజయలక్ష్మి తన లేఖలో పేర్కొన్నట్టు అన్నా చెల్లెళ్ల మధ్య వివాదాలు సమసిపోయి సామరస్యం నెలకొనవచ్చు. అయితే ప్రస్తుతానికి రాజశేఖర రెడ్డి కుటుంబం పరువు బజారున పడింది. జగన్‌రెడ్డి ఎలాంటివారో తెలుసుకొనే అవకాశం ప్రజలకు మరో మారు వచ్చింది. అప్రసంగా వచ్చిపడిన ఆస్తుల కోసం జగన్‌రెడ్డి ఇంత దిగజారాలా? కుటుంబ సభ్యుల మధ్య ఇంత రాద్ధాంతం అవసరమా? అన్న అభిప్రాయం ప్రజల్లో బలపడకుండా ఉంటుందా? తన బెయిల్ రద్దు కావడం కోసం చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని దిక్కుమాలిన ప్రచారం చేసే బదులు తల్లి సమక్షంలో అంగీకరించి సంతకాలు చేసిన 40 శాతం ఆస్తులను సక్రమంగా పంపిణీ చేస్తే ఏ గొడవా ఉండదు కదా? బెంగళూరులోని యలహంక ఆస్తిని చెల్లికి ఇస్తున్నట్టు ఎంఓయూలో అంగీకరించిన జగన్‌రెడ్డి అక్కడ నిర్మితమైన ప్యాలెస్‌లో ఎందుకు ఉంటున్నారో చెప్పాలి. ఇదంతా నా కష్టార్జితం అని జగన్‌రెడ్డి భావిస్తే అది సక్రమమా? అక్రమమా? అన్నది ఇవాళ కాకపోయినా రేపైనా న్యాయస్థానాలు నిర్ణయించకపోవు. నిజానికి జగన్ అనుభవిస్తున్న ఆస్తులు ఆయన స్వార్జితం కావు. అవి ప్రజల సొత్తు. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఈ ఆస్తుల వివాదం చినికి చినికి గాలివానగా మారి అసలుకే మోసం తేవొచ్చు. అందుకే జగన్‌రెడ్డి ఇప్పటికైనా దురాశకు పోకుండా చెల్లి షర్మిలకు న్యాయం చేస్తే మంచిది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే రాజశేఖర రెడ్డి ఆత్మ కచ్చితంగా ఘోషిస్తుంది. ఆయన ఆత్మకు శాంతి కూడా లభించదు. జయంతి, వర్ధంతికి సమాధిని ఘనంగా అలంకరించి నివాళులు అర్పించడం కాదు.. రాజశేఖర రెడ్డి పరువు తీస్తున్నానన్న స్పృహతో జగన్‌రెడ్డి వ్యవహరించడం కుమారుడిగా ఆయన బాధ్యత. భౌతిక సంపదను పోయేటప్పుడు ఎవరూ తమతో తీసుకెళ్లరు. కొడుకు ప్రవర్తన చూసి రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మి తాను ఎందుకు జీవించి ఉన్నానా? అని చింతించే పరిస్థితి ఏర్పడకూడదని ఆశిద్దాం. అయితే తోటకూర దొంగిలించిన నాడే దండించి ఉంటే జగన్‌రెడ్డి ఇప్పుడు ఇలా తయారై ఉండేవారు కాదు. సంపద కోసం రక్తసంబంధాలను తెగదెంపులు చేసుకోవడానికి కూడా వెనుకాడని జగన్‌రెడ్డి ప్రజా జీవితంలో కొనసాగడానికి అర్హుడా? తల్లీ చెల్లిని కూడా ఆస్తుల కోసం వదులుకున్న జగన్‌కు ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఉంటుందా? ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ కఠోర సత్యాన్ని మరచిపోరని ఆశిద్దాం!



> సంపద కోసం రక్తసంబంధాలను తెగదెంపులు చేసుకోవడానికి కూడా వెనుకాడని జగన్‌రెడ్డి ప్రజా జీవితంలో కొనసాగడానికి అర్హుడా? తల్లీ చెల్లిని కూడా ఆస్తుల కోసం వదులుకున్న జగన్‌కు ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఉంటుందా?

> రాజశేఖర రెడ్డి మరణానికి సోనియాగాంధీ కారణమని కొంతకాలం, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కారణం అని మరికొంత కాలం ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధి పొందిన జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబును ఎంచుకున్నారు. చంద్రబాబుతో షర్మిల, విజయలక్ష్మి చేతులు కలిపారని నిందించడానికి కూడా జగన్‌రెడ్డి వెనుకాడటం లేదు. రాజశేఖర రెడ్డి కుటుంబంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు దివంగత నేత ఆత్మబంధువులు, ఆయన అంటే పడి చచ్చేవారు తీవ్రంగా కలత చెందుతున్నారు. జగన్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పే సంఘటనలు ఇన్ని జరిగినా, జరుగుతున్నా మేధావులుగా, విశ్లేషకులుగా ప్రచారం చేసుకుంటున్న కొందరు ఇప్పటికీ అతనికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వింతగానే ఉంది. ఇలాంటి వారి వల్ల చంద్రబాబుకు ఎలాంటి నష్టం జరుగుతుందో తెలియదు గానీ, రాష్ట్రానికి మాత్రం కచ్చితంగా ఎంతో కొంత నష్టం జరిగి తీరుతుంది.

> 2019లో అధికారంలోకి వచ్చే వరకు తల్లీ చెల్లితో జగన్‌రెడ్డి సఖ్యతగానే ఉన్నారు. ఆస్తుల పంపకాల ప్రస్తావన తేలేదు. ముఖ్యమంత్రి కాగానే ఆస్తులు పంచుకుందాం అన్న ప్రతిపాదన జగన్‌రెడ్డి తెర మీదకు తెచ్చారు. సదరు ఆస్తుల్లో షర్మిలకు వాటా లేని పక్షంలో పంపకాల ప్రస్తావనను జగన్ ఎందుకు తెచ్చారో, ఎంఓయూ ఎందుకు రాశారో చెప్పాలి కదా! రాజశేఖర రెడ్డి ఆజ్ఞ మేరకు షర్మిలకు సమాన హక్కు ఉన్నప్పటికీ ఆస్తుల్లో 40 శాతం మాత్రమే ఇస్తానని జగన్ ఎందుకు అడ్డం తిరిగారు? ఆస్తులను 55:45 శాతం నిష్పత్తిలోనైనా పంచమని విజయలక్ష్మి ప్రతిపాదించినా జగన్‌రెడ్డి అంగీకరించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 40 శాతం వాటాకే షర్మిల అంగీకరించాల్సి వచ్చింది. అప్పట్లో ఆ కుటుంబంలో ఏం జరిగిందో తెలుసుకొనే ప్రయత్నం చేయకుండానే పేటీయం బ్యాచ్‌తో పాటు జగన్‌రెడ్డి మద్దతుదారులుగా ఉంటున్న ఉన్మాద మూక విజయలక్ష్మి, షర్మిలను సోషల్ మీడియాలో బండ బూతులు తిడుతున్నారు. జగన్‌రెడ్డి అతి మంచితనం వల్ల ఈ సమస్య వచ్చిందని విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వారు చెప్పడం వినడానికి కూడా రోతగా ఉంది.

> రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. అయితే ఆమె చెప్పిన విషయాలతో జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న వారు విభేదిస్తున్నారు. ఆస్తుల్లో వాటా ఉన్న మాట నిజమైతే షర్మిలపై కేసులు ఎందుకు లేవు? ఉమ్మడి ఆస్తులైతే ఎంఓయూ అవసరం ఏమిటి? వంటి ప్రశ్నలను లేవనెత్తడంతో పాటు షర్మిలను విలన్‌గా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు, తర్వాతా ఏం జరిగిందో ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుంది? అయినా విజయలక్ష్మి చెబుతున్న దాంట్లో వాస్తవం లేనట్టుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? అవి అక్రమ ఆస్తులా? సక్రమ ఆస్తులా? అన్న అంశాలు మరుగున పడిపోయాయి.

అనంత తీరాలకు అపురూప కపోతం

> వర్షాకాలం 4 నెలలు మినహాయిస్తే ఏడాదికి ఎనిమిది నెలలు కంభంపాటి సీత, శ్రీనివాసరావు దంపతులు పిట్టల్ని వెతుకుతూ ప్రపంచమంతా తిరుగుతుంటారు. కవి వరవరరావు అన్నట్లు వీళ్లు జంట కపోతాలు. ఈ జంటలో ఒక కపోతం నాలుగు రోజుల క్రితం ఎగిరిపోయింది. ఎగిరిపోయిన కపోతం సీత. లెక్చరర్లుగా ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బులతో, ఆస్తులు కూడపెట్టాలన్న తాపత్రయం లేకుండా వీరు ప్రయాణాలు చేసారు. అబ్బురపరిచే జీవితం, అసూయ కలిగించే జీవితం ఈ జంట జీవించింది.



కంభంపాటి సీత అనే సీతగారి గురించి మాట్లాడకుండా శ్రీనివాసరావు గారి గురించి ఎట్లా మాట్లాడలేమో, శ్రీనివాసరావు గురించి మాట్లాడకుండా సీత గురించి కూడా అట్లాగే మాట్లాడలేము. ఈ జంటలో ఒకరి వయసు 84 మరొకరి వయసు 74. ఒకరు బోటనీ లెక్చరర్‌గా ఇంకొకరు జువాలజీ లెక్చరర్‌గా రిటైర్ అయ్యారు. ఇటువంటి రిటైర్ అయిన జంటలు కొన్ని ఇళ్లలో అయినా ఉంటూనే ఉన్నాయి. కానీ మనకు చాలా ఇళ్లలో కనిపించే జంటలకు ఈ జంటకు చాలా తేడా ఉంది. ఏ ఇతర పెద్దవాళ్లని కలిసినా వినిపించే మాటలేవీ వీళ్లు మాట్లాడరు. అసలు మాట్లాడటానికి వీళ్లు దొరకరు కూడా. వర్షాకాలం 4 నెలలు మినహాయిస్తే ఏడాదికి ఎనిమిది నెలలు వాళ్లు పిట్టల్ని వెతుకుతూ ప్రపంచమంతా తిరుగుతుంటారు. వరవరరావు గారు అన్నట్లు వీళ్లు జంట కపోతాలు. ఈ జంటలో ఒక కపోతం నాలుగు రోజుల క్రితం ఎగిరిపోయింది. ఎగిరిపోయిన కపోతం సీత గారు.

ఈ మధ్యలో కొంత మంది రిటైరయిన జంటలు పిల్లలు బాగా సెటిల్ అయి వాళ్లు ఏర్పాటు చేస్తే ఏడాదికి రెండో మూడో ఇలా ప్రయాణాలు చేస్తున్న వాళ్లని చూస్తున్నాం. కానీ వీళ్లు అలా కాదు. గత నలభై ఏళ్లుగా వాళ్లు ఇలా ప్రయాణాలు చేస్తున్నారు. ఆ ప్రయాణాలు తీర్థయాత్రలు కావు. ఆ ప్రయాణాల్లో వాళ్లు ఇప్పుడు కూడా చేసే పనులు చాలామంది 40ల్లో 50ల్లో ఉన్నవాళ్లు కూడా చెయ్యటానికి వెనకాడుతూ ఉంటారు. చెరో ఏడెనిమిది కిలోల బరువున్న కెమెరాలు వేసుకుని బ్యాక్ పాక్‌లో బిస్కట్ పాకెట్లు, మంచినీళ్లు వేసుకుని ఏ మంచు పర్వత సానువుల్లోనో, దట్టమైన కీకారణ్యాల్లోనో పెద్దగా టూరిస్టులు తిరగని ప్రాంతాల్లో గంటల తరబడి ఓపిగ్గా తిరుగుతూ అరుదైన పక్షుల ఫోటోలు తీస్తూ ఉంటారు. కావాలనుకున్న పిట్ట ఫోటో దొరికే దాకా ఒకే స్థలానికి ఎన్నిసారె[illegible] వెళ్తూనే ఉంటారు.

ఒక్కసారైనా హిమాలయాలకు, సాహసికులైతే లేహ్ లడక్‌కు, భక్తులైతే వైష్ణోదేవి ఆలయానికి వెళ్లాలని అనుకుంటారు. అలాటి హిమాలయాలకు వాళ్లు కనీసం ముప్పె[illegible]ర్లు వెళ్లారు. టూరిస్టులు వెళ్లని తోవలకు, ఆక్సిజన్ అందని మంచు కొండల మీదకు వాళ్లు ఎడతెగని ప్రయాణాలు చేసారు. ఒక గంట సేపు మామూలు కొండ ఎక్కటమే చాలామందికి కష్టం అందులోనూ సరైన దారి లేని చోట ట్రెక్కింగ్ అంటే ఇంకా కష్టం. కానీ వీళ్లు సరిగా ఆక్సిజన్ అందని మంచుకొండల్లో కూడా తమ డెబ[illegible] ఎనభైల్లో కూడా ఆరేసి, ఎనిమిదేసి గంటలు ట్రెక్కింగ్ చేస్తూ పోతుంటారు. ఎందుకలా అంటే మొదటిసారి వెళ్లివచ్చినప్పుడు అక్కడేదో పోగొట్టుకున్న ఫీలింగ్ వచ్చింది. అప్పటినుంచి అదేంటో తెలియకున్నా దాన్ని వెతుక్కుంటూ పోతున్నాం అంటారు సీత గల గలా నవ్వుతూ.

మంచు కొండల గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి అక్కడ సీత చేసిన ఒళ్లు గగుర్పొడిచే సాహసాల గురించి చెప్పాలి. ఒక ఉదయం లేచి హిమాలయాల్లో ఆరుగంటల ట్రెక్ చేసి వాళ్లు అనుకున్న ప్రదేశానికి చేరుకోగానే మంచు తుఫాన్ వచ్చింది. వాళ్లను నిలబెట్టి కొట్టిన తుఫాను వెలిసేసరికి చీకటయింది. వెళ్లే దారి కనపడని స్థితి. అప్పుడు వాళ్లకు దూరంగా కొండ కింద ఒక దీపం కనిపించింది. ఆ దీపం గుర్తుగా కొండల మీద నుంచి జారుతూ జారుతూ అక్కడికి చేరుకున్నారట. అది ఒక గొర్రెల కాపరి వేసుకున్న టెంట్. ఆ రాత్రి అక్కడ ఉండి ఉదయం బయలుదేరి తమ బస వైపు నడుస్తుంటే, మంచు తుఫాన్‌లో చిక్కుకుని కనపడకుండా పోయిన వ్యక్తుల శరీరాలను వెతికే బాడీ సెర్చ్ టీమ్‌తో బస యజమాని ఎదురుపడి వీళ్లను చూసి ఆశ్చర్యపోయారట. అప్పుడు వాళ్ల వయసు ఒకరికి 67 ఇంకొకరిది 77. ఇదే ఒక సాహసం అనుకుంటే అంతకు మించిన సాహసం సీతది.

కొండల్లోంచి జారటం వల్ల శరీరానికి తగిలిన దెబ్బలు నుంచి తేరుకోటానికి మిగిలిన ప్రోగ్రాం రద్దు చేసుకుని హోటల్లో కూర్చుని రికవర్ అవుతుండగా సీతని ఎదురుగా ఉన్న తీర్థన్ నది పిలవటం మొదలు పెట్టింది. సీత 65 ఏళ్ల వయసులో ఈత నేర్చుకున్నారు. నీళ్లు చూస్తే ఈత కొట్టెయ్యాలన్న ఉత్సాహం ఉండేదనుకుంటాను. తీర్థన్ నది ఈదితే ఎలా ఉంటుంది అంటే అక్కడ అందరూ ఆమెను వారించారు. అది మంచు కరిగి ప్రవహించే నది, నీళ్లు అతి చల్లన. నదిలో విపరీతంగా బండరాళ్లు. ఈ రెండు కారణాల వాల్ల స్థానికులు కూడా నది ఈదే సాహసం చెయ్యరు. కానీ ఈవిడ వినకుండా ఇటునుంచి అటు మాత్రమే కాదు అటు నుంచి ఇటు కూడా ఈదారట. ఈ సాహసం గురించి విన్న ఆ ఊరివాళ్లు మాత్రమే కాదు, అక్కడికి వచ్చిన టూరిస్టులు కూడా నదికి రెండు వైపులా నిలబడి ఈ చోద్యం చూశారు. 65 ఏళ్ల వయసులో ఈత నేర్చుకున్న సీత అప్పటి నించి ఈత పోటీలకు వెళ్లటం మాత్రమే కాదు ఇప్పటికీ పాతికో ముప్పయ్యో పతకాలు కూడా గెలుచుకున్నారు. ఒక్కోసారి నాలుగో ఐదో గెలుచుకుని వాటిని మెడలో వేసుకుని చిన్న పిల్లలా సంతోషపడుతుంటారు.

ఇవన్నీ విని వాళ్లను చూస్తే ఈ పనులు చేస్తుంది వీళ్లేనా అనిపించకమానదు. ముఖ్యంగా సీత. మంచి నూలు చీరలు కట్టుకుని మొహం మీద చెరగని చిరునవ్వుతో చాలా హాయిగా, మెత్తగా ఉంటారు. మామూలుగా ట్రావెలర్స్ అని మనం అనుకుని ఊహించుకునే దానికి పూర్తి భిన్నంగా ఉంటారు ఇద్దరూ కూడా.

ఇవన్నీ ఎవరికి తెలియకుండా పోయే ఒక అపాయం తప్పింది సీత ట్రావెలాగ్‌ల వల్ల. వందల్లో ప్రయాణాలు చేసినా అప్పుడప్పుడూ వాటిలో కొన్ని మాత్రం సీత ట్రావెలాగ్‌లా రాసేవారు. వాటిని పుస్తకంగా వెయ్యాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఆ పనిలో భాగంగా వాళ్ల పరిచయం అయింది. ఆవిడ రాసిన ట్రావెలాగ్‌లు చదివి, అందులో రాయని అనేక విషయాలు విని నిర్ఘాంతపోయాను. చాలామంది ఊహించటానికి కూడా సాహసించని ఒక కలని వాళ్లు జీవించారు. ఆ ట్రావెలాగ్‌కు విశ్వ విహారం అని వారి చిరకాల కుటుంబ మిత్రులు వరవరరావు పేరుపెట్టారు. కానీ ఆ కథలు చదివితే అది ఉత్త విహారం కాదు సె[illegible] విహారం అనిపించక మానదు. దానికి వాడుకలో ఉన్న అర్థంలో కాదు. అ వయసులో వాళ్లు చేసిన సాహసాల వల్ల.

దాంతో పాటుగా వాళ్లు తీసిన అరుదైన పక్షుల ఫోటోలతో వేసిన బర్డ్స్ బ్యూటిఫుల్ అనే పుస్తకం ప్రెస్ వర్క్ జరుగుతున్నప్పుడు చూసిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డి కూడా అలాగే నిర్ఘాంతపోయారు. ఇలాంటి ఫోటోలు తీసిన వీళ్లు ఇంతకాలం అజ్ఞాతంగా ఉండిపోయారా అని. ఆయన పూనుకుని అప్ల[illegible]సిస్తే ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫిక్ కౌన్సిల్ గుర్తింపు వచ్చింది. ది రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ గుర్తింపు ఇంకా రావాల్సి ఉంది. ఆరు నెలల కింద 'సంచార సహచరులు' పేరుతో ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక కవర్ మీద ఎక్కారు. కెన్యా, టాంజానియాల మధ్య ప్రతి ఏడు జరిగే లక్షలాది జంతువుల గ్రేట్ మైగ్రేషన్ చూడటం కోసం, ఫోటోలు తియ్యటం కోసం మూడుసార్లు వెళ్లి వచ్చిన అనుభవాలు, ఫోటోలతో కాల్ ఆఫ్ ది వైల్డ్ పేరుతో ఒక పుస్తం వేశారు. ఈ మూడు పుస్తకాల వల్ల ఈ ఏడాదిగా కొందరికైనా వాళ్ల గురించి తెలుసుకునే అవకాశం దొరికింది.

చేతినిండా పుష్కలంగా డబ్బులు ఉండి వాళ్లు హాబీగా ఈ పని చెయ్యలేదు, లెక్చరర్లుగా ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బులతో, ఆస్తులు కూడపెట్టాలన్న తాపత్రయం లేకుండా ఈ ప్రయాణాలు చేసారు. అబ్బురపరిచే జీవితం, నాలాంటి కొంతమందికి అసూయ కూడా కలిగించే జీవితం ఈ జంట జీవించింది.

▪ సి. వనజ



'ఖాకీ' వనంలో కలకలం!

కట్టుతప్పుతున్న కొందరు ఖాకీలతో పోలీసుశాఖలో కలకలం పెరుగుతోంది. సీపీ హెచ్చరిస్తున్నా.. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా అవినీతికి అలవాటు పడిన పోలీసులు అవకాశం దొరికిన చోట చేతివాటం ప్రదర్శిస్తున్నారు. శాంతిభద్రతలు పర్యవేక్షించే పోలీసులే కాదు.. అనుబంధ విభాగాల్లో పని చేసే వారు కూడా వసూళ్ల దందాకు దిగుతున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని సీపీ అంబర్ కిషోర్‌ఝా హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. ఇటీవలే అక్రమాలకు పాల్పడుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బందిపై బదిలీ వేటు వేసినా మార్పు కనిపించటం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఓ సీఐ బాలికపై లైంగికదాడికి యత్నించి వార్తల్లోకి ఎక్కడం లాంటి వాటికి తోడు తాజాగా మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో తనను ఎస్‌ఐ వేధిస్తున్నాడంటూ ఓ వీధివ్యాపారి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం లాంటివి నగర పోలీసుల తీరుపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి.

- సీపీ హెచ్చరికలూ బేఖాతరు
- వసూళ్లు మానని కొందరు పోలీసులు
- బదిలీలతో టాస్క్‌ఫోర్సులో కానరాని మార్పు
- అవకాశం దొరికితే బాధితుల నుంచీ వసూళ్లే
- పోలీస్‌స్టేషన్లతో పాటు ఇతర విభాగాల్లోనూ వసూల్‌రాజాలు
- డ్రంకెన్‌డ్రైవ్, సివిల్ కేసులొస్తే పండగే..
- వీధి వ్యాపారులను వదలని గస్తీ పోలీసులు
- మట్టెవాడ ఘటనతో మరోసారి సిటీ పోలీసుల తీరుపై చర్చ

పోలీసు ప్రతిష్ఠను దిగజార్చిన ఇటీవల సంఘటనలు కొన్ని..

- అక్టోబరు 18వ తేదీన జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో లాకవత్ శీను అనే యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. భార్యభర్తల గొడవలపై పోలీస్‌స్టేషన్ కేసు పెట్టినపట్టించుకోవటం లేదంటూ ఆఘాయత్యానికి పాల్పడటం కలకలం రేపింది.
- అక్టోబరు 23వ తేదీన సీఐ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. ఓ బాలికపై అత్యాచాయత్నం చేయడం, అప్పటికే పోలీసులపై ఇలాంటి కేసులు ఐదు నమోదై ఉండటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
- అక్టోబరు 23న మామునూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, మరో వివాహిత ను తీసుకుని రూ.10లక్షల నగదు, పది తులాల బంగారంతో పరారయ్యాడు. మిల్స్‌కాలనీ స్టేషన్‌లో కేసు నమోదు కావటం చర్చనీయాంశగా మారింది.
- అక్టోబరు 31వ తేదీన రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో వీధివ్యాపారి శ్రీధర్ పోలీసులు వేధిస్తున్నారని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడటం కలకలం రేపింది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. శాఖ ప్రతిష్ఠను దిగ జార్చేలా కొందరు ఖాకీల తీరు ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. లైంగిక దాడులతో పాటు సివిల్ పంచాయతీల సెటిల్‌మెంట్లు, వీధివ్యాపారుల నుంచి వసూళ్లు, రాజకీయ నేతల మెప్పు కోసం స్టేషన్‌లోనే నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, బెల్లం, గుట్కా వ్యాపారుల నుంచి మామూళ్లు, స్టేషన్ కేసుల్లో అవకాశం దొరికితే అందినకాడికి వసూళ్లు చేయటం లాంటి అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తుండటం పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చుతోందనే చర్చ జరుగుతోంది. పోలీస్ స్టేషన్లకు వచ్చే సివిల్ కేసులు, ఆర్థిక సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించే క్రమంలో కొంతమంది ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని స్టేషన్లలో ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులు అవినీతికి దూరంగా ఉంటున్నా కింది స్థాయి సిబ్బంది వసూళ్లు ఆగటం లేదనే చర్చ జరుగుతోంది.

ట్రాఫిక్ విభాగంలో చాలా వరకు సీపీ ప్రక్షాళన చేసినా అక్కడ కృడ ఇంకా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే.. అందులో ప్రభుత్వం ఉద్యోగి అయితే ఇక అంతే

మిగతా 6లో...

ఓరుగల్లులో బీసీల ఐక్యత అద్భుతం



బహిరంగ విచారణలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు, కలెక్టర్లు

- బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చారు
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి
- రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలకు ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి
- వివిధ కుల సంఘాల నేతల నుంచి అందిన వినతులు
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ, వినతుల స్వీకరణ
- బీసీ లేడీస్ హాస్టల్ సందర్శన.. భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

6

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పాల్గొన్న హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టర్లు



వీసీలో పాల్గొన్న హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టర్లు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో నిర్దేశించుకున్న ప్రణాళికా ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి శనివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోలుపై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన ఇంటర్మీడియట్ గోడౌన్‌లను గుర్తించాలని, రైస్ మిల్లుల వద్ద తాలు పేరుతో ఎటువంటి కోతలు విధించకూడదన్నారు. ఉమ్మడి జిల్లాలోని రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీవో 27పై చర్చించాలని, రైస్ మిల్లర్లతో బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామన్నారు. అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ సమర్పించకుంటే ఉమ్మడి జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్ సన్నద్ధం చేయాలన్నారు. ప్రతీ జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దుల వద్ద చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో హనమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టర్లు సత్యశారద, దివాకర, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుల గణన చరిత్రాత్మక నిర్ణయం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కుల గణన కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కుల గణన సర్వే, విస్తృత అవగాహన అంశంపై సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాలు, టీపీసీసీ నిర్దేశాల మేరకు అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమగ్ర వివరాల సేకరణ జరుగుతుందన్నారు. సర్వే ద్వారా అన్ని వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు నిష్పక్షపాతంగా అందుతాయని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కుల గణన చేపట్టలేదని విమర్శించారు. కుటుంబ సర్వే పేరుతో రాజకీయ పబ్బం గడిపారని దుయ్యబట్టారు. ప్రతీ సామాజిక వర్గం ఉన్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. 2021లోనే కుల గణన జరగాల్సి ఉండగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థపూరిత ప్రయోజనాల కోసం అడ్డుకుందన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కుల గణన సర్వే విషయంలో ముఖ్యంగా విద్యావేత్తలు, మేధావులు, సామాజిక వర్గాల పెద్దలు సమగ్ర వివరాలను అందించడంలో చొరవచూపాలని కోరారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కుల గణన సర్వేపై పార్టీ శ్రేణులు విస్తృత అవగాహన కలిగి ఉండాలని సూచిం చారు. ఈ సమావేశంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ పుల్లూరి సుధాకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తిరునహరి శేషు, వివిధ సామాజిక వర్గ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు కుల గణన సర్వే, ప్రాముఖ్యత, ప్రయోజనాల విభజన తదితర అంశాలను వివరించారు. వివిధ వర్గాల ప్రతినిధులు సమావేశంలో వినతి పత్రాలు అందచేశారు.

నేడు మడికొండకు సీఎం రాక



సత్యసాయి గార్డెన్స్‌లో ఏర్పాట్లను జంగా రాఘవరెడ్డిని అడిగి తెలుసుకుంటున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

- జంగా రాఘవరెడ్డి కూతురి వివాహానికి హాజరు
- పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ

6

సండే స్పెషల్
SUNDAY SPECIAL



ఆ ఊరంతా నలభీములే

- వారు వండితే లొట్టలేసుకుంటూ లాగించాల్సిందే
- ఒకే గ్రామం నుంచి సుమారు 100 మంది వంటవారు
- దాబాలు, రెస్టారెంట్లలో వారి చేతి రుచులే
- ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

8

ఆ ఊరుపేరు నేలపోగుల. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని ఆ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ మారుమూల పల్లెలో సుమారు 100మంది నలభీములు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. శాకాహారం నుంచి మాంసాహారం వరకు అన్నిటిలోనూ వారిది అందెవేసిన చేయి. వారు వండారంటే చాలు ఎవరైనా లొట్టలేసుకుంటూ లాగించేయాల్సిందే. 35ఏళ్ల క్రితం ఒకరికి బతుకుదెరువు కోసం వంటపనులకు రోజువారీ కూలికి వెళ్లిన వారంతా ఇప్పుడు చేయితిరిగిన వంటవారిగా పేరుతెచ్చుకున్నారు. చుట్టుపక్కన జిల్లాలు, పట్టణాలే కాకుండా హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట కనిపించే దాబాలు, రెస్టారెంట్లలో వారే వంట మాస్టర్లుగా పనిచేస్తున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాలుగా తమ వంట రుచులను ఆహారప్రియులకు అందిస్తున్నారు.

- లింగాలఘణపురం



ఓ దాబాలో వంట చేస్తున్న నేలపోగులకు చెందిన చెఫ్ శ్రీనివాస్

కార్తీకం.. ఆరంభం

తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో సందడి

8

ఓరుగల్లులో బీసీల ఐక్యత అద్భుతం

● బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చారు.. ● తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి ● హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ, వినతుల స్వీకరణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషనర్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో చైర్మన్ నిరంజన్‌కు వినతులు అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

హనుమకొండ / హనుమకొండ కలెక్టరేట్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లులో వెనుకబడిన తరగతుల వారిలో బీసీల ఐక్యత అద్భుతంగా ఉందని, బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చిన వారి చైతన్యం చూసి ముచ్చటేసిందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ప్రశంసించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు రిజర్వేషన్ల ఖరారు కోసం బహిరంగ విచారణ నిర్వహించేందుకు శనివారం వరంగల్‌కు వచ్చిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశమైంది. ఈ క్రమంలో చైర్మన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిల బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కులసంఘాల నాయకుల నుంచి వినతి పత్రాలను స్వీకరించింది.

అనంతరం విలేకరుల సమావేశంలో చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాము ఐదు జిల్లాల్లో పర్యటించామని, అన్నిటి కన్నా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీల నుంచే సమస్యలపై పిటిషన్లు వెల్లువలా వచ్చాయని, వివిధ కులాల వారు కొత్త సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఏ జిల్లాలో రాని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 231 పిటిషన్లు అందాయని.. వీటిలో హనుమకొండ జిల్లానుంచి అత్యధికంగా 88, వరంగల్ నుంచి 55, జనగామ నుంచి 27, మహబూబాబాద్ 26, జయశంకర్ భూపాలపల్లి నుంచి 28, ములుగు నుంచి 7 వచ్చాయని వివరించారు. బీసీలకు న్యాయం జరిగేలా చూడడమే బీసీ కమిషన్ లక్ష్యమని, బీసీ సంఘాల వారు నివేదించిన సమస్యలను పరిశీలించి సిఫార్సులను ప్రభుత్వానికి చేరవేస్తామని అన్నారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయ సర్వేలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, సర్వే ఆధారంగానే భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందని వివరించారు. సామాజిక, సర్వే కోసం ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చే సమాచారం ఆధారంగానే ప్రభుత్వ ఫలాలు అందుతాయని చెప్పారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 200 టోకెన్లను అందజేశామని, బీసీ కమిషన్‌కు వివిధ కుల సంఘాలు, ప్రజలు తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. బీసీ కమిషన్ బృందానికి వరంగల్ జిల్లాకు సంబంధించిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారని, విజ్ఞప్తులను అందించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఆరు జిల్లాల కలెక్టర్లు బీసీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు తదితర ప్రజాప్రతినిధులు కూడా కమిషన్ విచారణకు హాజరయ్యారు. వివిధ బీసీ సంఘాల నేతతో సమావేశం హాలు కిక్కిరిసి పోయింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు కొందరు కుల సంఘాల నాయకులు అసంతృప్తి చేశారు. వాగ్వాదానికి దిగారు. కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కూడా ఇంకా అనేకమంది పిటిషన్లు ఇవ్వడానికి ఎగబడగా.. కమిషన్ సభ్యులు వాటన్నిటినీ స్వీకరించారు.

కమిషన్ దృష్టికి పలు ప్రధాన డిమాండ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ బీసీ కుల సంఘాల నాయకులకు టోకెన్‌లు కేటాయించి టోకెన్ నెంబర్ ఆధారంగా ఆ సంఘం నాయకున్ని పిలిచి వారి సూచనలు తీసుకున్నారు. ఈ క్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ విజ్ఞప్తులను అందించారు. బీసీల ఏబీసీడీ గ్రూపులను పునఃవర్గీకరణ చేయాలని, కొన్ని కులాల గ్రూపును కూడా మార్చాలన్న డిమాండ్లు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను అమలు చేయాలని, అలాగే రాజకీయా ల్లో ప్రాతినిధ్యం లేని కూలాలకు కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు. ఇక బీసీ కులాల వారిపై జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలను నిరోధించేందుకు బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బీసీల్లోని కొన్ని కులాల వారు తమను ఎస్సీ, ఎస్టీలుగా మార్చాలని కోరారు. దూదేకుల వారు తమను బీసీ డినుంచి ఈ గా, సగరవారు డి నుంచి ఏ గా, ముదిరాజ్‌లు డి నుంచి ఏకి, వడ్డెరలు ఏ నుంచి ఎస్సీలోకి, పూసల వారు ఎంబీసీలోకి, గాండ్లవారు బీసీ ఈ నుంచి ఏకి మార్చాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు. కుల నిర్మూలన సంఘం వారు నో క్యాస్ట్, నో రిలీజియన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఏ కులం, ఏ మతానికి చెందనివారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పద్మశాలి సంఘం వారు టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటుచేసుకునేందుకు మహబూబాబాద్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 200 ఎకరాలు ఇవ్వాలని కోరారు.

సమస్యలు చెప్పిన వెంటనే.. బీసీ హాస్టల్ సందర్శన

బీసీ సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, లేడీస్ హాస్టళ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందింది. వెంటనే స్పందించిన చైర్మన్ నిరంజన్ బహిరంగ విచారణ అనంతరం హనుమకొండ బాలసముద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టళ్లలోని అసౌకర్యాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కమిషన్ కులసంఘాల నుంచి వినతులను తీసుకోవడమే కాకుండా విచారణలో భాగంగా క్షేత్ర స్థాయిలో సమస్యలను కూడా స్వయంగా అధ్యయనం చేస్తోందన్నారు.

భద్రకాళి ఆలయ సందర్శన

అంతకుముందు చైర్మన్ సహా కమిషన్ సభ్యులు భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బహిరంగ విచారణ ఒక బృహత్తర కార్యక్రమమని, విచారణ ప్రారంభానికి ముందు అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆటంకాలు తొలగిపోతాయన్నారు. అమ్మవారు శాంత రూపంలో తమకు దర్శనమిచ్చారని, ఆటంకాలు కలిగించే వారిని ఉగ్రరూపంలో అడ్డుకుంటారన్నారు.

స్వాగతం పలికిన కలెక్టర్లు

తొలుత హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు శనివారం ఉదయం 10:40గంటలకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ బృందానికి కలెక్టర్లు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారదదేవి, దివాకర, రిజ్వాన్ బాషా పూలమొక్కలను అందించారు.



బాలసముద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యులు, కలెక్టర్లు



హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద



కేసముద్రం హైస్కూల్లో బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్, పక్కన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి, ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు

పట్టుదల ఉంటే.. ఏ రంగంలోనైనా రాణిస్తారు

మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభం

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టుద ల ఉంటే ఏరంగంలోనైనా రాణిస్తారని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ పేర్కొన్నారు. కేసముద్రం హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) తెలంగాణ మహబూబాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, వూషూ పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్ అభివృద్ధి కోసం రూ.2కోట్ల నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని, ఎమ్మెల్యేతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీ నిధుల్లోంచి ఇక్కడ షటిల్ కోర్టును కూడా వేయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక స్థైర్యం అలవడుతుందని, తాను ఫుట్‌బాల్ క్రీడాకారున్ని కావడంతోనే ఎన్నికల ప్రచారంలో ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ ప్రచారం నిర్వహించగలిగానన్నారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఓడిన వారే పాఠాలు నేర్చుకుంటారన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బాల్యం నుంచే ఏదో ఒక రంగంలో నైపుణ్యం సాధించిన వారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పట్టుదలతో అంది వచ్చిన అవకాశాలన్నిటిని వినియోగించుకొని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, డీవైఎస్‌వో జ్యోతి, హెచ్‌ఎంలు బందెల రాజు, బండారు నరేందర్, రూరల్ సీఐ సర్వయ్య, క్రీడా నిర్వాహకులు రావుల మురళి, కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, చెడుపల్లి ఐలయ్య పాల్గొన్నారు. ఇక ఈ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా నర్సంపేట కళానిధిక్షేత్రానికి చెందిన కూచిపూడి విద్యార్థినులు, కల్వల హైస్కూల్ విద్యార్థినిల నృత్యాలు, మరిపెడ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థుల బ్యాండ్ మ్యూజిక్, వివిధ జిల్లా జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ అలరించాయి. ఈ క్రీడలకు రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి బాస్కెట్‌బాల్, వూషూ 17, 19 ఏళ్ల విభాగాల్లో 20 చొప్పున 60 జట్లకు చెందిన 720 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

నేడు మడికొండకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



మడికొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం మడికొండకు రానున్నారు. మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌లో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కుమార్తె డాక్టర్ నిఖిత రెడ్డి వివాహానికి హాజరుకానున్నారు. ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్ ద్వారా హనుమకొండకు చేరుకుని అక్కడినుంచి రోడ్డు మార్గం ద్వారా 10.25గంటలకు మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌కు చేరుకొని వధూవరులను ఆశీర్వదిస్తారు. తిరిగి ఉదయం 11.20 గంటలకు బయలుదేరి హనుమకొండలోని హెలిపాడ్‌కు వెళ్లి 11.45 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బేగంపేట ఎయిర్‌పోర్టుకు తరలివెళతారు. కాగా, ముఖ్యమంత్రి మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌కు రానున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝూ సత్యసాయి గార్డెన్స్‌కు చేరుకుని ఏర్పాట్లు పరిశీలించారు. అలాగే మడికొండలోని సెయింట్ పాల్స్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా 400 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు.

'ఖాకీ'వనంలో కలకలం!

(5వ పేజీ తరువాయి)

సంగతులు. పక్కకు తీసుకెళ్లి బేరసారాలు ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్‌లో ఇటీవల కొంత ప్రక్షాళన చేసిన ఇంకా ఖాకీవనంలో గంజాయి మొక్కలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. కిందిస్థాయి సిబ్బందితో పని చేయించుకునే పెద్దసార్లపై చర్యలు లేకపోవటం ఖాకీల్లో హాట్‌టాపిక్‌గా మారింది. వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో అవినీతి మరకలు ఖాకీల ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

సీపీ హెచ్చరికలు.. ఆగని సిబ్బంది వసూళ్లు..

విధి నిర్వహణలో ఎలాంటి అవినీతికి పాల్పడవద్దని వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝూ హెచ్చరిస్తున్నా కొందరు పోలీసుల తీరులో మార్పు రావటం లేదనే చర్చ జరుగుతోంది. గురువారం రాత్రి మట్టెవాడ ఎస్‌ఐ విఠల్‌పై చిరు వ్యాపారి శ్రీధర్ చేసిన ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ద్విచక్రవాహనాలు నిలిపి వేస్తున్నారని బెదిరింపులకు పాల్పడుతూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడటం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. టాస్క్‌ఫోర్స్‌లో నలుగురు కానిస్టేబుళ్లు ఓ ముఠాగా ఏర్పడి గుట్కా, బెల్లం, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న ఘటన వెలుగులోరి వచ్చింది. వీరిపై విచారణ చేపట్టిన అనంతరం ముగ్గురిపై సీపీ బదిలీ వేటు వేశారు. అలాగే నగరంలో ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ, సుబేదారి, ధర్మసాగర్, మడికొండ, నల్లబెల్లి, పర్వతగిరి, నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న 12మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్‌పై జూలై 29వ తేదీన సీపీ బదిలీ వేటు వేశారు. వీరు ఆయా స్టేషన్లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుండటంతో సీపీ చర్యలు దిగారు. అయితే ఒకవైపు సీపీ అవినీతిపరులపై ఉక్కుపాదం మోపుతున్నా వసూల్ రాజాలు మాత్రం తమ లీలలు ఆపడం లేదనే చర్చ జరుగుతోంది. మామూనూరు ఏసీపీ పరిధిలోని ఎనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ పోలీస్ వేధింపులు శ్రుతిమించి పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా రోజులుగా అక్కడే తిష్టవేయటంతో పాటు వ్యవసాయ మార్కెట్ వ్యాపారులపై అధికంగా ఫిర్యాదులు వస్తుండటంతో ఆ పోలీసుకు కాసుల పంట పండుతోందనే ప్రచారం జరుగుతోంది. గత జూలై 27వ తేదీన పర్వతగిరి ఎస్సై వెంకన్న బెల్లం వ్యాపారి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం ఖాకీల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గత నెలలో మంత్రి అనుచరుడైన వరంగల్‌కు చెందిన ఓ నాయకుడి కుమారుడికి కారుకు ఇద్దరు యువకులు బైక్ తగిలించారు. దీనిపై పోలీసులు అత్యుత్సాహం చూపించి.. బైక్ నడిపిన ఇద్దరు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి.. సదరు నాయకుడు కుమారుడితో పోలీస్‌స్టేషన్‌లోనే లాఠీతో కొట్టిస్తూ.. వీడియోకాల్‌లో చూపిస్తు ఆ నాయకుడిని సంతృప్తి పరిచారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి చెప్పుకో లేక సదరు యువకులు యాతన అనుభవించారని సమాచారం. ఈ ఘటనలో భారీగా ముట్టాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవి కొన్ని శాంపిళ్లు మాత్రమే.. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా రక్షించేవారే భక్షిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక సామాన్యులు ఆగం అవుతున్నారనే చర్చ ప్రజల్లో జోరుగా జరుగుతుంది.

సీపీ దృష్టికే వెళ్లనివ్వటం లేదట..

వరంగల్ సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అంబర్ కిషోర్‌ఝూ తన మార్కు చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓఎస్‌డీగా, ఎస్పీగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేసిన అనుభవంతో సీపీగా ఆయన అర్ధరాత్రి వేళ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లోనూ సమస్యాత్మక ప్రాంతాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు ఫోకస్ చేస్తున్నారు. అయితే పోలీస్‌స్టేషన్‌లల్లో జరిగే సెటిల్‌మెంట్లు, అక్రమాలు, రాజకీయ ఒత్తిళ్లతో పెట్టే కేసుల తదితర వాటిని ఎప్పటికప్పుడు సీపీకి చేరవేయాల్సిన విభాగం విఫలమవుతోందనే చర్చ పోలీస్‌వర్గాల్లో జరుగుతోంది. ఆ విభాగంలో పని చేస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు పోలీసుల బదిలీల పైరవీలకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనరేట్ పరిధిలో సిన్సియర్‌గా పని చేస్తున్న కొంతమంది పోలీసులపై తప్పుడు సమాచారం ఇచ్చి బదిలీలకు కారణం అవుతున్నారనే అపవాదును కూడా ఎదుర్కొంటున్నారు. అక్కడక్కడ స్టేషన్లలో జరిగే తప్పులను ఈ విభాగంలో కొందరు ఖాకీలు క్యాష్ చేసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ఈ విభాగంలోని ఓ బ్యాచ్‌కి సీపీ దగ్గర పని చేసే ఓ సహాయకుడు కూడా తోడైనట్టుగా పోలీస్ సర్కిల్‌లో వినిపిస్తోంది. ఈ విభాగంపై అత్యంత నమ్మకంతో సీపీ ఉన్నారని, దీంతో వారు ఆ నమ్మకాన్ని వారికి అనుకూలంగా మలుచుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఫలితంగా కింది స్థాయిలో జరిగే సంఘటనలు, అవినీతి, అక్రమాలు, సెటిల్‌మెంట్లు, పంచాయతీలు తదితర విషయాలు సీపీ దృష్టికి పూర్తిస్థాయిలో సకాలంలో వెళ్లటం లేదనే చర్చ జరుగుతోంది. ఈ విభాగం ఖాకీల తీరుపై నిఘా వర్గాలు కూడా ఆరా తీస్తుండటం పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది.

కాగా, ట్రాఫిక్ విభాగం తరహాలోనే ఇతర అనుబంధ విభాగాలను కూడా కింది నుంచి పైవరకు ప్రక్షాళన చేస్తేనే వరంగల్ సిటీ పోలీస్‌లో కొత్త ఉత్సాహం వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన కారు

ఔరా.. కాస్ట్‌లీ కారు..

ఖిలావరంగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి నిత్యం వందలాదివాహనాలు రిజిస్ట్రేషన్ల కోసం వస్తుంటాయి. కానీ శనివారం అక్కడకు వచ్చిన ఓ కారు వాహన ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంది. అదే వర్ధన్నపేట పట్టణానికి చెందిన జి.శ్రీధర్‌రావు అనే వ్యాపారవేత్త సుమారు రూ.4.80కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన బీఎండబ్ల్యూ ఇంపోర్టెడ్ కారు. శ్రీధర్‌రావు శనివారం తనకారును వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోగా అధికారులు ఫ్యాన్సీనెంబర్ టీజీ 24ఏ 1ను రూ.50వేల బిడ్డింగ్‌లో అలాట్ చేశారు. ఈ క్రమంలో ఆ కారును చూసిన కొందరు దాని విలువ తెలుసుకుని 'ఔరా.. కాస్ట్‌లీ కారు' అంటూ ఆశ్చర్యపోయారు. అయితే వరంగల్ ప్రాంతంలో ఇంత విలువైన కారు ఎప్పుడూ చూడలేదని అక్కడి వారు చర్చించుకున్నారు.

చెస్ ఫిడే రేటింగ్‌లో అభినవ్‌సాయి ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు2: (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో గత నెల 4నుంచి 10వరకు నిర్వహించిన జాతీయ స్థాయి చెస్ పోటీల్లో హనుమకొండకు చెందిన అభినవ్‌సాయి దామెర పాల్గొని చెస్ క్లాసికల్ విభాగంలో 1503 ఫిడే రేటింగ్ సాధించినట్లు కోచ్ ప్రేమ్‌సాగర్ తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించిన చెస్ టోర్నీలో అభినవ్‌సాయి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో ఫిడే రేటింగ్ సాధించడంతో పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



వైద్య విద్యార్థిని సేవికను అభినందిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి

వైద్య విద్యార్థినికి నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి చేయూత

ఖానాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని మంగళవారిపేటకు చెందిన భూక్య దేవేందర్-అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె సేవిక కోల్‌కతాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. సేవిక తండ్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేస్తూ, కుట్టుమిషన్ కుడుతూ పిల్లలను పోషిస్తోంది. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన సేవిక ఎంబీబీఎస్ చదివేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే మాధవరెడ్డి సేవికను శనివారం నర్సంపేటలోని తన క్యాంపు ఆఫీసుకు పిలిపించుకున్నారు. ఆమె చదువుకు యేటా రూ.2లక్షల చొప్పున, నాలుగేళ్లకయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చాడు. సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే మాధవరెడ్డికి సేవిక కుటుంబ సభ్యులు, మంగళవారిపేట గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజనీతి శాస్త్రం విద్యార్థులకు అండగా ఉంటా

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎమ్డీ రియాజ్



రియాజ్‌కు జ్ఞాపిక ఇస్తున్న విభాగాధిపతి సంకినేని వెంకట్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, నవంబరు 2:(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు అండగా నిలుస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.డి. రియాజ్ హామీ ఇచ్చారు. శనివారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగాన్ని ఆయన సందర్శించారు. విభాగంలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన అల్యూమినీ లైబ్రరీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజనీతిశాస్త్రవిభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రియాజ్ మాట్లాడారు. రాజనీతిశాస్త్ర విభాగంలో అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్న లైబ్రరీ బాగుందని కితాబు చెప్పారు. తన వంతుగా విభాగం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. రాజనీతిశాస్త్ర విభాగం విద్యార్థులకు విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందచేస్తామని చెప్పారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభచూపి ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులందరూ లైబ్రరీని ఉపయోగించుకుని జీవితంలో ఉన్నతస్థాయిలోకి రావాలని ఆకాంక్షించారు. కాంపిటీషన్, లాంగ్వేజ్ స్కిల్స్‌ను పెంచుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, స్కాలర్స్ అంకిళ్ల శంకర్, కళ్లెపల్లి ప్రశాంత్, సురేశ్, రుబీనా, వినోద్, సతీశ్, నరేశ్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు ప్రారంభం


భద్రకాళి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికర మాసమైన కార్తీక మాసోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 30 రోజుల పాటు కొనసాగే ఈ కార్తీకమాసంలో ప్రతీ రోజు శివాలయాల్లో అభిషేకాలు కొనసాగుతాయి. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా జేపీఎన్ రోడ్డులోని గీతా ప్రచారక పరిషత్ ఆధ్వర్యంలో గీతా భవన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దాసాంజనేయ స్వామి దేవాలయంలో విశేష అభిషేకం, అలంకరణ, శివుడికి అభిషేకం, నవగ్రహాలకు తైలాభిషేకాలను నిర్వహించారు. విష్ణుసహస్ర పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణాలను నిర్వహించారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చారిత్రక భద్రకాళి దేవాలయంలో నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్తీక మాసం ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణలు ఆరంభం

మకర జ్యోతిని పురస్కరించుకొని భద్రకాళి ఆలయ రోడ్డులో గల ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం నుంచి మండల దీక్షలు, మాలధారణలు, ఉత్సవాలు, అభిషేకాలు, పడి పూజలు జరుగుతాయని అర్చకులు గణపతి శర్మ తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ గురుస్వామి, సామవేద పండి తుల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 4 నుంచి జనవరి 15 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భక్తులు మాలధారణ కోసం ఇరుముడి మండల పూజలకు పెద్దసంఖ్యలో తరలి వస్తారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ సీఐని మర్యాద పూర్వకంగా కలిసి అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం శర్మ, గణపతి శర్మ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై కార్తీక మాసోత్సవాలు

మడికొండ(ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా శనివారం మెట్టురామలింగేశ్వరస్వామి వారికి ప్రాతఃకాల మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రామాలయంలో సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం హరిహరులకు ప్రీతికరంగా ఆకాశ దీపోత్సవం, ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, రాజోపచార పూజలు, పవళింపు సేవ ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమ్మ, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

కేంద్రమంత్రికి రైతుసంఘం లేఖ

వరంగల్ వ్యవసాయం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి కొను గోళ్లలో సీసీఐ నిబంధనలను సడలించాలని, 15 నుంచి 20 శాతం వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం తెలంగాణలో అకాల వర్షాలు, మంచు కురువడం వల్ల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు పత్తి దిగుబడి తగ్గిందని, మార్కెట్లో సీసీఐ కేంద్రాలు తెరిచినప్పటికీ ఆశించిన స్థాయిలో పత్తి రావడంలేదని లేఖలో పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారస్తులు క్వింటా కురూ.5 నుంచి 6 వేలకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, వారిని ఆదుకోవా లంటే ప్రస్తుతం 8 నుంచి 12 వరకు ఉన్న తేమశాతం నిబంధనను సడలించి 15నుంచి 20 శాతం వరకు పెంచాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇదే లేఖను సీసీఐ ఎండి. లలిత్ కుమార్ గుప్తా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ ఈటెల రాజేందర్‌కు, సీసీఐ వరంగల్ బ్రాంచ్ మెనేజర్ అర్జున్ దవేకు మేయిల్ చేశారు.

రౌడీషీటర్‌పై పీడీయాక్ట్

కరీమాబాద్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదైంది. నగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, చట్ట వ్యతి రేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కాశిబుగ్గ మధురానగర్ ప్రాంతానికి చెందిన గడ్డం సంపత్ అనే వ్యక్తిపై సీపీ అంబర్ కిషోర్ ఝా ఈ కేసు నమోదు చేశారు. సంబంధిత ఉత్తర్వులను మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం సంపత్‌కు శనివారం హుజూరాబాద్ సబ్ జైల్లో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, నిందితుడు సంపత్ గత సెప్టెంబరు నెల 13వ తేదీన మరో నిందితుడితో కలిసి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని అతి దారుణంగా కొట్టిన ఘటనతో పాటు ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దోపిడీ కేసులో అరెస్టు చేసి జైలుకు తరలించారు. అదేవిధంగా గతంలో తాడ్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యకేసు, మరికొన్ని హత్యాయత్నం కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, జైలు జీవితం గడిపినప్పటికీ అతడిలో మార్పు రాకపోవడంతో నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

క్రీడాకారిణికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం


తేజస్వినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

హనుమకొండ టౌన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫెన్సింగ్, కబడ్డీ క్రీడాకారిణి తేజస్వీనికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆర్థిక సహాయం చేశారు. హైద్రాబాద్‌లో ఓ కళాశాల బీటెక్ విద్యనభ్యసిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన రైతు కుటుంబానికి చెందిన తేజస్వీని ఈ నెల 6 నుంచి 11 వరకు జమ్మూ అండ్ కశ్మీర్‌లో జరగగబోయే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొనబోతోంది. నిరుపేద కుటుంబమైన తేజస్వీని విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా తక్షణమే స్పందించి వెన్నెల ఫౌండేషన్ తరుపున రూ.35,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో వెన్నెల స్ట్రాటెజిక్ నెట్ వర్కింగ్ కార్యనిర్వహణాధికారి బండి చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న శరత్‌బాబు

శంభునిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వరంగల్ శంభునిపేటకు చెందిన వనం శరత్‌బాబు ఫొటోగ్రఫీలో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఆయన ప్రతిభ చూపి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం రాత్రి విజయవాడలోని ఎంబీవీకే భవన్‌లో శరత్ బాబుకు అవార్డు అందించారు. దసరా వేడుకల సందర్భంగా ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో శరత్‌బాబు తీసిన రావణవధ చిత్రానికి ఈ అవార్డు వచ్చింది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడమే ఎజెండా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


హనుమకొండ ప్రాక్టీసింగ్ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించడమే ఎజెండాగా పనిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని వివిధ పాఠశాలలు, కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఐదున్నరేళ్లుగా శాసనమండలి వేదికగా ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశానన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే విద్యారంగ సమస్యల ఎజెండాగా పనిచేస్తానన్నారు. కాగా, హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేడీసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్‌లోని మైనారిటీ గురుకుల తదితర పాఠశాలల్లో పర్యటించారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కుమార్, సుజన్‌ప్రసాద్‌రావు, రవూఫ్, శ్రీనివాస్, రవీందర్‌రాజు, శ్రీనివాస్, రాజు, శ్రీధర్‌కుమార్, అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

:కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోధ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. పోరాటాతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు డాక్టర్ అంజన్‌రావు, లక్ష్మారెడ్డి, ఆర్డీ ప్రసాద్, పుల్లా రమేశ్, ఫిరోజ్, సుచరిత పాల్, శ్రీదేవి, రహమాన్, శ్రీలత, మంజుల, సదాశివ, శ్రీధర్‌రావు, సరిత, చందూలాల్, రమేశ్, లింగయ్య, భిక్షపతి, రవి కుమార్, టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ రవీందర్, పెండెం రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు స్నేహలత ఎంపిక



వరంగల్ స్పోర్ట్స్ నవంబరు 2: (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3నుంచి 5వరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిం చనున్న రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు హనుమకొండలోని సాయిశివాని కళాశాలకు చెందిన భూక్య స్నేహలత ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెం ట్ వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన స్నేహల తను కళాశాల డైరెక్టర్లు కుచేలుడు, కనకరాజు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నవ్య..

శంభునిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నాంపెల్లి నవ్య స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోగు. నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం వి.రామకృష్ణారెడ్డి శనివారం నవ్యను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ నెల 3 నుంచి 5 వరకు కామారెడ్డిలో జరిగే 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నవ్య పాల్గొననున్నట్లు తెలిపారు.

హాకీ పోటీలకు మామునూరు విద్యార్థులు..

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మామునూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కృష్ణసాయి, మణికుమార్ ఎంపికయ్యారు. గత నెల 29న నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో వీరి ప్రతిభను గుర్తించిన జిల్లా క్రీడా అధికా రులు త్వరలో జరుగబోయే రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపిక చేశారని ఫిజికల్ డైరెక్టర్ పెద్ది రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

హసన్‌పర్తి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీ రింగ్ కళాశాలలో ఇటీవల ఫుల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 64 మంది ఫాక్స్‌కాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఎంపికైనట్లు కిట్స్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సంద ర్భంగా శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఫాక్స్‌కాన్ కంపెనీ 500 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెడు తోందని తెలిపారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఎంఎన్‌సీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ల ద్వారా కళాశాలకు చెందిన 64 మందికి చోటు దక్కడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి అభినందించారు.

శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

ఖిలావరంగల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 100 ఏళ్లు అవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో సీపీఐ శతజయంతి ఉత్సవాల జిల్లా స్థాయి సమావేశాన్ని దామెర కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలను నిర్వహించిన పార్టీ సీపీఐ ఒక్కటేనన్నారు. వెనిజులా, శ్రీలంకలో మాదిరిగా భారతదేశంలో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం తథ్యమన్నారు. రాష్ట్రాల హక్కులను హరించడానికి దేశంలో బీజేపీ ఒక్కటే ఉండాలని ఎంత ప్రయత్నం చేసినా, రానున్నరోజులలో కమూనిస్టులదే రాజ్యం అని జోస్యం చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, పనాస ప్రసాద్, నాయకులు దండు లక్ష్మణ్, బుస్సా రవిందర్, గుండే బద్రీ, తోట చంద్రకళ, తాళ్ళపెల్లి రహేలా, కందిక చెన్నకేశవులు, గన్నారపు రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

● రికార్డులు పరిశీలించిన డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆత్మకూరు పీహెచ్‌సీ పరిధిలోని నీరుకుళ్ల, పెంచికలపేట, పెద్దాపూర్, అక్కంపేట కేంద్రాలను సందర్శించారు. అలాగే సిద్ధాపూర్, కంఠాత్మకూరు ఏఏఎం సెంటర్లను తనిఖీ చేశారు. సిద్ధాపూర్, ఆత్మకూరులలో రికార్డు లను పరిశీలించి, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్‌లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో సంబంధిత ఏఏఎం సెంటర్ల కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి మొత్తం సెంటర్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధిపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్పందన, డాక్టర్ పద్మారాణి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: డాక్టర్ సాంబశివరావు

పోచమ్మమైదాన్, (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ గోపాలరావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు అనుసరించాలి

ఐకార్ అటారి జోన్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా


రైతులకు పరికరాలను అందిస్తున్న డాక్టర్ షేక్ ఎన్ మీరా తదితరులు

శంభునిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సాంకేతిక పద్ధతులు రైతులకు మేలు చేస్తాయని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఐసీఏఆర్-అటారి జోన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. శనివారం ఆయన మామునూరులోని కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే)ను పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఎం.మహేందర్‌తో కలిసి సందర్శించారు. కేవీకేలో నూతనంగా ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలలో భాగంగా వ్యవసాయ ఉపకరణాలైన బ్యాటరీ పంపులు, టార్పాటిన్ షీట్లు, పీపీఈ కిట్లు, కోనో విడర్‌లు, గ్రైండర్‌లను పంపిణీ చేశారు. పెరటి కోళ్ల పెంపకంపై రైతులతో ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ మీరా మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియపర్చటం కోసం 2010లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. రైతులు కేవీకే సేవలను వినియోగించుకుంటూ కొత్త వంగడాలను సాగు చేసి లబ్ధిపొందుతుండటం అభినందనీయం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పీవీ నరసింహారావు విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఎం.మహేందర్ మాటాడుతూ.. మహిళలు, గ్రామీణ యువ రైతుల అభివృద్ధికి కేవీకే ఉపయోగపడుతోందన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్.రాజన్న మాట్లాడుతూ.. కేవీకే ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాలలో చేపడుతున్న సాంకేతిక విధానాలను రైతులకు వివరించారు. అనంతరం కేవీకేలో నెలకొల్పిన పెరటి కోళ్ళ పెంపకం, బయోఫ్లాగ్‌లో చేపల పెంపకం, అధిక సాంద్రతలో పత్తి పండించే పద్ధతి, వివిధ పశుగ్రాసాల ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. అనంతరం అలంకరణ చేపల ప్రదర్శన క్షేత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శనివారం రాష్ట్ర పాఠశాలల విద్యా సంచాలకుడు నరసింహారెడ్డి, రాష్ట్ర వయోజన విద్య సంచాలకురాలు ఉషారాణితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, సిస్టం కింద వరంగల్ జిల్లాలో 19,808 మంది వయోజనులను అక్షరాస్యులుగా చేసే లక్ష్యంగా కాగా, సుమారు 1500 వయోజనులను ఇప్పటికే గుర్తించామన్నారు. ప్రతీ ఐదుగురు వయోజనులకు ఒక వలంటీర్ చొప్పున నియమిస్తామన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమం తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడం ఉల్లాస్ పథకం లక్ష్యమని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, నవంబరు 2:(ఆంధ్రజ్యోతి): నవంబరు 4, 8వ తేదీల్లో జరగాల్సిన ఫార్మసీ విభాగం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య శనివారం తెలిపారు. మిగతా సోషల్‌సైన్స్, ఆర్ట్స్, కామర్స్, లా, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, సైన్స్‌విభాగాలతో పాటు ఇతర విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు యథావిధిగా షెడ్యూల్ మేరకు గతంలో ప్రకటించినట్లు నవంబరు 4, 8వ తేదీల్లో జరుగుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు గమనించి పరీక్షలకు హాజరుకావాలని కోరారు. ఏమైనా సందేహాలుంటే సంబంధిత విభాగాధితులు, డీన్స్‌లను సంప్రదించాలని కోరారు.

డైట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ అండ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో ఒక్కో పోస్టుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. ఎంపీఈడీ, ఫైన్ ఆర్ట్స్, సంగీతం, డ్యాన్స్, థియేటర్ తదితరాల్లో మాస్టర్స్ లేదా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగులు, ఉద్యోగ విరమణ పొందిన వారు ఈనెల 12లోగా డైట్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పర్వతగిరి విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్వతగిరి మండల కేంద్రంలోని టీజీటీడబ్ల్యుయూఆర్‌జేసీ గర్ల్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.శైలజారాణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్ 14, 17, 19 ఏళ్ల విభాగంలో ఇటీవల హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఎల్.స్రవంతి, బి.వెన్నెల, బి.శైలజ, బి.అనూష, డి.సింధు, సీహెచ్.సంధ్య, జి.మనీషా, ఆర్.రాధిక, జి.త్రిష, ఎం.అంజలి, తదితరులను ప్రిన్సిపాల్ శైలజరాణి, వైస్ ప్రిన్సిపాల్స్ ఆర్. శారద, సంధ్య, పీడీ ఎం. అపర్ణ తదితరులు అభినందించారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం


గిన్నారపు ఐలమ్మ (ఫైల్)

ఎల్కతుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల హసన్‌పర్తి మండలంలో అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం శనివారం ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో లభ్యమైంది. ఎస్సై రాజ్‌కు మార్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... హసన్ పర్తి మండలం సీతంపేటకు చెందిన వృద్ధురాలు గిన్నారపు ఐలమ్మ (80) గత నెల 26న తిమ్మాపూర్‌లోని కుమార్తె వద్దకు బయలు దేరివెళ్లింది. కానీ అక్కడకు చేరుకోకపోగా, తిరిగి ఇంటికి రాకపోవడంతో గత ఆదివారం హసన్‌పర్తి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం తిమ్మాపూర్‌కు చెందిన గూడెం సుమన్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా బావిలో మృతదేహం కనిపించింది. దీంతో ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీయడంతో ఐలమ్మగా బంధువులు గుర్తించారు. మృతురాలు ఐలమ్మకు కంటి చూపు మందగించడంతో నడుచు కుంటూ వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఐలమ్మ కుమారుడు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆడెపు రవీందర్‌కు 'కీర్తి పురస్కార్' అవార్డు

పోచమ్మమైదాన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బ్యాంకు కాలనీ-2 శాంతినగర్‌కు చెందిన శ్రీ బాలాజీ క్రియేషన్స్ అధినేత లయన్ డాక్టర్ అడెపు రవీందర్‌కు 'కీర్తి పురస్కార్' అవార్డు లభించింది. జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌కు చెందిన దివంగత గాయకులు శంకర్, సారంగపాణిల జ్ఞాపకార్థం శనివారం కీర్తి పురస్కార్ అవార్డులు ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథిగా హాజరై రవీందర్‌కు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. కళాకారుల జ్ఞాపకార్థం కళా సంస్థలు కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు జడల శివ పాల్గొన్నారు.

కార్తీకం.. ఆరంభం

వేయిస్తంభాల ఆలయంలో భక్తుల పూజలు .. రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన


రుద్రేశ్వరుడికి ప్రత్యేక పుజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివవిష్ణువులకు ప్రీతికరమైన కార్తీక మాసం ఆరంభమైంది. తొలిరోజైన శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు శైవక్షేత్రాలు, ఆలయాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి. ముఖ్యంగా హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివవిష్ణువులకు ప్రీతికరమైన ఈ మాసంలో రుద్రేశ్వరుడికి పూజలు నిర్వహించడం ద్వారా విశేష ఫలం లభిస్తుందన్నారు. మహిళలు సామూహికంగా దీపోత్సవాలు, పూజలు, ధాత్రినారాయణ కల్యాణ ఉత్సవాలు ఉసిరిక పూజలు, దీపాలు, అన్నదానాలు, వస్త్రదానాలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవతో ఉత్తిష్ట గణపతికి హరిగ్రామం కుంకుమ అలంకరణ నిర్వహించిన అనంతరం శ్రీరుద్రేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చక బృందం నిర్వహించిందన్నారు. అదే విధంగా స్వామి వారికి ఐదురకాల పుష్పాలు లిల్లీ, బంతి, చామంతి, గులాబీ, మల్లె పుష్పాలను విజయవాడ నుంచి తెప్పించి కన్నుల పండగా పుష్పార్చనను నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు సామూహికంగా అభిషేకాలు, నిర్వహించారు. కాగా, ఆలయంలో సరైన వసతులు లేవని భక్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవో తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తగిన వసతులు కల్పించాలని ఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా వుండగా, కార్తీక మాసం తొలిరోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సందీప్‌శర్మ, మణికంఠశర్మ, సేవకులు ప్రసాద్, కాశీవిశ్వనాథచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, సుజాత పాల్గొన్నారు.


కాళేశ్వరాలయ ప్రాంగణంలో వత్తులు కాలుస్తున్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద దీపాలంకరణ వెలిగిస్తున్న అర్చకులు

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, నవంబరు 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర క్షేత్రం కార్తీక సందడిని సంతరించుకుంది. కార్తీక మాసం తొలి రోజైన శనివారం ఆలయానికి తరలొచ్చిన భక్తులు తొలుత గోదావరిలో స్నానం ఆచరించి స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రమిదలు, తైలం అందజేశారు. ఉసిరి చెట్టు వద్ద భక్తులు వత్తులు కాల్చారు.. ఉసిరి చెట్టు, తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఆకాశదీపం

కార్తీక మాసం సందర్భంగా నెలరోజుల పాటు ధ్వజస్తంభానికి ఆకాశ దీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. శనివారం నుంచి రోజూ 108 దీపాల అలంకరణ కార్యక్రమం కాళేశ్వరంలో నిర్వహించనున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, గ్రామస్థులు, అర్చకులు పాల్గొన్నారు.

అభిరుచి

సండే స్పెషల్
sunday special

ఆ ఊరంతా నలభీములే



- రుచికరమైన వంటల్లో వారికి లేరుసాటి..
- దాబా, రెస్టారెంట్లలో ఆ గ్రామ మాస్టర్ల రుచులే..
- ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

లింగాలఘణపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుచికరమైన వంటకాల్లో వాళ్లది అందెవేసిన చేయి.. నోరూరించే పసందైన భోజనాల తయారీలో వాళ్లకు మరెవరూ సాటి రారు.. చికెన్ బిర్యానీ.. మటన్ బిర్యానీ.. చికెన్ టిక్కా.. తందూరి చికెన్.. జింజర్ చికెన్.. బటర్‌చికెన్.. చికెన్ కోలాపూరి.. చికెన్‌మసాల ఇలా ఏది వండి నా లొట్టలేసుకునే తినాల్సిందే. హైద్రాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట దాబా ఉందంటే అక్కడ ఖచ్చి తంగా నేలపోగులకు చెందిన వంట మాస్టర్ ఉండా ల్సిందే. లింగాలఘణపురం మండలంలోని మారు మూల పల్లె నేలపోగుల గ్రామం ప్రత్యేకత. నిరుపేద లకు, నిరుద్యోగులకు నిలయం. బతుకుదెరువు కోసం వంటల తయారీ వైపు దృష్టిని సారించారు. వంద మం ది దాకా నలభీములుగా(వంటల మాస్టార్లు) మారా రు. ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల గ్రామ వంటకాలపై ఆంధ్రజ్యోతి సండే స్పెషల్.

మూడున్నర దశాబ్దాల పయనం..

జనగామ జిల్లా నిరుపేదలకు నిలయంగా ఉండేది. పెరుగుతున్న కుటుంబ భారం.. పిల్లల చదువులు.. వృద్ధ తల్లిదండ్రుల పోషణ ఇలా అనేక రకాల బాధ్యత లు నేలపోగుల గ్రామస్థులను కుదుపేస్తున్న క్రమంలో దినసరి కూలీగా వంటకాలు చేయడం వైపు దృష్టి సారించారు. 35ఏళ్ల క్రితం ఒకరికి మరొకరు సాయం గా ఒకరి తర్వాత ఇంకొకరు వంటకాలను తయారు చేస్తూ యువకులు నలభీములుగా ఆరితేరారు. మొద ట్లో హైద్రాబాద్, వరంగల్‌లాంటి పట్టణాల్లో పెద్దపెద్ద హోటళ్లలో వంటల మాస్టార్లుగా పనిచేశారు. ఆతర్వాత స్వయంగా ఉపాధి మార్గాలను అన్వేషించుకుంటూ సొంతంగా దాబాలను ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్థిర త్వాన్ని సాధించే దిశగా పయనిస్తున్నారు. ఇప్పుడు హైద్రాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా కేంద్రంలో రకరకాల రుచికరమైన వంటకాలతో భోజనప్రియులను ఆకట్టుకునే దాబాలన్నీ నేలపోగుల గ్రామానికి చెందిన మూలాలే అత్యధికం.

నోరూరించాల్సిందే..

గాజులు లేని వంట గమ్మత్తయిన వంట అన్నట్లుగా నేలపోగుల చెందిన అనేక మంది వంటల మాస్టార్లు వంటకాలు తయారుచేయడంలో మహిళలను తలద న్నేస్తున్నారు. ఇంట్లో తయారుచేసుకున్నట్లుగానే తెలం గాణ చికెన్, ఆంధ్రా చికెన్ ఇలా ప్రాంతాల వారిగా వి నియోగదారులకు ఇష్టమైన రీతి లో తయారు చేసే వంటలు చేస్తే అక్కడు న్న వ్యక్తులు ఎప్పుడెప్పుడా అంటూ లొట్ట లు వేయాల్సిందే. ఒక్కసారి నేలపోగులకు చెందిన చేతివంటకాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపించడమే వీరి ప్రత్యేకత.


దాబాలో చపాతీ కాలుస్తున్న చెఫ్

విందు కార్యక్రమాల్లో వంటలు..

రుచికరమైన వంటలు తయారు చేయడంలో ప్రావీణ్యతను సాధించిన నేలపోగుల వంటల మాస్టార్లు కేవలం దాబాల్లోనే కాకుండా విందు కార్యక్రమాలకు ఆర్డర్‌పై వంటలను తయారు చేసేందుకు మొబైల్ సర్వీస్ కూడా చేస్తున్నారు. పెద్ద పెద్ద ఫంక్షన్లలో వంట లు చేసేందుకు కొందరు తమ పరివారంతో బయలు దేరి ఉపాధి పొందడంలోనూ నేలపోగుల నలభీములు భోజనప్రియులతో వారెవ్వా అనిపించుకుంటున్నారు.



33 ఏళ్ల నుంచి వంటలు చేస్తున్నా..

- తేరాల శ్రీనివాస్, నేలపోగుల



మాది పేదరిక కుటుంబం. నేను పెద్దగా చదువుకోలేదు. 33ఏళ్ల క్రితం హన్మకొండలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు ఊరి నుంచి బయలుదేరాను. అక్కడే వంట మాస్టార్‌గా నైపుణ్యతను సాధించాను. ఆ తర్వాత స్వయంగా దాబా పెట్టాలనే ఆలోచన వచ్చింది. ప్రస్తుతం జనగామ జిల్లా కేంద్రంలో దాబాను నడిపిస్తున్నాను. 33 ఏళ్ల నుంచి ఇదే వృత్తిలో ఉంటూ ప్రస్తుతం ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకున్నాను. నేలపోగుల నుంచి ఎంతో మంది వంటకాన్నే ఉపాధిగా మార్చుకోవడం ఆనందంగా ఉంది.

ఇక నుంచి పుష్‌పుల్ మరో ట్రిప్పు

» పునః ప్రారంభమైన మధ్యాహ్నం రైలు » ప్రతీ రోజు 1.45 గంటల కు వరంగల్ నుంచి పయనం



గిర్మాజీపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పేదల రైలుగా పేరు గడించిన వరంగల్-హైదరాబాద్ పుష్‌పుల్ రైలు రెండేళ్ల తరువాత మధ్యాహ్నం ట్రిప్పు తిరిగి అందు బాటులోకి వచ్చింది. కరోనాకు ముందు వరంగల్ నుంచి ఉదయం, మధ్యాహ్నం హైదరాబాద్‌కు నడిచేది. కరోనా లాక్‌డౌన్‌తో 2021 నుంచి పుష్‌పుల్ రైలు నిలిచిపోయింది. కరోనా తరువాత అన్ని రైళ్ల యథా విధిగా మొదలైనప్పటికీ పుష్‌పుల్ రైలు నడవలేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' పలు వార్తా కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు కేవలం మధ్యాహ్నం మాత్రమే 2022 జూలై 25న ప్రారం భించి కొద్ది కాలం నడిపి నిలిపివేశారు. అయితే కాజీపేట నుంచి మాత్రం ప్రతీ రోజు ఉదయం వేళ మాత్రం హైదరాబాద్‌కు నడుస్తోంది.

24 నెలల తరువాత..

వరంగల్ నుంచి మధ్యాహ్నం నడిచిన పుష్‌పుల్ రైలును 2022 అక్టోబర్‌లో రైల్వే అధికారులు నిలిపివే శారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి కాకతీయ, గోల్కొండ, శాతావాహన, గోదావరి తదితర ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ విషయంపై గత ఆగస్టు 31న 'ఆంధ్రజ్యోతి' మరో కథనం ప్రచురించింది. దీంతో రైల్వే ఉన్నత అధికారులు స్పందించి ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలును తిరిగి ప్రారంభించారు. ఈ రైలు ప్రతీ రోజు మధ్యాహ్నం వరంగల్ నుంచి 1.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు కాజీపేటకు చేరుకుని అక్కడి నుంచి 2.15 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. అయితే ప్రజలకు ఈ సమాచారం లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం ప్రయాణికులు తక్కువగానే వచ్చారు. పుష్‌పుల్ టికెట్ వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు రూ.35 ఉండగా హైదరాబాద్‌కు రూ.40 ఉంది. కాగా, ప్రస్తుతం ఉదయం కాజీపేట నుంచి హైదరాబాద్ నడుస్తున్న పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని, ఈ దిశగా రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వరంగల్ ప్రజలు కోరుతున్నారు.

ప్రకటనే ఆలస్యం!

- కాజీపేట రైల్వే డివిజన్ హోదాకు మార్గం సుగమం
- ఏడాదిలో వ్యాగన్, మరో ఏడాదిలో కోచ్ ఫ్యాక్టరీలు
- మరిన్ని అభివృద్ధి పనులతో పూర్వ వైభవం



కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్.. డివిజన్‌గా మారబోతోంది. అందుకు మార్గం సుగమమైందన్న సంకేతాలు వస్తున్నాయి. కాజీపేటకు వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు, బైపాస్ లైన్ నిర్మాణం, అమృత్‌భారత్‌లో భాగంగా కాజీపేట రైల్వే స్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ స్థాయిలో ఆధునీకీకరిం చనున్నారు. అందుకు కావాల్సిన రోడ్డు రవాణా, నీటి సౌకర్యం, కావాల్సిన స్థలం సిద్ధంగా ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యధిక ఆదాయం కాజీపేట జంక్షన్ నుంచే వస్తోంది. దీంతో డివిజన్ హోదా కల్పించక తప్పని పరిస్థితి. ఇన్ని అనుకూల అవకాశాలున్న కాజీపేట డివిజన్ హోదా ప్రకటించడమే ఆలస్యమనే చర్చ జరుగుతోంది. కాజీపేట రైల్వే డివిజన్ హోదా వస్తే రైల్వే పరంగా కాజీపేటలో డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) కార్యాలయాలతో పాటు ఇతర అన్ని ముఖ్యమైన కార్యాలయాలు ఇక్కడే నిర్మించాల్సిన పరిస్థితి. ఇక కాజీపేటకు మహర్దశేనన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

వచ్చే ఏడాది అందుబాటులోకి వ్యాగన్లు..

2013లో కాజీపేట మండలం మడికొండ సమీపంలోని అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.523 కోట్ల నిధులతో నాటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి మమత బెనర్జీ రైల్వే పీవోహెచ్ మంజూరు చేశారు. తర్వాత వ్యాగన్ తయారీ పరిశ్రమగా అప్‌గ్రేడ్ చేశారు. కాలక్రమేణా ఆలస్యమైనా 2023లో ప్రధాని మోదీ రూ.66కోట్లు అదనపు నిధులతో సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో వ్యాగన్ తయారీ పరిశ్రమను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ వ్యాగన్ తయారీ పరిశ్రమ 2025 ఆగస్టులో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులు చకచక సాగుతున్నాయి.

కోచ్‌ఫ్యాక్టరీ కూడా..

కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కాజీపేటకు మంజూరైంది. వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ రూ.680కోట్లతో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అందుకుగాను రూ.66 కోట్ల నిధులు కూడా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆర్‌వీఎన్ఎల్ సంస్థ స్థలం, నిధు లపై సర్వేచేసి రైల్వే బోర్డుకు సమర్పించారు. 1980 దశకం నుంచి డిమాండ్ ఉన్న కోచ్‌ఫ్యాక్టరీ సాధనకోసం తెలంగాణ రైల్వే జేఏసీ, మజ్దూర్ , ఎంప్లాయీస్ సంఘ్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నో ఉద్యమాలు చేశాయి. ఎట్టకేలకు కేంద్రం కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేసింది. కోచ్‌ఫ్యాక్టరీ 2026 చివరి నెలలో అందుబాటులోకి రావడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి మధ్య బైపాస్ లైన్ నిర్మాణం, ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్, హసన్‌పర్తి, వరంగల్ మధ్య మూడో లైన్ నిర్మాణంతో రైల్వే పరంగా కాజీపేట అభివృద్ధిని ఊహించలేమంటున్నారు విశ్లేషకులు. ఇన్ని అభివృద్ధి పనులు జరుతున్న దృష్ట్యా నిరుద్యోగులకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్య క్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమంది ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచ నా వెరసి రైల్వే కార్మికులో కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

కాజీపేటకు పూర్వవైభవం

ఒకప్పుడు కాజీపేట నగరం రైల్వే కార్మికులతో కళకళలాడేది. కాజీపేట అంటేనే రైల్వే కార్మికుల కేంద్రం. అలాంటిది రోజురోజుకు రైల్వే కార్యాలయాల తరలింపు, ఉద్యోగుల బదిలీలతో కళతప్పింది. కాజీపేటలో రైల్వే పరిశ్రమలు నిర్మించాలని, దీంతో కార్మికులతో కాజీపేటకు పూర్వ వైభవం రావాలని ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేశాయి. దీంతో కాజీపేటలో వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, వందేభారత్ కోచ్‌లతోపాటు లింక్‌హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ), ఎలక్ట్రిక్ మల్టిబుల్ యూనిట్ (ఈఎంయూ) కోచ్‌లు తయారు చేసే కోచ్ ఫ్యాక్టరీ కాజీపేటలోనే తయారు కానున్నాయి. వెరసి కాజీపేట జంక్షన్ గతంకన్నా భిన్నంగా వేలాదిగా రైల్వే కార్మికులు, వారి కుటుంబాలు, విద్యాలయాలతో కాజీపేట జంక్షన్ కళకళలాడనుంది.

ఘనంగా 'జోడెద్దుల' ఉత్సవం

● ఉత్సాహంగా రెండో రోజు దీపావళి బతుకమ్మ వేడుకలు ● కోలాటాల మధ్య కుంటకు తరలిన నేతకాని కులస్థులు ● నేడు ముగియనున్న ఉత్సవాలు


జోడెద్దులకు ఆరగింపు చేస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు హసన్‌పర్తి మండలంలోని సీతంపేట నేతకాని కులస్థులు నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలు శుక్రవారం సంప్రదాయం బద్ధంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. నేతకాని కులస్థులు కేదారీశ్వరస్వామి వ్రతం నిర్వహించుకొని జోడెద్దులకు పిండి వంటలతో తయారు చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. రెండో రోజు శనివారం పురుషుల ఘట్టంలో భాగంగా జోడెద్దుల ప్రతిమలను తీసుకొని కోలాటాలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగ వారు మాత్రమే) సరసాలాడి రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, బొంబాయి లాంటి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేతకాని కులస్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పురుషుల కోలాటాల నృత్యాలు, కోలాటం పాటలు గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బండారి రజితచేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. అయితే మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు మూడో రోజైన ఆదివారం ముగియనున్నాయి. చివరిరోజున నేతకాని మహిళలు మాత్రమే జరుపుకొంటారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను కేదారీశ్వర స్వామి ఎదుట ప్రత్యేకంగా పూజిస్తారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురాలు జరుపుకొంటారు. అనంతరం బతుకమ్మపై ఏర్పాటు చేసిన గౌరమ్మను వాయినంగా ఇచ్చి పుచ్చుకొని వారి వెంట తెచ్చుకున్న సద్దిని పంచుకొని ఒకరికొకరు తినిపించు కుంటారు. అనంతరం బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేయడంతో మూడు రోజుల పాటు నిర్వహించే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి.


ఊరేగింపుగా తరలివస్తున్న నేతకాని కులస్తులు

రక్షణకు పచ్చని పరదా..

» విరివిగా వినియోగిస్తున్న ప్రజలు
» పల్లెల్లో ఏ ఇంట చూసినా ఇవే..


గ్రీన్‌మ్యాట్‌తో ఇళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పర్వతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. సామగ్రి మొదలు కూలీల వరకు అంతా భారమైంది. ఏ పనిచేయాలన్నా లక్షల్లో ఖర్చవుతోంది. ఈ క్రమంలో పచ్చని పరదాలు సామాన్యుల పాలిట రక్షణ కవచాలుగా మారాయి. చాలామంది తమ ఇళ్లకు ప్రహరీలుగా.. ఎండకు నీడనిచ్చే పైకప్పుగా.. చిన్నపాటి గదులను ఏర్పాటు చేసే గోడల్లా మారుతున్నాయి. అంతేకాదు చిన్నచిన్న షాపులు, హోటళ్ల ఏర్పాటు చేసుకునే చిరువ్యాపారులు కూడా వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. వేలల్లో అయ్యే ఖర్చును కాస్త రూ.వందల్లోనే పూర్తిచేసుకుంటున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా సాధారణ ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. అయితే ఈ పరదాలు పలు సైజులు, నాణ్యతను బట్టి కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ఉంటుండటం, ఆ ధరలు అందుబాటులో ఉండటం, మన్నిక కూడా ఉండటంతో ప్రజలు వీటివైపు ఆసక్తి చూపుతున్నారు.


గ్రీన్‌మ్యాట్‌తో ఏర్పాటుచేసిన ప్రహరీ

నవ్య ఆదివారం

కుటుంబ కదంబం


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మీట్ మీ నెక్స్ట్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 06
అవుటర్ బ్యాంక్స్ 4	వెబ్‌సిరీస్ 2	నవంబర్ 07
మిస్టర్ ప్లాంక్‌టన్	కొరియన్ సిరీస్	నవంబర్ 08
ది బకింగ్‌హామ్ మర్డర్స్	హిందీ చిత్రం	నవంబర్ 08
ఉమ్జోలో	హాలీవుడ్ మూవీ	నవంబర్ 08
వేట్టయాన్	తెలుగు డబ్బింగ్	నవంబర్ 08
విజయ్ 69	హిందీ చిత్రం	నవంబర్ 08
ఆర్కేన్ 2	యానిమేషన్ సిరీస్	నవంబర్ 09
ఇట్ ఎండ్స్ విత్ అజ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 09
అమెజాన్ ప్రైమ్		
సిటాడెల్: హనీ బన్నీ	హిందీ సిరీస్	నవంబర్ 07
కౌంట్‌డౌన్: పాల్ వర్సెస్ టైసన్	వెబ్‌సిరీస్	నవంబర్ 07
ఇన్వెస్టిగేషన్ ఏలియన్	వెబ్‌సిరీస్	నవంబర్ 08
జియో సినిమా		
డెస్పికబుల్ మీ 4	తెలుగు డబ్బింగ్	నవంబర్ 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఎక్స్‌ప్లోరర్: ఎండ్యూరన్స్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 03
అజయంతే రందం మోషనమ్	మలయాళ చిత్రం	నవంబర్ 08
ఆహా...		
జనక అయితే గనక	తెలుగు చిత్రం	నవంబర్ 08
బుక్ మై షో		
ట్రాన్స్‌ఫార్మర్స్ ఒన్	యానిమేషన్ మూవీ	నవంబర్ 06

సిటాడెల్ కోసం సీక్రెట్ ఏజెంట్స్



వరుణ్ ధావన్, సమంత లీడ్‌రోల్స్‌లో నటించిన హిందీ సిరీస్ 'సిటాడెల్: హనీబన్నీ'. 'ది ఫ్యామిలీ మాన్, ఫర్జీ లాంటి పాపులర్ వెబ్‌సిరీస్‌లను తెరకెక్కించిన రాజ్ అండ్ డీకే ద్వయం దర్శకత్వం వహించారు. హాలీవుడ్ వెబ్‌సిరీస్ 'సిటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. ఈ నెల 07 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. భారీ బడ్జెట్‌తో సైబీరియాలో తెరకెక్కిన ఈ సిరీస్ కోసం సమంత ప్రత్యేకంగా యుద్ధవిద్యల్లో తర్ఫీదు అయ్యారు. వరుణ్, సమంత ఇందులో సీక్రెట్ ఏజెంట్స్‌గా కనిపించనున్నారు. ఓ మిషన్ కోసం ఈ జోడీ చేసే యాక్షన్, రొమాన్స్, సెంటిమెంట్ అంశాలు ప్రేక్షకుల్ని అలరించనున్నాయి.




మరోసారి జంటగా...
కథ కలిపింది కనువిందుగా

ఎప్పుడో ఇరవై, ముప్పై ఏళ్ల క్రితం వెండితెరపై జంటగా మెప్పించిన హీరోలు, హీరోయిన్లు వాళ్లంతా. చక్కని ప్రేమకథా చిత్రాలతో ఒకప్పుడు హిట్ ఫెయిర్‌గా బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించిన కాంబినేషన్ వారిది. ఇప్పుడు మళ్లీ దశాబ్దాల తర్వాత మళ్లీ జంటగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వయసుకు తగ్గ పాత్రలతో అలరించేందుకు మంచి కథ కుదిరింది, ఇక కనువిందే వి ఎగిలింది అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మరోసారి జంటగా నటిస్తున్నారు అంటే ఆ హీరో హీరోయిన్ల కాంబినేషన్‌మీద ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఒకప్పుడు మెరిసిన సీనియర్ జంటలు సైతం ఇప్పుడు బాలీవుడ్ తెరపై సందడి చేస్తున్నాయి. సీనియర్ హీరోలకు జోడీగా సీనియర్ భామలు ఆడిపాడుతున్నారు.

బాలీవుడ్‌లో మరో సీనియర్ సంజయ్‌దత్‌తో రవీనాటాండన్ జంటగా నటించిన పలు చిత్రాలు బాక్సాఫీసు దగ్గర సందడి చేశాయి. 'జంగ్, ఆతిష్, విజేత, జీనా మర్నా తేరే సంగ్, క్షత్రియ' తదితర చిత్రాల్లో కలసి నటించగా కొన్ని చిత్రాలు



మంచి విజయాన్ని అందుకున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరూ కలసి నటించిన చిత్రం 'ఘడ్‌చడీ'. 90ల నాటి ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ ఏడాది ఆగస్టులో ప్రముఖ ఓటీటీలో విడుదలవ్వగా సంజయ్, రవీనా జంట ప్రేక్షకులను మెప్పించింది.



రెండు తరాల ప్రేమకథలో ఈ మధ్యన వరుస అపజయాలతో అక్షయ్‌కుమార్ జోరు కొంచెం తగ్గింది. కానీ ఆయన చేతిలో మాత్రం ఎప్పుడూ నాలుగైదు సినిమాలు ఉంటున్నాయి. అలాగే అందం అభినయంతో బాలీవుడ్‌లో కథానాయికగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు రవీనా టాండన్. వీరిద్దరి జంట బాలీవుడ్‌లో హిట్ ఫెయిర్‌గా పేరు తెచ్చుకుంది. తొలిసారి వీరిద్దరూ జంటగా 'మొహ్రా' చిత్రంలో నటించారు. ఆ తర్వాత 'ఖిలాడియోంకా ఖిలాడి, కీమత్, దావా, బరూద్, పోలీస్ ఫోర్స్' చిత్రాల్లో కలసి కనిపించారు. తెరపైనే కాదు నిజజీవితంలోనూ ప్రేమలో పడ్డ ఈ జంట నిశ్చితార్థం చేసుకున్నాక విడిపోయింది. ఆ తర్వాత వీరిద్దరూ కలసి సినిమాలు చేయలేదు. ఇప్పుడు ఇరవై ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలసి నటించిన 'వెల్కమ్ టూది జంగిల్' చిత్రం ఈ ఏడాది క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ చిత్రంలో రవీనా, అక్షయ్ జంట మరోసారి అభిమానులను అలరించనుంది. అలాగే అక్షయ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'జాలీ ఎల్ఎల్‌బీ'లోనూ రవీనా కనిపించనున్నారు. అయితే ఈ చిత్రంలో ఆమె సునీల్‌శెట్టి భార్య పాత్రలో కనిపించనున్నారు.

గదర్ మేజిక్

2003లో వచ్చిన 'ది హీరో' చిత్రంతో తొలిసారి జంటగా కనిపించారు సన్నీడియోల్, ప్రీతీ జింటా. ఈ మధ్యలో వీరిద్దరి కలయికలో 'హీరోస్, భయ్యాజీ సూపర్‌హిట్' చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబినేషన్ కుదిరింది.



'లాహోర్ 1947' చిత్రంలో సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింటాతో కలసి సందడి చేయనున్నారు సన్నీడియోల్. ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేశ విభజన నేపథ్యంలో సాగే కథ ఇది. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంచలన వసూళ్లతో బాలీవుడ్ చరిత్రలో నిలిచిపోయిన చిత్రం 'గదర్'. సన్నీడియోల్, అమీషా పటేల్ జంటగా నటించారు. ఆ చిత్రానికి కొనసాగింపుగా రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన 'గదర్ 2' చిత్రంలోనూ సన్నీడియోల్, ఆమిషా పటేల్ జంట కనువిందు చేసింది. తొలిభాగానికి లభించిన స్థాయిలోనే రెండో భాగానికి సైతం వసూళ్లు దక్కడం విశేషం.

సింగం శ్రీమతిగా

అజయ్‌దేవ్‌గణ్, కరీనా కపూర్ తొలిసారి 2006లో వచ్చిన 'ఓంకార' చిత్రంలో జంటగా నటించారు. ఆ తర్వాత వారి కాంబినేషన్‌లో 'యువ, గోల్‌మాల్ రిటర్న్స్, గోల్‌మాల్ 3, సత్యాగ్రహ' చిత్రాలు వచ్చాయి. ఆ అవన్నీ దాదాపు బాక్సాఫీసు దగ్గర మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు 'సింగం ఎగైన్' చిత్రంతో దీపావళికి ఈ జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 2014లో వచ్చిన 'సింగం రిటర్న్స్' చిత్రంలో అజయ్ భార్య పాత్రలో కరీనా కనిపించగా ఇప్పుడు 'సింగం ఎగైన్'లోనూ ఆమె అదే పాత్రను పోషించారు.

'తలాష్, త్రీ ఇడియట్స్' చిత్రాల్లో జంటగా కనిపించారు ఆమిర్‌ఖాన్, కరీనాకపూర్. ఆ తర్వాత 'బాంబే టాకీస్' చిత్రంలో ఓ పాటలో వీరిద్దరూ అతిథి పాత్రల్లో కనిపించారు. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత వీరిద్దరూ కలసి నటించిన 'లాల్‌సింగ్ చద్దా' 2022లో విడుదలైంది. బాక్సాఫీసు దగ్గర నిరాశపరిచినా కానీ ఈ జంటకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి.





ఇక టబు, అజయ్ దేవ్‌గణ్ జంట గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. వారిది బాలీవుడ్‌లో హిట్ ఫెయిర్. వారిద్దరి కలయికలో తొమ్మిది సినిమాలు రాగా వాటిలో విజయాల శాతం ఎక్కువే. 'దృశ్యం, గోల్‌మాల్ అగైన్, విజయ్‌పథ్, హకీకత్, దేదే ప్యార్‌దే' తదితర చిత్రాల్లో నటించారు. వీరిద్దరి కలయికలో తెరకెక్కిన 'ఆరోమే కహాన్ దమ్ థా' చిత్రం ఇటీవలే విడుదలైంది.

బ్యూటీ

ముఖంపై ముడతలు నివారించండిలా

వయసు పెరిగేకొద్దీ చర్మంపై ముడతలు సహజం. కానీ ప్రస్తుతం చిన్నవయసువారిని కూడా ఈ సమస్య వేధిస్తోంది. చర్మంలో కొల్లాజెన్ అనే ప్రొటీన్ ఉంటుంది. పోషకాహార లోపం, ఒత్తిడి, కాలుష్యం కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గి ముఖంపై ముడతలు ఏర్పడతాయి. మంచి పోషకాహారం తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. అవేంటో చూద్దాం!

తేనె: చర్మ కణాలను రక్షించడంలో తేనెదే ప్రథమ స్థానం. ఇది చర్మంపై తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. స్వచ్ఛమైన తేనెను ముఖమంతా రాసి బాగా ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చర్మంపై ముడతలు తగ్గి ఆరోగ్యంగా ఉంటుంది.

కలబంద: కలబంద గుజ్జులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. ఈ గుజ్జును ముఖమంతా పట్టించి ఇరవై నిమిషాల తరవాత మంచినీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే చర్మంలో హైడ్రేషన్ స్థాయి పెరిగి ముఖం మీద గీతలు, ముడతలు తగ్గుతాయి.

కొబ్బరినూనె: కొబ్బరినూనెలోని ఫాటీ యాసిడ్స్ చర్మానికి పోషణనిస్తాయి. ఒక బౌల్‌లో అయిదు చెంచాల కొబ్బరి నూనె వేసి కొద్దిగా వేడి చేయండి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెను ముఖమంతా రాస్తూ ఒకే దిశలో మర్దన చేయండి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ప్రయోజనం ఉంటుంది.



ఆలివ్ ఆయిల్: ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్రీ రాడికల్స్, ఆరోగ్యకరమైన క్రొవ్వులు ఉంటాయి. ఆలివ్ ఆయిల్‌తో ముఖం మీద మసాజ్ చేసినపుడు ఇవి చర్మకణాల్లో ఒత్తిడిని తగ్గిస్తాయి. ముఖమంతా రక్తప్రసరణ జరుగుతుంది. దీనివల్ల నుదుటి మీద గీతలు, కంటి చుట్టూ ఉండే ముడతలు పోతాయి.

పెరుగు: పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మ సంరక్షణకు, మృతకణాలను తొలగించేందుకు సహాయం చేస్తుంది. కొంచెం పెరుగును ముఖమంతా పట్టించి ఇరవై నిమిషాల తరవాత నీళ్లతో కడగాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే చర్మం ముడతలు లేకుండా కాంతివంతంగా ఉంటుంది.

గ్రీన్ టీ: ఇది మంచి టోనర్‌గా ఉపయోగపడుతుంది. గ్రీన్ టీని తయారుచేసిన తరవాత ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తరచూ ముఖం మీద స్ప్రే చేసుకుంటూ ఉంటే ముడతలు, గీతలు, నల్లని మచ్చలు మాయమవుతాయి.

అరటిపండు: ఒక బౌల్‌లో అరటిపండును గుజ్జులా చేసి దానికి ఒక చెంచా తేనె, రెండు చెంచాల పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా పట్టించాలి. బాగా ఆరిన తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ముఖం తాజాగా ఉంటుంది.

రోజ్‌వాటర్: ఒక గిన్నెలో రెండు చెంచాల రోజ్‌వాటర్, రెండు చెంచాల గ్లిజరిన్, ఒక చెంచా నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేయాలి. పదిహేను నిమిషాల తరవాత నీళ్లతో కడిగేస్తే ముఖం మీద పేరుకున్న మురికి తొలగిపోతుంది. చర్మం స్టిఫ్‌గా మారుతుంది.

కోడిగ్రుడ్డు: గ్రుడ్డులోని తెల్ల సొనని తీసుకుని ముఖం మీద పొరలా పరచాలి. బాగా ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేసినా మంచి ఫలితముంటుంది.

నిద్ర: మంచి నిద్ర శరీరానికి స్వాంతన కలిగిస్తుంది. దీనివల్ల హార్మోన్ల పనితీరు సజావుగా ఉంటుంది. రోజుకి కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకుంటే ఒత్తిడి, అలసట తగ్గి వార్ధక్య ఛాయలు దగ్గరికి రాకుండా ఉంటాయి.

ఐరన్ కావాలా... ఇవి తినండి

మహిళల్లో ఐరన్ లోపం అనేది సర్వసాధారణంగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం పోషకాహారం తీసుకోకపోవడమే. ఐరన్ లోపంవల్ల రక్తహీనత, నీరసం, రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు వస్తాయి. వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలుసుకుందాం!



పప్పు ధాన్యాలు: కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వేరుశనగ వంటి పప్పుల్లో ఐరన్ మినరల్ ఎక్కువగా ఉంటుంది. వీటిని ఉడికించి సూప్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. రోజుకొక పప్పు రకాన్ని సైడ్ డిష్‌గా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి కావాల్సిన ఐరన్‌ను అందించడమే కాకుండా జీర్ణక్రియ సజావుగా ఉండేలా చేస్తాయి.

పాలకూర: వంద గ్రాముల ఉడికించిన పాలకూరలో 2.7 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. పాలకూరను సలాడ్స్‌లో, స్మూతీల్లో, ఇతర వంటకాల్లో భాగంగా చేర్చుకుని తరచూ తింటే శరీరానికి అవసరమైన న్యూట్రియెంట్స్, ఆగ్జలేట్లు పూర్తిగా అందుతాయి. వీటితోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా లభిస్తాయి.

రెడ్ మీట్: ఇందులో శరీరం త్వరగా గ్రహించే హీమే ఐరన్ ఉంటుంది. రెడ్‌మీట్‌ను మితంగా రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి ప్రొటీన్లు, బి విటమిన్ కూడా అందుతాయి.

గుమ్మడి గింజలు: వంద గ్రాముల గుమ్మడి గింజల్లో 3.3 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. వీటిలో న్యూట్రియెంట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అవసరమైన హెల్దీ ఫ్యాట్స్‌ను అందిస్తాయి. గుమ్మడి గింజలను పచ్చిగా, వేయించుకొని తినవచ్చు. సలాడ్స్‌లో కలుపుకోవచ్చు.

క్వినోవా: ఇందులో ఐరన్‌తోపాటు మెగ్నీషియం, మాంగనీస్, ఫైబర్, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది గ్లూటెన్ లేని ధాన్యం. దీనిని మెయిన్ డిష్ కింద వారానికి రెండు సార్లు తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

టోఫు: ఇది శాకాహారులకు అధిక పరిమాణంలో ఐరన్‌ను అందించే ఆహారం. దీనిని రకరకాల వంటకాల్లో, సూపుల్లో చేర్చుకోవచ్చు. ఇందులో అధిక పరిమాణంలో ప్రొటీన్లు ఉంటాయి. మీట్‌కు ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. టోఫుతో రకరకాల స్నాక్స్ కూడా తయారు చేస్తున్నారు.

సెలబ్ టాక్

స్టార్‌డమ్‌ దిశగా..!

నాజూకైన రూపు... గమ్మత్తయిన చూపు... వెండితెరపై మెరుపు తీగలా మైమరిపిస్తుంది **దిశా పటాని**. తెలుగు చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ భామ... ఇప్పుడు చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా మారింది. ప్రభాస్ 'కల్కి 2898ఏడీ'లో అలరించిన దిశ... తమిళ స్టార్ సూర్యా 'కంగువా'తో మరో భారీ హిట్ కోసం ఎదురుచూస్తోంది.

దాదాపు పదేళ్ల కిందట కెరీర్ ప్రారంభించిన దిశా పటాని... ఇప్పటికి పద్నాలుగు చిత్రాల్లో నటించింది. విశేషమేమంటే... వీటిల్లో అత్యధికం భారీ బడ్జెట్ సినిమాలే. అదీ సల్మాన్, టైగర్ షరాఫ్, ప్రభాస్, సూర్య, జాకీచాన్ లాంటి సూపర్‌స్టార్స్‌తో కలిసి పని చేసింది. 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చినా... ఆమెను వెండితెరకు పరిచయం చేసింది మాత్రం తెలుగు పరిశ్రమే.



పూరి జగన్నాథ్ 'లోఫర్'లో వరుణ్‌తేజ్‌కు జోడీగా ప్రధాన పాత్ర పోషించిన దిశ... ఆ మరుసటి ఏడాది 'ఎంఎస్ ధోనీ'లో అవకాశం దక్కించుకుంది. ఈ అపురూప విజయంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు దేశమంతా మారుమోగింది. భారత క్రికెట్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన చిత్రం కావడంతో... సినీ ప్రేమికులతో పాటు కోట్లాదిమంది క్రికెట్ అభిమానులకు కూడా దిశ సుపరిచితురాలైంది.

పైలెట్ కావాలనుకుని...

దిశ కుటుంబంలో సినీ పరిశ్రమ నేపథ్యం ఉన్నవారు ఎవరూ లేరు. ఆమె తండ్రి జగదీశ్‌సింగ్ పోలీస్ అధికారి. తల్లి హెల్త్ ఇన్‌స్పెక్టర్. అక్క కుష్బూ భారత సైన్యంలో లెఫ్టినెంట్. తమ్ముడు సూర్యాంశ్. బడికి వెళ్లే రోజుల్లో దిశ కూడా భిన్నంగా ఆలోచించింది. ఎయిర్‌ఫోర్స్ పైలెట్ అవుదామనుకుంది. ఎందుకంటే ఎప్పుడూ తనను తాను ప్రత్యేకంగా నిలుపుకోవడానికే ఆమె ప్రయత్నించింది.

'మా ఇంట్లో ఒకరి కెరీర్‌తో వేరొకరికి పొంతన ఉండదు. పోలీస్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఆర్మీ... ఇలా ఒక్కోరిదీ ఒక్కో రంగం. ఎవరికి నచ్చింది వారు ఎంచుకున్నారు. నేనూ అంతే. ఆ స్వేచ్ఛ మాకు ఇంట్లో ఎప్పుడూ ఉంది. చిన్నప్పటి నుంచి అమ్మానాన్న ప్రోత్సాహంతో మేం బాగా చదివేవాళ్లం. మొదట్లో ఎయిర్‌ఫోర్స్ పైలెట్ కావాలనుకున్నాను. కారణం ఏదైతేనేం... అది నెరవేరలేదు. నేను, అక్క క్రీడల్లో చురుగ్గా పాల్గొనేవాళ్లం. నేను బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. తనైతే... అన్ని ఆటలూ ఆడేసేది. చదువుతో పాటు ఆటలు కూడా విద్యార్థుల జీవితంలో భాగం కావాలి. దానివల్ల గెలిచినప్పుడు, అలాగే ఓటమి ఎదురైనప్పుడు సమానంగా స్వీకరించగలుగుతారు. ఒడుదొడుకులకు లోనుకాకుండా ముందుకు సాగిపోవడంతో పాటు విలువైన జీవిత పాఠాలు ఎన్నో నేర్చుకొంటారు. స్వతంత్రంగా ఆలోచించగలుగుతారు. మా నాన్న మమ్మల్ని అలానే పెంచారు. ఎంతటి క్లిష్టమైన పని అయినా సరే... శ్రమించి సాధించాలే కానీ, భయపడి వెనక్కి తగ్గకూడదనేది నేర్పించారు. వేరొకరిపై ఆధారపడకుండా మా పని మేమే చేసుకొనేలా ప్రోత్సహించారు. అందుకే ఇవాళ నేను ఎన్ని ఇబ్బందులు, సమస్యలు, ఒత్తిడులు ఎదురైనా ముంబయి మహానగరంలో నిలబడగలిగాను' అంటున్న దిశ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి.

ఒంటరిగా మహానగరానికి...

లఖనవూ అమిటీ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో ఆమెకు నటనపై మక్కువ కలిగింది. దాంతో రెండేళ్లు మిగిలి ఉండగానే ఇంజనీరింగ్ వదిలేసింది. పరిశ్రమలో అవకాశాలు వెతుక్కొనేందుకు ముంబయికి వెళ్లాలని నిర్ణయించుకుంది. "ముంబయికి వచ్చినప్పుడు నా వయసు పద్దెనిమిది. ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక్కదాన్నే ఉండేదాన్ని. ఆరంభంలో మోడలింగ్ చేశాను. ఎన్నో ఎత్తుపల్లాలు, అవమానాలు ఎదురయ్యాయి. అపజయాలు పంచుకోవడానికి కూడా ఎవరూ లేరు అప్పుడు. కానీ నేను పెరిగిన నేపథ్యం, అనుభవాలు వాటిని తట్టుకొని పోరాడగలిగే శక్తినిచ్చాయి. ఇల్లు శుభ్రం చేసుకోవడం, బట్టలు ఉతుక్కోవడం, వండుకోవడం... ఆడిషన్స్‌కు వెళుతూనే అన్నీ చేసుకొనేదాన్ని. ముఖ్యంగా కరోనా మహమ్మారి ఎన్నో జీవిత పాఠాలు నేర్పింది. వేరొకరి సాయం లేకుండా మన పని మనమే చేసుకోవడం అలవాటైంది. అంతేకాదు... భావోద్వేగాలను అదుపులో పెట్టుకొని, మనం మానసికంగా బలోపేతం కావడానికి దోహదపడింది" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది దిశ.

ఆరు కోట్లమంది...



ఏడాదికి ఒక చిత్రం చేస్తూ వచ్చిన దిశ.. ఈ ఏడాది మూడింటిలో నటించింది. ఎంత బిజీగా ఉన్నా... సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పుడూ అభిమానులను పలకరిస్తూనే ఉంటుంది. తన సినిమా విశేషాలతో పాటు, ఫిట్‌నెస్, ఆరోగ్య రహస్యాలను ఎప్పటికప్పుడు వారితో పంచుకొంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకున్న ఫాలోయింగ్ చూస్తే మతిపోతుంది. అక్షరాలా ఆరు కోట్ల పదిహేను లక్షలమంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రతి పోస్ట్‌కూ వ్యూస్, లైక్స్ కూడా అదే స్థాయిలో ఉంటాయి.

చేతి నిండా పని...

సినిమా ప్రయత్నాల్లో భాగంగా దిశ మోడలింగ్‌తో పాటు అందాల పోటీల్లోనూ పాల్గొంది. పలు మ్యూజిక్ వీడియోల్లోనూ నటించింది. హీరో టైగర్ షరాఫ్‌తో కలిసి ఓ మ్యూజిక్ వీడియోలో కనిపించిన ఆమె... ఆ తరువాత అతనితో కలిసి 'భాగీ2', 'భాగీ3' చిత్రాలు చేసింది. జాకీచాన్ చైనీస్ సినిమా 'కుంగ్‌ఫూ యోగా'లో మెరిసింది. ప్రస్తుతం తమిళ హీరో సూర్య 'కంగువ', ఫిరోజ్ నడియడ్‌వాలా నిర్మాణంలో, అనీస్ బజ్మీ దర్శకత్వంవహిస్తున్న 'వెల్కమ్ టూ జంగిల్' ప్రాజెక్టులు ఆమె చేతిలో ఉన్నాయి. ఇది రెండూ భారీ బడ్జెట్ చిత్రాలు.



పెద్దనాన్న మాటతో నమ్మకం మరింత పెరిగింది



వరుణ్ తేజ్ హీరోగా కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'మట్కా'. మీనాక్షి చౌదరి హీరోయిన్. విజయేందర్ రెడ్డి తీగల, రజని తాళ్లూరి నిర్మాతలు. ఈనెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ' వాసు అనే వ్యక్తి ప్రయాణమే ఈ కథ. 1958లో చిన్నతనంలోనే శరణార్థిగా బర్మా నుంచి వైజాగ్ వస్తాడు. అక్కడి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ 'మట్కా' కింగ్‌లా ఎలా మారాడనేది కథ. వంద శాతం ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుంది. పెద్దనాన్న చిరంజీవికి వారం క్రితం ట్రైలర్ చూపించా. నచ్చింది, మాస్‌గా ఉందన్నారు. దాంతో నా నమ్మకం మరింత బలపడింది. సినిమాలో మీనాక్షి పాత్ర కీలకమైంది. వాసు దగ్గర ఏమీ లేనప్పుడు అమె అండగా నిలుస్తుంది. నటనకు ఆస్కారం ఉండే పాత్రలు చేయాలన్నదే నా కోరిక. 'గద్దలకొండ గణేశ్' తర్వాత అలాంటి ప్రాజెక్ట్ దొరకలేదు. గత మూడు చిత్రాలు సరిగ్గా ఆడలేదు. విభిన్నమైన సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో కరుణకుమార్ ఈ కథ చెప్పారు. నా గత చిత్రాలు విడుదల కాకముందే ఈ సినిమా ఓకే చేశా. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ'రతన్ ఖత్రీ అనే గ్యాంబ్లర్ స్టోరీని ఆధారంగా చేసుకొని 'మట్కా' అనే ఫిక్షనల్ కథను సిద్ధం చేశా. అలాంటి వ్యక్తి వైజాగ్‌లో పుడితే ఎలా ఉంటుంది? అనేదానికి కమర్షియల్ హంగులు జోడించి తీర్చిదిద్దాం' అని చెప్పారు. నిర్మాత విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఫస్ట్ డే కథ విన్నప్పుడు ఎంత థ్రిల్ ఫీలయ్యానో ఈ టీజర్ చూసి అంతకంటే గొప్ప అనుభూతి పొందాను. సినిమా బాగా వచ్చింది' అని ప్రశంసించారు.

ఇంట్లో అబ్బాయిలా అక్కున చేర్చుకున్నారు




హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ మూవీ 'క'. తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్లు. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఘన విజయాన్ని అందించి ఈ దీపావళికి నాకు పెద్ద కానుక ఇచ్చారు. అందుకు అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. నన్ను గతంలో పక్కింటి కుర్రాడి ఇమేజ్‌తో ప్రేక్షకులు చూశారు. ఇప్పుడు మన ఇంటి అబ్బాయి అని భావిస్తున్నారు. ఈనెల 8న మలయాళంలో సినిమాను రిలీజ్ చేస్తున్నాం. తమిళనాట ఉన్న తెలుగు ప్రజలు తమకు షోస్ కావాలని అడుగుతున్నారు. ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ అయ్యాక తమిళనాట ఎందుకు రిలీజ్ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడులో షోస్ వేయాలని డిస్ట్రిబ్యూటర్ వంశీని అడుగుతున్నా. 'క' సినిమా విజయం నాకు గౌరవాన్ని తీసుకొచ్చింది. ఇది తమ విజయంగా భావిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఒక హీరోగా నాకు ఇంతకంటే ఏం కావాలి. సినిమాకు తప్పకుండా సీక్వెల్ చేస్తాం. అది కృష్ణగిరి ఊరి ప్రత్యేకతలతో ఉంటుంది' అని అన్నారు. 'ఫస్ట్ టైం డైరెక్టర్స్ అయిన మాకు 'క' వంటి బ్లాక్‌బస్టర్ తొలి చిత్రంతోనే దక్కడం చాలా సంతోషంగా ఉంది. 'క' ఒక కాంప్లికేటెడ్ సబ్జెక్ట్. ఇలాంటి స్క్రిప్ట్‌ను ప్రేక్షకులంతా ఆదరిస్తున్నారు' దర్శకులు సుజీత్, సందీప్ చెప్పారు. నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్ద సూపర్ హిట్ సినిమా తీసింది నేనేనా అని అనిపిస్తోంది. ఇంకా నమ్మకం కుదరడం లేదు. అందుకే సక్సెస్ కిక్ రావడం లేదు' అని అన్నారు.











సుధీర్ డబుల్



వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తెలుగు ఆటగాడు వాసంశెట్టి సుధీర్ కుమార్ రెండు పతకాలు సాధించాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో కాకినాడకు చెందిన సుధీర్ 75 కిలోల విభాగంలో డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్‌లో పతకాలు గెలిచాడు. తొలుత డెడ్‌లిఫ్ట్‌లో 120 కిలోల బరువెత్తి రజతం సొంతం చేసుకున్న సుధీర్, ఆ తర్వాత బెంచ్‌ప్రెస్‌లో 80 కిలోలతో పసిడి అందుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఫిబ్రవరి 25 నుంచి ఈజిప్టులో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌నకు సుధీర్ అర్హత సాధించాడు.

క్రిష వర్మకు స్వర్ణం

అండర్-19 వరల్డ్ బాక్సింగ్



కొలరాడో (యూఎస్): అండర్-19 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ క్రిష వర్మ స్వర్ణంతో మెరిసింది. మహిళల 75 కిలోల విభాగం ఫైనల్లో క్రిష 5-0తో సైమన్ లెరికా (జర్మనీ)పై గెలిచింది. కాగా, అంజలి (57 కిలోలు), విని (60 కి), ఆకాంక్ష (70 కి), చంచల్ చౌదరి (48 కి), రాహుల్ (పురుషుల 75 కి) ఫైనల్స్‌లో ఓడి రజతాలతో సరిపెట్టుకున్నారు.

ఒకే ఓవర్‌లో 37 పరుగులు

ఊతప్పను ఉతికారేసిన బొపార



హాంకాంగ్: భారత మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప బౌలింగ్‌ను ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ రవి బొపార ఉతికారేశాడు. ఒకే ఓవర్‌లో ఏకంగా 37 పరుగులతో చెలరేగాడు. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య శనివారం జరిగిన హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో ఈ పరుగుల పండుగ చోటుచేసుకుంది. ఊతప్ప వేసిన ఓవర్లో తొలి 5 బంతుల్లో బొపార 5 సిక్సర్లు బాదాడు. ఊతప్ప ఆరో బంతిని వైడ్‌గా వేయడంతో..అదనంగా మరో బంతి లభించింది. దానిని కూడా బొపార సిక్సర్‌గా మలచడంతో..ఓవర్‌లో 37 రన్స్ దక్కాయి. ఈక్రమంలో బొపార 14 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. దాంతో ఇంగ్లండ్ నిర్ణీత 6 ఓవర్లలో 120/1 స్కోరు చేసింది. ఛేదనలో ఊతప్ప కెప్టెన్సీలోని భారత్ 6 ఓవర్లలో 105/3కే పరిమితమై ఓటమిపాలైంది.

ఫైనల్లో మాళవిక

హైలో ఓపెన్



సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ హైలో ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సింగిల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. మాళవిక మహిళల సింగిల్స్‌లో ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో ఆరో సీడ్ మాళవిక 23-21, 21-18తో డెన్మార్క్ షట్లర్ జూలీ దావల్ జాకబ్‌సెన్‌పై విజయం సాధించింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో డెన్మార్క్‌కే చెందిన మియా బ్లిచ్‌ఫెల్ట్‌తో మాళవిక అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ ఆయుష్ శెట్టి పోరాటం సెమీఫైనల్‌కే పరిమితమైంది. అన్‌సీడెడ్ ఆయుష్ 17-21, 13-21తో 4వ సీడ్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

టైటాన్స్ అదుర్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలుగు టైటాన్స్ ఈ సీజన్‌లో మూడో విజయాన్ని సాధించింది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 38-35తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. కెప్టెన్ పవన్ షెహ్రావత్ 14 పాయింట్లతో చెలరేగి టైటాన్స్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-37తో యూపీ యోధాస్‌పై నెగ్గి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది.

పొరపాటు పోస్ట్‌కు రవిశాస్త్రి సారీ!



ముంబై: టీమిండియా మాజీ కోచ్, వ్యాఖ్యాత రవిశాస్త్రి తాను చేసిన పొరపాటుకు బహిరంగ క్షమాపణ చెప్పాడు. అలనాటి భారత క్రికెటర్ నారీ కాంట్రాక్టర్ మరణించాడంటూ రవిశాస్త్రి ఎక్స్‌లో పోస్ట్ చేయడమే దీనికి కారణం. మూడో టెస్ట్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న శాస్త్రి శనివారం ఆట సమయంలో ఈ పొరపాటు ప్రకటన చేశాడు. దాంతో సోషల్‌మీడియాలో క్రికెట్ ఫ్యాన్స్ నుంచి కాంట్రాక్టర్ మృతికి సంతాపాలు వెల్లువెత్తాయి. అయితే తొలుత వచ్చిన వార్త నిజం కాదని, 90 ఏళ్ల కాంట్రాక్టర్ ఆరోగ్యంగానే ఉన్నారన్న వార్త వెలువడింది. వెంటనే తప్పు తెలుసుకున్న రవిశాస్త్రి ఆ పోస్ట్‌ను తొలగించాడు. 'ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. పొరపాటుగా పోస్ట్ చేసినందుకు క్షమించాలి' అని శాస్త్రి కోరాడు.

రెండు రోజుల్లోనే ఎన్ని మలుపులో.. శుక్రవారం ఆట ముగిసేసరికి భారత్‌కు మరో ఓటమి తప్పదా? అనిపించింది. కానీ మర్నాడే అన్ని విభాగాల్లో రాణించి ఏకంగా గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తోంది. పిచ్ ఎలాంటిదైనా డోంట్ కేర్ అనే తరహాలో రెచ్చిపోయిన రిషభ్ పంత్ జట్టు స్కోరును రాకెట్ వేగంతో పెంచగా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ క్లాసిక్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వీరి దెబ్బకు టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడం విశేషం. ఆ తర్వాత స్పిన్నర్ జడేజా మరోసారి ప్రతాపం చూపగా, అశ్విన్ సహకరించడంతో కివీస్ విలవిల్లాడింది. కేవలం 143 రన్స్ ఆధిక్యంలో ఉన్న ప్రత్యర్థి చేతిలో మరో వికెట్ మాత్రమే ఉంది. దీంతో మూడో టెస్టు కూడా మూడు రోజుల్లోనే ముగియడం ఖాయమనిపిస్తోంది.

మ్యాచ్‌ను తిప్పేశారు



భారత్ తొలి ఇన్నింగ్స్ 263

ఆదుకున్న గిల్, పంత్

కివీస్ రెండో ఇన్నింగ్స్ 171/9

జడేజాకు నాలుగు, అశ్విన్‌కు మూడు వికెట్లు



జడేజా (4/52)

ముంబై: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో మొదటిసారి భారత జట్టు ఆధిపత్యం కనబరచింది. తొలి రోజు చివర్లో బ్యాటర్లు తడబాటుకు గురైనా.. శనివారం మాత్రం సూపర్ బ్యాటింగ్, బౌలింగ్‌తో టెస్టును మనవైపు తిప్పేశారు. ముందుగా భారత్‌కు 28 పరుగుల స్వల్ప ఆధిక్యమైనా దక్కిందంటే శుభ్‌మన్ గిల్ (90), రిషభ్ పంత్ (59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 60)ల ఆటతీరే కారణం. వీరి కీలక ఆటతీరుతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. చివర్లో వాషింగ్టన్ సుందర్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) ఆకట్టుకున్నాడు. స్పిన్నర్ ఎజాజ్‌కు 5 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కివీస్‌ను స్పిన్నర్లు జడేజా (4/52), అశ్విన్ (3/63) దెబ్బతీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి పర్యాటక జట్టు 43.3 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులే చేయగలిగింది. విల్ యంగ్ (51) అర్ధసెంచరీ చేశాడు. క్రీజులో ఎజాజ్ (7) ఉన్నాడు. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ఆధిక్యంలో ఉంది. బంతి చక్కగా టర్న్ అవుతున్నందున కివీస్‌ను తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలి. లక్ష్యం 200లోపే ఉండడం భారత్‌కు శ్రేయస్కరం. ఓవరాల్‌గా శనివారం 15 వికెట్లు నేలకూలాయి.

అటు దూకుడు.. ఇటు నిలకడ: ఓవర్‌నైట్ స్కోరు 86/4తో పీకల్లోతు కష్టాల్లో పడిన భారత జట్టు.. భారమంతా గిల్, పంత్‌పై వేస్తూ రెండో రోజును ఆరంభించింది. మరో రెండు వికెట్లు కోల్పోతే మ్యాచ్ పూర్తిగా ప్రత్యర్థి చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉండేది. అయితే సీనియర్లకు బ్యాటింగ్ కష్టమైన టర్నింగ్ పిచ్‌పై గిల్, పంత్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా పంత్ చావోరేవో అన్నట్టుగా బ్యాట్ ఝుళిపించాడు. భారీషాట్లతో కివీస్ బౌలర్లను డిఫెన్స్‌లో పడేశాడు. రోహిత్, విరాట్ సైతం దూకుడుగా ఆడేందుకు ఇబ్బందిపడినా పంత్ మాత్రం సహజశైలిలో ఎదురుదాడికి దిగాడు. తొలి రెండు బంతులను బౌండరీలకు తరలించి తన ఉద్దేశాన్ని చాటాడు. బంతి టర్న్ కావడంతో పాటు ఒక్కోసారి అనూహ్యంగా బౌన్స్ అవుతున్నా తగ్గేదేలే.. అనే రీతిలో 8 ఫోర్లతో పాటు రెండు సిక్సర్లు బాదాడు. దీంతో పంత్ 36 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ సాధికారిక ఆటతీరు కూడా పంత్ వేగంగా ఆడేందుకు తోడ్పడింది. ఐదు వికెట్లతో దెబ్బతీసిన ఎజాజ్‌ను సైతం అతను వదల్లేదు. లంచ్‌కు కాస్త ముందు ఐదో వికెట్‌కు గిల్‌తో కలిసి 96 పరుగులు జోడించాక స్పిన్నర్ సోధి ఓవర్‌లో పంత్ వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. వరుస ఓవర్లలో జడేజా (14), సర్ఫరాజ్ (0) పెవిలియన్‌కు చేరగా.. సెంచరీకి చేరువలో గిల్ ఎనిమిదో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ స్థితిలో సుందర్ కివీస్ స్కోరును సమం చేయడంతో పాటు సోధి ఓవర్‌లో 4,6తో జట్టుకు ఆధిక్యాన్ని కూడా అందించాడు. అయితే 60వ ఓవర్‌లో ఆకాశ్‌దీప్ (0) రనౌట్ కావడంతో భారత్ 83 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది.

దెబ్బతీసిన స్పిన్ జోడీ: భారత స్పిన్నర్లు జడేజా, అశ్విన్ కలిసికట్టుగా కివీస్‌ను కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో చెలరేగిన జడేజా కివీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ మెరవగా, అశ్విన్ ఈసారి మూడు వికెట్లతో ఖాతా తెరిచాడు. మొత్తంగా ఈ ఇద్దరూ కలిసి ఏడు వికెట్లు తీశారు. మరోవైపు తొలి ఓవర్‌లోనే పేసర్ ఆకాశ్ అద్భుత ఇన్‌స్వింగర్‌తో ఓపెనర్ లాథమ్ (1)ను బౌల్డ్ చేశాడు. కాన్వే (22) కుదురుకున్నట్టు కనిపించినా సుందర్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే రచిన్ రవీంద్ర (4)ను అశ్విన్ అవుట్ చేసి ఈ టెస్టులో తొలి వికెట్ సాధించాడు. ఈ దశలో కివీస్‌ను యంగ్, మిచెల్ (21) కాసేపు ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించాక మిచెల్‌ను అవుట్ చేసిన జడేజా తిరిగి తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. బ్లండెల్ (4), సోధి (8), హెన్రీ (10)లను అవుట్ చేసి కివీస్‌ను వణికించాడు. అటు కీలక ఇన్నింగ్స్ ఆడిన యంగ్ ఎనిమిదో వికెట్‌గా అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఉన్న కాసేపు ఫిలిప్స్ (14 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 26) వేగంగా ఆడాడు.

3 తాజా డబ్ల్యూటీసీలో ఎక్కువ వికెట్లు (50) తీసిన మూడో బౌలర్‌గా జడేజా. ఓవరాల్‌గా అశ్విన్ (62), హాజెల్‌వుడ్ (51) టాప్-2లో ఉన్నారు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఎజాజ్ 30; రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18; గిల్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 90; సిరాజ్ (ఎల్బీ) ఎజాజ్ 0; విరాట్ (రనౌట్) 4; పంత్ (ఎల్బీ) సోధీ 60; జడేజా (సి) విచెల్ (బి) ఫిలిప్స్ 14; సర్ఫరాజ్ (సి) బ్లండెల్ (బి) ఎజాజ్ 0; సుందర్ (నాటౌట్) 38; అశ్విన్ (సి) విచెల్ (బి) ఎజాజ్ 6; ఆకాశ్ దీప్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 59.4 ఓవర్లలో 263 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-25, 2-78, 3-78, 4-84, 5-180, 6-203, 7-204, 8-227, 9-247, 10-263. **బౌలింగ్:** హెన్రీ 8-1-26-1; ఓరోర్క్ 2-1-5-0; ఎజాజ్ 21.4-3-103-5; ఫిలిప్స్ 20-0-84-1; రచిన్ 1-0-8-0; సోధీ 7-0-36-1.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బి) ఆకాశ్ 1; కాన్వే (సి) గిల్ (బి) సుందర్ 22; యంగ్ (సి అండ్ బి) అశ్విన్ 51; రచిన్ (స్టంప్) పంత్ (బి) అశ్విన్ 4; మిచెల్ (సి) అశ్విన్ (బి) జడేజా 21; బ్లండెల్ (బి) జడేజా 4; ఫిలిప్స్ (బి) అశ్విన్ 26; సోధి (సి) కోహ్లీ (బి) జడేజా 8; హెన్రీ (బి) జడేజా 10; ఎజాజ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 43.3 ఓవర్లలో 171/9; వికెట్ల పతనం:** 1-2, 2-39, 3-44, 4-94, 5-100, 6-131, 7-148, 8-150, 9-171; **బౌలింగ్:** ఆకాశ్ 5-0-10-1; సుందర్ 10-0-30-1; అశ్విన్ 16-0-63-3; జడేజా 12.3-2-52-4.

8వ నెంబర్‌లో ఎందుకు?



సర్ఫరాజ్

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దించడం చర్చనీయాంశమైంది. అద్భుత ఫామ్‌లో ఉన్న అతడిపై టీమ్ మేనేజ్‌మెంట్ సరైన నిర్ణయం తీసుకోలేదని వ్యాఖ్యాత మంజ్రేకర్ తప్పుపట్టాడు. 'కెరీర్ తొలి మూడు టెస్టుల్లోనూ అర్ధసెంచరీలు సాధించడంతో పాటు బెంగళూరు టెస్టులో 150 రన్స్ సాధించాడు. స్పిన్‌నూ మెరుగ్గా ఆడగలడు. కేవలం కుడి-ఎడమ కాంబినేషన్ కోసం సర్ఫరాజ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందికి దించడంలో అర్థముందా?' అని ఎక్స్‌లో ప్రశ్నించాడు. ఈస్థానంలో సర్ఫరాజ్ నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్‌గా వెనుదిరిగాడు. వాంఖడేలో ఆడిన చివరి ఆరు దేశవాళీ ఇన్నింగ్స్‌లో ఈ ముంబైకర్ ఓ ట్రిపుల్ శతకం సహా 601 రన్స్ చేయడం విశేషం.

వావ్.. అశ్విన్



కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లతో రాణించిన స్పిన్నర్ అశ్విన్ ఫీల్డింగ్‌లోనూ మెరిశాడు. విచెల్, యంగ్ భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో అతడి అద్భుత క్యాచ్ కివీస్‌ను దెబ్బతీసేలా చేసింది. జడేజా ఓవర్‌లో మిచెల్ ఆడిన భారీ షాట్ గాల్లోకి లేవగా.. మిడాన్ నుంచి వెనక్కి పరిగెడుతూ 38 ఏళ్ల అశ్విన్ పట్టిన ఆ డైవింగ్ క్యాచ్ అదుర్స్ అనిపించింది. మరోవైపు దీన్ని అతడి కెరీర్‌లోనే గ్రేటెస్ట్ క్యాచ్‌గా నెటిజన్లు కొనియాడారు.

2 వాంఖడేలో ఎక్కువ వికెట్లు (19) తీసిన రెండో పర్యాటక జట్టు బౌలర్ ఎజాజ్ పటేల్. ఇయాన్ బోథమ్ (22) ముందున్నాడు.



కొత్త సంవత్‌లోనూ గోల్డ్ జిగేల్!

ఇన్వెస్టర్లకు మళ్లీ రెండంకెల్లో రిటర్నులు!! ● 2025లో ఔన్సు 3,000 డాలర్లకు...

సంవత్ 2081పై విశ్లేషకుల అంచనా

న్యూఢిల్లీ: శుక్రవారంతో ప్రారంభమైన హిందూ సంప్రదాయ సంవత్సరం 'సంవత్ 2081'లోనూ బంగారం ఇదే ర్యాలీని కొనసాగిస్తుందా...అన్న ప్రశ్నకు అవుననే అంటున్నారు బులియన్ మార్కెట్ విశ్లేషకులు. ఈ సంవత్‌లోనూ బంగారం పెట్టుబడులు ఇన్వెస్టర్లకు రెండంకెల్లో రాబడులు అందించవచ్చునని కేడియా క్యాపిటల్ డైరెక్టర్ అజయ్ కేడియా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం 2,750 డాలర్ల స్థాయిలో ట్రేడవుతున్న ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 2025లో 3,000 డాలర్ల స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేశారు. 'సవంత్ 2080' సంవత్సరంలో ఇన్వెస్టర్లకు బంగారం 32 శాతం, వెండి 39 శాతం రాబడులు అందించాయి. గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో (ఈటీఎఫ్) ఇన్వెస్ట్ చేసిన వారికి కూడా 30 శాతం వరకు రాబడి వచ్చింది. ఈ జూలైలో కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకం 9 శాతం తగ్గించడంతో మార్కెట్లో ధరలు 9 శాతం తగ్గినప్పటికీ, ఏడాది కాలంలో లోహం విలువ మూడో వంతు మేర పెరగడం గమనార్హం. సంవత్ 2067 (2011 తర్వాత) పసిడి ఇన్వెస్టర్లకిదే అత్యధిక రిటర్న్. కాగా, గత సంవత్‌లో సెన్సెక్స్ 25 శాతం, నిఫ్టీ 27 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేయగలిగాయి.

ఆ రెండు పరిణామాలతోనే బూస్ట్

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం బంగారం ర్యాలీకి ఆజ్యం పోశాయి. ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో సద్దుమణిగేలా కన్పించడం లేదు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కూడా ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు మున్ముందు పరపతి సమీక్షల్లో ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశాలున్నాయి. ఈ రెండు కారణాలతో పసిడి, వెండి ధరలు మరింత జోరుగా పరుగులు తీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎలాంటి అనిశ్చితి లేదా సంక్షోభ సమయంలో అయినా భద్రమైన పెట్టుబడి సాధనంగా బంగారం నిలవడమే ఇందుకు దోహదపడుతున్న అంశం. పైగా, పసిడి-వడ్డీ రేట్లది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిరాదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి. కాగా, చైనా ఆర్థిక, పారిశ్రామిక మందగనం నుంచి బయటపడేందుకు భారీగా ఉద్దీపనలు ప్రకటించింది. దాంతో ఆ దేశ పారిశ్రామికోత్పత్తి అవసరాలకు వెండి వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని, ఫలితంగా రేటు కూడా పుంజుకోవచ్చన్న అంచనాలున్నాయి.

రూ.1.14 లక్షల కోట్లు వెనక్కి

- అక్టోబరులో ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణ
- మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకిదే అత్యధికం..

ముంబై: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత నెలలో స్టాక్ మార్కెట్ నుంచి 1,350 కోట్ల డాలర్ల (రూ.1,13,859 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇప్పటివరకు ఒక నెల రోజుల వ్యవధిలో సెకండరీ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న అత్యధిక నిధుల రికార్డు ఇదే. అయితే, ఈ అక్టోబరులో ఎఫ్‌పీఐలు ప్రైమరీ మార్కెట్లో మాత్రం రూ.19,842 కోట్ల పెట్టుబడులు పెట్టారు. దీన్ని మినహాయిస్తే, దేశీయ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐల నికర పెట్టుబడుల ఉపసంహరణ రూ.94,017 కోట్లుగా నమోదైంది. కొవిడ్ సంక్షోభ కాలంలో (2020 మార్చి) వెనక్కి తీసుకున్న రూ.61,973 కోట్ల నికర పెట్టుబడుల కన్నా కూడా ఇది అధికం. ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల కారణంగా గతనెలలో ఈక్విటీ సూచీలు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయిల నుంచి 8 శాతం మేర క్షీణించాయి.

- అక్టోబరులో ఎఫ్‌పీఐ నిధుల ఉపసంహరణ లోటును దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) భర్తీ చేశారు. క్యాష్ మార్కెట్లో డీఐఐలు రూ.98,400 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు.
- అక్టోబరు 31తో ముగిసిన 'సంవత్ 2080'లో డీఐఐలు క్యాష్ మార్కెట్లో ఏకంగా రూ.4.64 లక్షల కోట్ల పెట్టుబడులు గుమ్మరించారు. ఈ జనవరి, ఏప్రిల్, మే, అక్టోబరులో ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల కారణంగా ఏర్పడిన నష్టాలను డీఐఐల పెట్టుబడులు పూడ్చగలిగాయి.
- ఈ జనవరి-సెప్టెంబరు మధ్యకాలానికి నికర పెట్టుబడులు రూ.లక్ష కోట్ల స్థాయిలో ఉన్నాయి. అక్టోబరులో ఏకంగా రూ.1.14 లక్షల కోట్లు వెనక్కి తీసుకోవడంతో గడిచిన 10 నెలల కాలానికి వారి నికర పెట్టుబడులు గణనీయంగా తగ్గి రూ.6,593 కోట్లకు పరిమితమయ్యాయి.

అధిక రాబడులపై ఆశతోనే...

ఎఫ్‌పీఐలు తాము వెనక్కి తీసుకున్న పెట్టుబడులను అమెరికన్ బాండ్ మార్కెట్లోకి, చైనా స్టాక్ మార్కెట్లోకి తరలించారు. అమెరికా



డాలర్ విలువతో పాటు బాండ్ల రిటర్నుల రేటు గణనీయంగా పెరగడం, చైనా ఈక్విటీలు ఆకర్షణీయ ధరకు లభిస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. దేశీయ మార్కెట్ సూచీలతో పాటు అనేక కంపెనీల షేర్లు ఆల్‌టైం గరిష్ఠాల వద్ద ట్రేడవుతుండటం, రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశాజనకంగా ఉండడంతో ఎఫ్‌పీఐలు పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారని విశ్లేషకులు పేర్కొన్నారు.

తాత్కాలిక పరిణామమే.. : ఎఫ్‌పీఐల పెట్టుబడుల ఉపసంహరణ తాత్కాలికమేనని మార్కెట్ నిపుణులన్నారు. భారత ఈక్విటీల్లో ఎఫ్‌పీఐలు మొత్తం 80,000 కోట్ల డాలర్ల (రూ.67.20 లక్షల కోట్లు) పెట్టుబడులను కలిగి ఉన్నారని.. గతనెలలో వెనక్కి తీసుకున్నది కేవలం 1.7 శాతమేనని వారు చెప్పారు. కాబట్టి, ఈ విషయంపై చిన్న ఇన్వెస్టర్లు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతేకాదు, స్టాక్ మార్కెట్ మొత్తం సంపదలో కేవలం 0.1 లేదా 0.2 శాతమేనని వారన్నారు. చాలా వరకు దేశీయ కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్న నేపథ్యంలో మార్కెట్ సూచీలు భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే, ప్రస్తుతం ఈ మాత్రం దిద్దుబాటు ఆవశ్యకమేనని వారు అభిప్రాయపడ్డారు. కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నేపథ్యంలో ఎఫ్‌పీఐల అమ్మకాలు మరికొంత కాలం కొనసాగవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అన్నారు. అయితే, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెరుగైతే మన మార్కెట్లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడులు మళ్లీ పుంజుకోవచ్చని అబాకస్ అసెట్ మేనేజ్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ వ్యవస్థాపకులు సునీల్ సింఘానియా ఆశాభావం వ్యక్తం చేశారు.

వచ్చే బుధవారం స్విగ్గీ ఐపీఓ



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ఇటీవల కాలంలో తీవ్ర ఆటుపోట్లు, భారీ నష్టాల్లో ట్రేడవుతున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగుతోంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 127 పబ్లిక్ ఇష్యూలు జారీ కావడమే ఇందుకు తార్కాణం. వచ్చే వారంలోనూ అదే జోరు కొనసాగనుంది. సోమవారం ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ షేర్లను లిస్టింగ్ చేయనుంది. కాగా ఫుడ్ డెలివరీ విభాగంలోని స్విగ్గీ, సెజిలిటీ ఇండియా, ఆక్మే సోలార్ పబ్లిక్ ఇష్యూలతో మార్కెట్ తలుపులు తట్టనున్నాయి. వీటితో పాటు గా ఎస్ఎంఈ విభాగంలో నీలం లినెన్స్ అండ్ గార్మెంట్స్ కంపెనీ వచ్చే శుక్రవారం పబ్లిక్ ఇష్యూ జారీ చేయనుంది.

స్విగ్గీ: ఆన్‌లైన్‌లో ఆహార ఆర్డర్ల ఆధారంగా రెస్టారెంట్ల నుంచి కస్టమర్లకు రుచికరమైన ఆహారాన్ని వారింటికే చేరవేసే స్విగ్గీ రూ.11,327.43 కోట్ల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందులో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో రూ.1 ముఖవిలువ గల 17,50,87,863 ఈక్విటీ షేర్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం 11,53,58,974 తాజా ఈక్విటీ షేర్లను ప్రైమరీ మార్కెట్లో విడుదల చేస్తోంది. ధరల శ్రేణి రూ.371-390 కాగా ఒక్కో లాట్‌లో 38 షేర్లుంటాయి. అంటే కనీస పెట్టుబడి రూ.14,820 అవుతుంది. రిటైల్ ఇన్వెస్టర్లకు ఇష్యూ బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది. వచ్చే సోమవారం నాటికి షేర్ల కేటాయింపు పూర్తి చేసి నవంబరు 13వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేసే ఆస్కారం ఉంది.

సెజిలిటీ ఇండియా: పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఇష్యూకి వస్తున్న ఈ కంపెనీ రూ.2,106.60 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఒక్కోటి రూ.10 ముఖవిలువ గల 70,21,99,262 ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఇన్వెస్టర్లు కనీసం 500 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్ చేయడానికి కనీస మొత్తం రూ.15,000. రూ.28-30 ధరల శ్రేణిలో ఒక్కో లాట్ 157 షేర్లుంటాయి. ఇష్యూ మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది. శుక్రవారం నాటికి షేర్ల కేటాయింపు పూర్తి చేస్తారు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో ఈ షేర్లను 12వతేదీన లిస్టింగ్ చేస్తారు.

ఆక్మే సోలార్ హోల్డింగ్స్ : రూ.2,900 కోట్ల విలువ గల ఈ ఇష్యూ బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.275-289గా నిర్ణయించారు. ఒక్కో లాట్‌లో 51 షేర్లుంటాయి. అంటే కనీస పెట్టుబడి రూ.14,739. షేర్ల కేటాయింపు 11వ తేదీ నాటికి పూర్తి చేసి 13న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేయనున్నారు.

బిజినెస్

నాలుగేళ్లలో రూ.6,100 కోట్ల పెట్టుబడి

11 ప్రాంతాల్లో అపోలో ఆస్పత్రులు

ముంబై: అపోలో హాస్పిటల్స్ ముంబైలోని వోర్లి, చెన్నైలోని పాత మహాబలిపురం రోడ్డు ప్రాంతాల్లో రెండు భారీ ఆస్పత్రులు ఏర్పాటు చేయనుంది. ముంబై ఆస్పత్రి 575 పడకలు, చెన్నై ఆస్పత్రి 600 పడకలు కలిగి ఉంటాయి. రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో దేశంలోని 11 ప్రాంతాల్లో రూ.6,100 కోట్ల పెట్టుబడితో ఆస్పత్రులు ఏర్పాటు చేయడం ద్వారా నూతనంగా 3,512 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు సంస్థ ప్రకటించింది. వోర్లిలో ఆస్పత్రి ఏర్పాటుకు శనివారం కంపెనీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇవి కాక వారణాసి (400 పడకలు), లక్నో (200), పూణెలోని రాయల్ ముధోల్ (400), కోల్కతాలోని సోనార్‌పూర్ (270), హైదరాబాద్‌లోని గచ్చిబౌలి (375), ఎన్‌సీఆర్‌లోని గురుగ్రామ్ (510), మైసూర్‌లోని మల్లేశ్వరం (140), ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ (42) ప్రాంతాల్లో అపో లో ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయి. ముంబై ఆస్పత్రి ని నాలుగు సంవత్సరాల్లో ప్రారంభించాలని భావిస్తున్నామని సంస్థ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

ఏసీఐ కొత్త ప్రెసిడెంట్‌గా కిశోర్

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, ఎస్‌జీకే కిశోర్ ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) ఆసియా పసిఫిక్, పశ్చిమాసియా విభాగం ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన ఆయన పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన ఆ పదవిలో రెండు సంవత్సరాల కాలం కొనసాగుతారు. విమానయాన పరిశ్రమ తదుపరి వృద్ధి పథంలోకి అడుగు పెడుతున్న ఈ వాతావరణంలో విమానాశ్రయాల ఆర్థిక, పర్యావరణ సుస్థిరతకు, ఇన్నోవేషన్‌కు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా కిశోర్ చెప్పారు. కిశోర్‌ను ప్రస్తుత ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయెల్ మెనాంటూ అభినందించారు. 47 సభ్యదేశాలకు చెందిన 600 విమానాశ్రయాలు ఏసీఐ ఏపీఏసీ అండ్ ఎంఐడీ పరిధిలోకి వస్తాయి. 2042 నాటికి ఈ ప్రాంతాల నుంచి విమాన ప్రయాణికుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 340 కోట్ల నుంచి 970 కోట్లకు చేరుతుందని అంచనా.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	123
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	109	అనంతపురం	115
గోదావరి	123		



జార్ఖండ్ రాష్ట్రం రాంగఢ్ నియోజకవర్గంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కాంగ్రెస్ కూటమి గెలుపుతోనే రాజ్యాంగ పరిరక్షణ

» ఝార్ఖండ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఝార్ఖండ్ రాష్ట్రంతో పాటుగా దేశంలో రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపు అనివార్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఝార్ఖండ్ ఎన్నికలకుగాను ఏఐసీసీ పరిశీలకుని హోదాలో ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న భట్టి విక్రమార్క.. శనివారంనాడు రాంఘడ్ నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరుచుకున్న లక్ష్యాలు అందరికీ అందుబాటులోకి రావాలంటే కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని సూచించారు. ఇంటింటి ప్రచారం, బూత్ స్థాయి సమావేశాల ఏర్పాటు, సోషల్ మీడియాలో ప్రచారం వంటి అంశాలపై స్థానిక బ్లాక్ కాంగ్రెస్ నేతలకు తగు సూచనలు చేశారు.

కేటీఆర్‌కు కుక్క కూడా ఓటేయదు: అర్వింద్

జగిత్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ కొడుకు కేటీఆర్‌కు కుక్క కూడా ఓటు వేయదని, ఆయన తెలంగాణ మొత్తం పాదయాత్ర చేసినా ఫలితం ఉండదని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ అనుసరించిన దుర్మార్గపు విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇక బీజేపీనే ప్రత్యామ్నాయమని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని పేర్కొన్నారు. జగిత్యాలలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి నేచురల్ డెత్ అన్నట్లుగా ఉందని, పది నెలల్లో ఇంత వ్యతిరేకత మూటగట్టుకోవడం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కనీసం సమీక్షలు నిర్వహించని సీఎం రేవంత్‌రెడ్డిని.. ప్రజలందరూ తిడుతున్నారని వ్యాఖ్యానించారు.

మూసీ ప్రక్షాళన వ్యతిరేకులు హైదరాబాద్ ద్రోహులే

» ఒక దేశం-ఒకే ఎన్నిక దేశానికి మంచిది కాదు: నారాయణ

న్యూఢిల్లీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తే హైదరాబాద్‌కు ద్రోహం చేయడమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మూసీ ప్రక్షాళన అంశంపై పోటాపోటీగా పోరాటాలు చేస్తోన్న బీఆర్ఎస్, బీజేపీ.. ప్రజాసమస్యలను రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలోని అజోయ్ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిరంగి నాలా ఖాళీ చేసి మూసీ నది ప్రక్షాళన చేయాలని సీపీఐ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని తెలిపారు. మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపే అంశంలో ప్రభుత్వంతో మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

జగన్ కేసుల్లో జాప్యం వల్లే షర్మిలతో పంచాయితీ

వైఎస్ జగన్ 11 ఏళ్లుగా బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, ఓ వ్యక్తి ఇన్నేళ్లు బెయిల్ మీద ఉండడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జగన్ అక్రమాస్తుల కేసు 11 ఏళ్లుగా తేలకపోవడం వల్లే జగన్, షర్మిల మధ్య ఆస్తుల పంచాయితీ వచ్చిందని తెలిపారు. జగన్ విషయంలో దర్యాప్తు సంస్థలు ఇంకెంతకాలం కాలయాపన చేస్తాయని ప్రశ్నించారు.

వచ్చే ఐదేళ్లూ రేవంత్‌రెడ్డే సీఎం : మల్లు రవి

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ దఫానే కాకుండా.. వచ్చే ఐదేళ్లూ సీఎంగా రేవంత్‌రెడ్డే కొనసాగుతారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. పదేళ్ల పాటు ఆయనే సీఎంగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే జూన్ కల్లా రాష్ట్రానికి కొత్త సీఎం వస్తారంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మహేశ్వర్ రెడ్డి... పూర్తిగా మతి లేని రెడ్డిలాగా మారిపోయాడన్నారు.

కేరళకు సీఎం, మంత్రులు

ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణన్ కుమార్తె వివాహ రిసెప్షన్‌లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ శనివారం కేరళకు వెళ్లారు. వారితో పాటుగా మంత్రులు ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి తదితరులూ వెళ్లారు. రిసెప్షన్ అయిపోయిన అనంతరం రాత్రి తిరిగి వారు హైదరాబాద్‌కు చేరుకున్నారు. శ్రీనివాస్ కృష్ణన్.. ఎన్నికల సమయంలో పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శిగా పని చేశారు.

రైతులపై థర్డ్ డిగ్రీ దారుణం: ఎమ్మెల్యే హరీశ్‌బాబు

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను చంపారన్న ఆరోపణలతో ఏడుగురు రైతులపై కాగజ్‌నగర్ అటవీశాఖ డివిజన్ కార్యాలయం అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు విమర్శించారు. రైతుల కళ్లకు గంతలు కట్టి రేంజర్, సెక్షన్ ఆఫీసర్లు 48 గంటల పాటు చిత్రహింసలు పెట్టారని ఆరోపించారు. రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అధికారం ఎవరిచ్చారని అటవీశాఖ అధికారులను నిలదీశారు. ప్రశ్నించేందుకు అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లిన 13 మంది స్థానిక నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని ఆరోపించారు. డీఎఫ్‌వో, సిర్పూర్ రేంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్లను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతానని హరీశ్ హెచ్చరించారు.

విద్యార్థుల బదిలీలు ఇకపై సో ఈజీ!

» ఎన్ఐటీ, ఐఐటీ నుంచీ జేఎన్టీయూ, ఓయూ కాలేజీలకు కూడా

» రాష్ట్ర వర్సిటీల మధ్య బదిలీలకూ సర్కారు గ్రీన్ సిగ్నల్.!

హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి జాతీయ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు తమ చదువు మధ్యలో రాష్ట్ర విద్యా సంస్థల్లో చేరేందుకు వీలుకల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చేసిన ప్రతిపాదనలకు ఉన్నత విద్యాశాఖ అంగీకారం తెలిపింది. జాతీయ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలకు చెందిన విద్యార్థులకు కూడా ఈ సదుపాయాన్ని వర్తింపజేయాలని భావిస్తోంది. ఈ మేరకు మార్గదర్శకాలను రూపొందించాలని ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూ రిజిస్ట్రార్లకు సాంకేతిక విద్యా కమిషనర్ తాజాగా లేఖ రాశారు. ఉన్నత విద్యాశాఖ అధికారులతో పాటు సాంకేతిక విద్యా కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలో మార్గదర్శకాల రూపకల్పన ఆయా యూనివర్సిటీల్లో శరవేగంగా జరుగుతోంది. వాస్తవానికి రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యార్థుల బదిలీల ప్రక్రియ 2022 నుంచే అమల్లో ఉంది. తల్లిదండ్రుల ఉద్యోగ బదిలీలు, విద్యార్థుల ఆరోగ్య కారణాలతో ప్రస్తుతం తాము చదువుతున్న కళాశాల నుంచి తమ నివాసానికి సమీపంలో ఉండే వేరొక కళాశాలకు మారేందుకు వీలు కల్పిస్తూ ఉన్నత విద్యాశాఖ జీవో 32ను 2022 ఆగస్టు 22న జారీచేసింది. ఈ వెసులుబాటు కేంద్ర విద్యా సంస్థల్లో నాలుగేళ్ల బీటెక్ చదువుతూ.. వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన విద్యార్థులకు వర్తించడం లేదు. అంతేకాదు, ప్రైవేటు కళాశాలలకు మాత్రమే బదిలీల విధానాన్ని వర్తింపజేస్తున్న వర్సిటీల అధికారులు ప్రభుత్వ కాలేజీలకు అమలు చేయడం లేదు. ఒక ప్రభుత్వ వర్సిటీ పరిధిలోని అఫిలియేటెడ్ కళాశాల నుంచి వేరొక ప్రభుత్వ వర్సిటీ పరిధిలోని గుర్తింపు పొందిన కళాశాలలకు కూడా వర్తింపజేయడం లేదు. దీంతో ఎక్కువమంది విద్యార్థులకు మేలు చేకూర్చాలన్న ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదు.. ఈ క్రమంలో గతంలో జారీచేసిన జీవో నంబరు 32ను సవరించేందుకు అవసరమైన మార్గదర్శకాలను యూనివర్సిటీల నుంచి తీసుకుంటోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త మార్గదర్శకాలు అమలయ్యేలా సవరణ ఉత్తర్వులను ప్రభుత్వం త్వరలోనే జారీచేసే అవకాశం ఉందని ఉన్నత విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

హెచ్ఎండీఏ పరిధి పంచాయతీల్లో

లే అవుట్ల రిజిస్ట్రేషన్ల బంద్ మూర్ఖపు చర్య

» హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టింది చాలదా?: కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో లే అవుట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం రాష్ట్ర ప్రభుత్వ మూర్ఖపు చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల గురించి ఆలోచించకుండా ఇలాంటి పిచ్చి నిర్ణయాలు తీసుకోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. పరిపాలనా అనుభవం లేకుండా తుగ్లక్‌ను తలపించేలా సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్ శనివారం ప్రకటన విడుదల చేశారు. మొన్నటి వరకు హైడ్రా, మూసీ పేరుతో పేదల గూడు కూల్చేసిన రేవంత్ రెడ్డి... తాజాగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పేదలు, మధ్య తరగతిని టార్గెట్ చేశారన్నారు. వారి ప్లాట్లపై కూడా ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బిల్డర్లను బెదిరిస్తూ ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని పంచాయతీ లేఅవుట్లలో వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుక్కోవటం ప్రజల తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇదే మాట చెప్పి ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆ ప్లాట్లు ఎంతోమంది చేతులు మారాయన్నారు. భవిష్యత్తు కోసం పైసా పైసా కూడబెట్టుకొని పేదలు కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇప్పుడు చెల్లవని ప్రభుత్వం అంటే వారి పరిస్థితి ఏం కావాలో చెప్పాలన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. కొత్త సమస్యలను సృష్టిస్తోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే గ్రామ పంచాయతీల్లో వేలాదిగా లే అవుట్లు వెలిశాయని, వాటి క్రయ విక్రయాలు జరిగి ఎంతోమంది చేతులు మారాయన్నారు. ఇప్పుడు వాటికి ఎవర్ని బాధ్యులు చేస్తారని ప్రశ్నించారు.

100 రోజులన్నారు.. 300 రోజులైంది

(మొదటిపేజీ తరువాయి)



వాపోయారు. ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్న నియామక పత్రాలను ఇచ్చి అయా నియామకాలు తామే చేసినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇప్పటిదాకా కనీసం పది శాతం ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని పేర్కొన్నారు. 2023 డిసెంబరు 9 నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా.. అర్హులైన రైతుల్లో సగం కంటే ఎక్కువ మంది ఇంకా మాఫీ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొంది అన్నారు. పెన్షన్, మహిళలకు ఆర్థిక సాయం, విద్యా భరోసా, పంట బోనస్, కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు తులం బంగారం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ వాహనాలు వంటి ఏ ఒక్క హామీని ప్రభుత్వం ఇప్పటిదాకా నెరవేర్చలేదని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలు నెరవేరుస్తామని ప్రకటించారని, ప్రభుత్వ ఏర్పాటై 300 రోజులు కావొస్తున్న హామీలు నెరవేర్చలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో వాస్తవాలు ఇలా ఉంటే.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ మాత్రం తమ వైఫల్యాలను విజయాలుగా చూపించేందుకు విఫలయత్నం చేస్తూ దేశ ప్రజలను మభ్యపెట్టడం సిగ్గుచేటని హరీశ్‌రావు పేర్కొన్నారు.

సంక్రాంతిలోపు కొత్త సర్పంచ్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 6 నుంచి మొదలు పెడతామని, మొదటివిడత కింద సొంత స్థలం ఉన్నవారికి, రెండో విడతలో స్థలం లేనివారికి స్థలమిచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే వెంటనే ఇస్తామని, లేదంటే వేరేచోట స్థలం కొనుగోలు చేసైనా 75 గజాల చొప్పున స్థలం ఇస్తామన్నారు. 6వ తేదీ నుంచి లబ్ధిదారులను గుర్తించి, 15-20వ తేదీల్లోపు జాబితాను ఖరారు చేసి, ఆ తర్వాత ఇళ్ల మంజూరు ప్రక్రియను చేపడతామని తెలిపారు. నియోజకవర్గానికి 3,500-4,000 ఇళ్లను అందించే అవకాశం ఉందని, గ్రామసభలు నిర్వహించి, ఇందిరమ్మ కమిటీల ఎంపిక మేరకు లబ్ధిదారులను ఖరారు చేయనున్నట్టు పేర్కొన్నారు. రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని నాలుగు దశల్లో అందిస్తామని, పునాది దశలో రూ.లక్ష, ఆ తర్వాత రూ.1.25 లక్షలు, స్లాబ్ దశలో రూ.1.75 లక్షలు, పూర్తయ్యాక రూ.లక్ష అందజేస్తామని పొంగులేటి వివరించారు. ఇందిరమ్మ ఇంటి పథకాన్ని మహిళ పేరు మీదే మంజూరు చేయనున్నామని, ఒకవేళ మహిళ లేకపోతే ఇంటిపెద్దగా ఉన్న వ్యక్తి పేరు మీద ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఒక్కో ఇల్లు 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తక్కువ లేకుండా కిచెన్, బాత్రూమ్ ఉండేలా నిర్మించుకోవాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ఎవరైనా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించుకోవాలన్నా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంటు, ఇనుమును తక్కువ ధరకు అందించే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి.. కంపెనీలతోనూ చర్చించి, ఒక నిర్ణయం తీసుకుంటామని పొంగులేటి వెల్లడించారు.



ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారుల వివరాలు

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పర్యవేక్షించేందుకుగాను ఒక యాప్‌ను రూపొందించామని, అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి వివరాలను ఆ యాప్‌లో పొందుపరుస్తారని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)తో అనుసంధానించనున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేసిన వివరాలను కేంద్రం తాలూకు యాప్‌లకు కూడా బదిలీ చేస్తామన్నారు. కేంద్రం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.1.75 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలను అందిస్తోందని, మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలియజేశారు. మళ్లీ తమ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేది ఇందిరమ్మ ఇళ్ల పథకమేనని భరోసా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'గృహలక్ష్మి' పథకం కింద అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు.

పథకం అమలుకు 16 శాఖల ఇంజినీర్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థను బలోపేతం చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. పథకం పర్యవేక్షణకు మండల స్థాయిలో ఏఈ, నియోజకవర్గ స్థాయిలో డీఈ, జిల్లా స్థాయిలో ఎస్ఈ ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. గృహ నిర్మాణశాఖలో సరిపోయినంత మంది ఇంజినీర్లు లేరని, అందువల్ల, దాదాపు 16 ప్రభుత్వ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఆయా శాఖల్లోని ఇంజినీర్లను ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పర్యవేక్షించేందుకు నియమించనున్నట్టు వెల్లడించారు.

రాష్ట్ర పండుగగా సదర్ సమ్మేళన్

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నిర్వహించే సదర్ సమ్మేళన్‌ను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి ప్రతి యేటా సదర్ సమ్మేళన్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు సూచించింది. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ సదర్ సమ్మేళన్ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. దీపావళి పండుగ తర్వాత రోజున పశుపాలకులు దున్నపోతులను అలంకరించి ఆడుతూ-పాడుతూ సదర్ సమ్మేళన్ నిర్వహించడం తెలంగాణలో సంప్రదాయంగా వస్తోంది.

పత్తి కొనుగోలు కేంద్రాలు

ప్రారంభించండి

» సీసీఐ అధికారులను కోరిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీ వరకు రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన 279 జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని కూడా ఆయన సూచించారు. శనివారం సచివాలయంలో మార్కెటింగ్, సీసీఐ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే తేమ శాతంపైనా సడలింపులు ఇవ్వాలని, తద్వారా రైతులు మద్దతు ధర పొందే అవకాశం ఉందన్నారు. రైతులు కూడా సీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా తేమ 8-12శాతం మేర ఉండేలా పంటను మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. కొనుగోళ్ల కోసం రూపొందించిన కొత్త యాప్‌ను ఉపయోగించి కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ, తనిఖీలు చేయాలన్నారు. రైతులెవరూ పత్తిని తక్కువ ధరకు విక్రయించుకోవద్దని మంత్రి సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో రానున్న 6 నెలలు కీలకమని, సత్తుపల్లి ట్రంక్, ట్రంక్ కెనాల్, యాతలకుంట దాకా పనులు చేసుకుంటే వచ్చే సీజన్‌లో సాగునీటిని అందించే అవకాశం ఉంటుందని, ఆ దిశగా టెండర్లు పిలిచే ప్రక్రియను పూర్తిచేయాలని తుమ్మల కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి, ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులోని వివిధ పనుల డిజైన్లను ఖరారు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే విధంగా చొరవ తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌ను తుమ్మల కోరారు.

సంయుక్త భాగస్వామ్యంతో

మెట్రో రెండో దశ

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో, పరిపాలనాపరమైన అనుమతినిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ శనివారం జీవోనెం.196 జారీ చేశారు. మెట్రో రెండో దశలో భాగంగా.. కారిడార్-4లో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ దాకా 36.8 కి.మీ.లు, కారిడార్-5లో రాయదుర్గ్-కోకాపేట్ నియోపొలిస్ దాకా 11.6 కి.మీ.లు, కారిడార్-6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (పాతబస్తీ) వరకు 7.5 కి.మీ.లు, కారిడార్-7లో మియాపూర్ నుంచి పటాన్‌చెరు దాకా 13.4 కి.మీ.లు, కారిడార్-8లో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ దాకా 7.1 కి.మీ.లు కలుపుకొని మొత్తం 76.4 కి.మీ.ల మేర మెట్రో రైలు లైను వేయనున్నారు. దీనికి అదనంగా, కారిడార్-9లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ (స్కిల్ వర్సిటీ) వరకూ 40 కి.మీ.ల మేర మరో లైనును కూడా ప్రతిపాదించారు. ఈ కొత్త లైనుపై ప్రస్తుతం అలైన్‌మెంట్, అంచనాల తయారీ, క్షేత్ర స్థాయి సర్వే జరుగుతున్నాయి. వీటి అనంతరం దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. కాగా, రెండోదశకు పరిపాలనాపరమైన అనుమతి ఇవ్వడంతో డీపీఆర్‌ను కేంద్రప్రభుత్వానికి పంపించనున్నారు. కేంద్రం ఆమోదం తెలిపిన తర్వాత ప్రాజెక్టు పనులు మొదలవుతాయి.

ఏ మూల నుంచైనా ఎయిర్‌పోర్టుకు సులువుగా..

రెండో దశ విస్తరణ పనులను మొదటి దశలోని మూడు కారిడార్లకు అనుసంధానంగా చేపట్టనున్నారు. ప్రధానంగా నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 36.8 కి.మీ.ల ఈ కారిడార్ ఎల్బీనగర్ స్టేషన్ దాటిన తర్వాత కర్మన్‌ఘాట్, ఓవైసీ ఆస్పత్రి, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, న్యూహైకోర్టు మీదుగా శంషాబాద్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేపై వెళ్లనుంది. చాంద్రాయణగుట్టను ఇంటర్‌ఛేంజ్‌గా చేస్తుండటంతో ఇటు రాయదుర్గ్, అటు జేబీఎస్, మియాపూర్ నుంచి.. ఎక్కడి నుంచైనా ఎయిర్‌పోర్టుకు సులభంగా వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. కాగా, రెండో దశలోని మొత్తం 5 కారిడార్లకు మంజూరు చేసిన రూ.24,269 కోట్లలో.. నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రూ.11,226 కోట్లు, రాయదుర్గ్-కోకాపేట్ నియోపోలీస్‌కు రూ.4,318 కోట్లు, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్టకు రూ.2,741 కోట్లు, మియాపూర్-పటాన్‌చెరుకు రూ.4,107 కోట్లు, ఎల్బీనగర్-హయత్‌నగర్‌కు రూ.1,877 కోట్లు కేటాయించారు.

మొదటిదశలో అంచనాలను మించిన వ్యయం

మెట్రో మొదటి దశ ప్రాజెక్టును 2012లో ప్రారంభించారు. రూ.14,132 కోట్ల అంచనా వ్యయంతో ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో చేపట్టిన పనులను 2017 నవంబర్‌లో పూర్తి చేశారు. అయితే పనులు పూర్తయ్యే సరికి అంచనా వ్యయం రూ.22,000 కోట్లకు పెరిగిపోయింది. దీంతో ప్రాజెక్టు చేపట్టిన ఎల్అండ్‌టీకి నగరంలోని వివిధ ప్రాంతాల్లో 213 ఎకరాలను రవాణా ఆధారిత అభివృద్ధి (టీఓడీ) కింద అప్పగించారు.

టీటీడీలో హిందూయేతరులు వద్దన్నప్పుడు

వక్ఫ్‌బోర్డులో ముస్లిమేతరులు ఎందుకు?

వక్ఫ్ సవరణ బిల్లు.. రాజ్యాంగ ఉల్లంఘన

బీఆర్ఎస్ వాళ్ల జాతకాలు మా దగ్గరున్నాయి

నేను నోరు విప్పితే వాళ్లు తట్టుకోలేరు

మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చిందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. వక్ఫ్ బోర్డు కమిటీల్లో ఇద్దరు ముస్లిమేతరులను నియమించాలన్న నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. హిందూ దేవాలయ బోర్డుల్లో హిందువులే ఉండాలని నిబంధన ఉన్నప్పుడు వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్నించారు. శనివారం దారుల్ సలాంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో అసదుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. తిరుమల ఆలయంలో పనిచేసే సిబ్బంది అందరూ హిందువులే ఉండాలని కోరుకుంటున్నట్టు టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారని గుర్తు చేశారు. హిందూయేతరులు ఉన్న పక్షంలో వారిని ఇతర శాఖల్లోకి పంపించాలా లేదా వీఆర్ఎస్ ఇవ్వాలా అనే అంశంపై ప్రభుత్వంతో సంప్రదిస్తానని ఆయన చేసిన ప్రకటనను ఒవైసీ ప్రస్తావించారు. టీటీడీలో హిందువులే ఉండాలనే అంశాన్ని తాను తప్పుపట్టడం లేదన్నారు. అయితే దేశవ్యాప్తంగా హిందూ ఎండోమెంట్ బోర్డుల్లో ఒక్క ముస్లిం సభ్యుడు కూడా లేనప్పుడు కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీల్లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించాల్సిన అవసరం ఎందుకు ఉందని ఒవైసీ ప్రశ్నించారు. 'మీరు మీ మతంపై దృష్టి సారిస్తే దానితో మాకు ఇబ్బంది లేదు. అయితే మా మతంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నార'న్నారు. కాగా, బీఆర్ఎస్ వాళ్ల జాతకాలు తమ దగ్గరున్నాయని, తాను నోరు విప్పితే వాళ్లు తట్టుకోలేరని అసదుద్దీన్ అన్నారు. అప్పట్లో బీఆర్ఎస్ చేసిన మూసీ ప్రక్షాళన ప్రతిపాదనలను తాను వ్యతిరేకించానని చెప్పారు. పేదల ఇళ్లకు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు సాగాలని సూచించానన్నారు. బీఆర్ఎస్ మొదలుపెట్టిన మూసీ ప్రక్షాళనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుండగా బీఆర్ఎస్ అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ విధానాలు స్థిరంగా ఉండాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మజ్లిస్ మద్దతుతోనే బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 24 మంది అభ్యర్థులను మార్చి ఉంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచేదన్నారు. కాని అప్పట్లో బీఆర్ఎస్ నేతలకు చాలా అహంకారం ఉండేదని, అందువల్లే ఆ పార్టీ ఓటమి పాలైందన్నారు. తాము కాంగ్రెస్‌కు అనుకూలమనే వ్యాఖ్యలను ఖండించారు. తమ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతివ్వడం లేదని స్పష్టం చేశారు.

6 గ్యారంటీల అమలుపై పాదయాత్ర చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అవాస్తవమని, వాటిని నెరవేర్చడానికి వెయ్యి రోజులు కాదు.. 10వేల రోజులు కూడా సరిపోవని తేల్చిచెప్పారు. గ్యారంటీలు, హామీల పేరుతో యావత్ తెలంగాణను కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అవాస్తవ హామీలు రాష్ట్రాన్ని, ప్రజలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీలంటే నీటి మీద బుడగలేనని నిరూపించారని ఎద్దేవా చేశారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కేంద్రం పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందనడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాగా, జగిత్యాల జిల్లా మల్యాలలో సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ నుంచి మంజూరైన రూ.25కోట్లతో మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు 11.7కిలోమీటర్ల ముకడబుల్‌రోడ్డు విస్తరణ పనులను కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ పంతాలు.. పట్టింపులతో సాధించేదేమీ లేదని, ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరం ప్రజా సేవకులమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. గత(బీఆర్ఎస్) ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకరించలేదని ఆరోపించారు. కమీషన్ల కక్కుర్తితో కేంద్ర నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. చాలా రోజుల తరువాత మల్యాలలో ప్రొటోకాల్ పాటించడం మంచి సంప్రదాయమని, కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం బాగుందన్నారు. ఇక ముందు కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి అభివృద్ధి పనుల్లో సహకరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారం అవసరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రహదారి పనుల శిలాఫలకం ఆవిష్కరణ తర్వాత తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలతో బండి సంజయ్ కొంత సేపు సరదాగా గడిపారు. అనంతరం కొండగట్టులో అల్పాహారం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి ముచ్చటించారు.



జగిత్యాల జిల్లా మల్యాలలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

టీటీడీకి, వక్ఫ్ భూములకు తేడా తెలియని అజ్ఞాని

» అల్లా పేరుతో భూములు కబ్జా చేశారు

» ఒవైసీపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. టీటీడీకి, వక్ఫ్ భూముల వ్యవహారానికి తేడా తెలియని అజ్ఞాని ఒవైసీ అని విమర్శించారు. మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ వ్యాపారం చేస్తున్న ఒవైసీ అసలు రంగు ఈరోజు పూర్తిగా బయటపడిందన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'కలియుగ ప్రత్యక్ష దైవం.. ఆ వైకుంఠాధీశుడు కొలువైన పరమ పవిత్రమైన స్థలం తిరుమల తిరుపతి దేవస్థానం. వక్ఫ్ బోర్డు అనేది కేవలం భూములకు సంబంధించిన వ్యవహారం. సిగ్గులేకుండా టీటీడీకి, వక్ఫ్ బోర్డు పేరుతో సాగిస్తున్న భూముల దందాకు లింకు పెడతవా' అని ఒవైసీని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు భూములు పేద ముస్లింలకు మాత్రమే దక్కాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చిందన్నారు. టీటీడీ తనకు వచ్చిన విరాళాలతో పేదలకు, హిందూ ధార్మిక సంస్థలకు సాయం చేస్తోందే తప్ప ఏనాడూ ప్రజల ఆస్తులను కబ్జా చేయలేదన్నారు. ఒవైసీ దృష్టిలో భగవంతుడంటే వ్యాపారమేనని, అల్లా పేరు చెప్పుకొని భూములను దోచుకున్నాడని ఆరోపించారు. ఒవైసీ మాటలు నమ్మి దశాబ్దాలుగా మోసపోతున్న పాతబస్తీ ముస్లిం సోదరులు ఇకనైనా వాస్తవాలు ఆలోచించాలని కోరారు.

ఉపాధి పనులకు 1372 కోట్లు: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు మార్చి లోపు రూ.1372 కోట్లు నిధులు మంజూరు చేస్తామని మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఐదు నెలల్లో చేయాల్సిన పనులపై డీఆర్‌డీవోలతో శనివారం ఆమె వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. మహిళలకు ఉపాధి భరోసా, పంట పొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి పథకాన్ని విజయవంతం చేయాలని, ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

మహిళా భక్తులకు పసుపు, కుంకుమ: సురేఖ



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో కార్తీకమాస వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సామూహిక కార్తీక మాస దీపోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఆ వేడుకలకు హాజరయ్యే మహిళా భక్తులకు ఉచితంగా పసుపు, కుంకుమ అందజేస్తామని ఆమె చెప్పారు. ప్రధాన ఆలయాల్లో మహిళా భక్తులకు బ్లౌజ్ పీసులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అవకాశమున్నచోట ప్రత్యేక 'నది హారతి' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయండి: దామోదర



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యకళాశాలలకు అనుబంధంగా ఏర్పాటైన 15 నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నర్సింగ్ కాలేజీలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా... జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, కొడంగల్, ఆసిఫాబాద్, మెదక్, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట, నిర్మల్, రామగుండం, మహేశ్వరం, నర్సంపేట, యాదాద్రిలో ఏర్పాటు చేసిన నర్సింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియతో పాటు వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే తరగతులను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గా కిరణ్‌రెడ్డి

న్యూఢిల్లీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గా టి. కిరణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ) ఆదేశాలు జారీ చేసింది. కిరణ్ రెడ్డి 2009 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి. ఈ హోదాలో ఆయన ఐదేళ్లపాటు కొనసాగుతారని డీవోపీటీ స్పష్టం చేసింది.

నేడు వైటీపీఎస్‌కు మంత్రుల బృందం

నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ(వైటీపీఎస్)ను ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.20 గంటలకు వారు ప్రత్యేక హెలీకాప్టర్‌లో పరిశ్రమకు చేరుకుంటారు. అనంతరం యూనిట్-1 ఆయిల్ సింక్రనైజేషన్‌కు స్విచా ఆన్ చేయనున్నారు. అలాగే మొదటి విడతలో వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తిరిగి 3గంటలకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. గరిడేపల్లిలో రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి హుజూర్‌నగర్‌లోని హౌసింగ్ కాలనీని సందర్శించి లబ్ధిదారులతో సమావేశమవుతారు. తిరిగి సాయంత్రం 4.30గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

మెరిట్ స్కాలర్‌షిప్ గడువు 15వరకు పెంపు

జాతీయ ప్రతిభా పురస్కారాల దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు తెలంగాణ ఇంటర్‌బోర్డు ప్రకటించింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో పాటు రెన్యూవల్ చేసుకునే వారు ఆ తేదీ లోపు చేసుకోవాలని కోరింది. 2024 ఇంటర్ పరీక్షల్లో టాప్-20 విద్యార్థుల జాబితా tgbie.cgg.gov.inలో ఉందని బోర్డు గుర్తు చేసింది. ఆ విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, దరఖాస్తులను http://scholarships.gov.inలో దాఖలు చేయాలని కోరింది.

శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

» అరుణాచలం, పంచారామాలకు ప్యాకేజీలు: సజ్జనార్

హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రధానంగా శ్రీశైలం, వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట తదితర ఆలయాలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక ప్యాకేజీ అందిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను tgsrtcbus వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించారు. అద్దె ప్రాతిపదికన (బస్ ఆన్ కాంట్రాక్ట్ - బీవోసీ) నడిపే ఆర్టీసీ బస్సుల చార్జీలు తగ్గించామని సజ్జనార్ తెలిపారు. పల్లె వెలుగు కిలోమీటర్‌కు రూ.11, ఎక్స్‌ప్రెస్ రూ.7, డీలక్స్ రూ.8, సూపర్ లగ్జరీ రూ.6, రాజధాని రూ.7 మేర తగ్గించినట్టు ఆయన పేర్కొన్నారు. శబరిమలకు, శుభముహూర్తాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకుని క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ఆస్తులు వెల్లడించి.. యాత్ర చేయండి: కడియం

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్తులు ప్రకటించి.. పాదయాత్ర చేపట్టాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 2014 ఎన్నికలకు ముందు ఎన్ని ఆస్తులు ఉన్నాయో.. ఇప్పుడు ఎంత ఉన్నాయో చెప్పాలని అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో శనివారం సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై దిశానిర్దేశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడారు. ధరణి, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్లు దోచుకున్నారని.. జైలు భయంతోనే కాంగ్రెస్‌పై కేటీఆర్ అక్రమ కేసుల ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

కులగణన విధుల్లో వివక్ష వద్దు:ఎస్జీటీయూ

కులగణన విధులను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకే కేటాయించడం పట్ల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయు (ఎస్జీటీ)ల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం డిమాండ్ చేశారు.

7న బీజేపీ రాష్ట్ర ఎన్నికల వర్క్‌షాప్

పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్రస్థాయి ఎన్నికల వర్క్‌షాప్‌ను ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా... పార్టీ జిల్లాల అధ్యక్షుల ఎన్నిక కోసం అన్ని జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు వెల్లడించారు. ఈనెల 8,9,10 తేదీల్లో జిల్లా స్థాయిలో వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు.

ఆనకట్టల రక్షణకు గ్రీన్ సిగ్నల్

డ్రిప్ కింద రూ.645 కోట్ల నిధులు వెచ్చించడానికి ప్రభుత్వం నిర్ణయం

ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి 70 శాతం రుణం

రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సింది 30 శాతం.. జాబితాలో జూరాల, సాగర్ ప్రాజెక్టులు

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆనకట్టల రక్షణ కోసం ప్రపంచబ్యాంకు నిధులతో ప్రతిపాదించిన డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) అమలుకు అవసరమైన నిధులను విడుదల చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇటీవలే జరిగిన మంత్రివర్గ సమావేశంలో 29 ప్రాజెక్టులకు రూ.645.13 కోట్లను వెచ్చించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లోని 736 డ్యామ్‌లను ఈ ప్రాజెక్టులోకి చేర్చిన కేంద్రం.. ఇందుకోసం రూ.10211 కోట్లు అవసరం అవుతాయని ఇదివరకు అంచనా వేసింది. 2031 మార్చికల్లా ఈ ప్రాజెక్టును పూర్తిచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. 736 డ్యామ్‌లలో తెలంగాణ నుంచి 29 ప్రధాన డ్యామ్‌లు ఉన్నాయి. వీటి రక్షణకు రూ.645 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని లెక్కలు వేశారు. డ్రిప్‌లో రాష్ట్రం నుంచి చేర్చిన డ్యామ్‌ల్లో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, నిజాంసాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, జూరాల, పాకాల లేక్, లక్నవరం, రామప్ప లేక్, పాలేరు, డిండి, కోయిల్‌సాగర్, కడెం, మూసీ, ఎస్ఆర్ఎస్పీ, వట్టివాగు, స్వర్ణ, ఎల్ఎండీ, మల్లూరువాగు, బొగ్గుల వాగు, ఎన్టీఆర్ సాగర్, కౌలాస్‌నాలా, సాత్నాలా, సింగూరు, గడ్డెన్నవాగు, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పెద్ద దేవులపల్లి రిజర్వాయర్, పీపీఆర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో అధికంగా జూరాల డ్యామ్ పనుల కోసం రూ.143.44కోట్లు, నాగార్జునసాగర్ కోసం రూ.29.56 కోట్లు, ఎస్సారెస్పీ కోసం రూ.63.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. డ్యామ్‌ల ఆధునీకరణ, మరమ్మతుల కోసం డ్రిప్ పథకంలో చేరితే ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి 70% రుణంగా రాష్ట్రానికి అందనుంది. మరో 30% నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల్లో పనుల కోసం డీపీఆర్‌లు కూడా సిద్ధం చేశారు. రూ.645.13 కోట్లను తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిన తర్వాత అందులో 70% రుణరూపంలో అందనుంది. దాంతో 30% అంటే రూ.193 కోట్ల మేర తెలంగాణ వాటాగా వెచ్చించనుంది. మరోవైపు ఏడాదిన్నర కిందట ఈ పథకంలో చేరిన తర్వాత దీనికి అనుగుణంగా రెండు డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్(డీఎస్ఆర్‌పీ)లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం చేశారు.

ఈ పథకం ప్రత్యేకతలు

- ఆనకట్టలను వరదల నుంచి రక్షించుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు.
- డ్యామ్‌ల గేట్ల మరమ్మత్తులు, గేట్లు దెబ్బతినకుండా రంగులు వేయడం, ఇతరత్రా నిర్వహణ.
- రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు పెట్టుకోవడానికి అనుమతినివ్వడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడం.

మోదీజీ.. మీవన్నీ

అపోహలు, అవాస్తవాలే

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానికి రేవంత్ ట్వీట్ చేశారు. ఆ వివరాలు.. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కేవలం రెండు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అనే రెండు హామీలను అమలు చేశాం. గత 11 నెలలుగా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. ఫలితంగా, వారికి రూ.3,433.36 కోట్లు ఆదా అయ్యాయి. మహిళలకు ఉచిత విద్యుత్తు అందుతోంది. 200 యూనిట్ల వరకూ ఇళ్లకు ఎటువంటి చార్జీలు వసూలు చేయడం లేదు. అంతేనా.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ల ధరాభారంతో మహిళలు సతమతమవుతుంటే.. కాంగ్రెస్ పాలిత తెలంగాణలో కేవలం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇంటికి వస్తోంది. ఇప్పటి వరకూ 1.31 కోట్లకుపైగా సిలిండర్లను వారికి అందించాం. 42,90,246 మంది లబ్ధిదారులు నవ్వుతూ కిచెన్‌లోకి వెళ్లారు. అందుకే, వారంతా మా ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు. పరీక్షల నిర్వహణ, యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడంలో పదేళ్ల వైఫల్యం తర్వాత.. అతి పెద్ద రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రభుత్వం చేపట్టింది. గడిచిన 11 నెలల్లో మా ప్రభుత్వం 50 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసింది. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తోంది. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో నియామకాలు చేపట్టలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యార్థులను తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. అందుకే, పదేళ్ల తర్వాత ఇప్పుడు వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని మేం ప్రక్షాళన చేసి.. పునరుజ్జీవింపజేస్తున్నాం. నాలాలు, చెరువులను పరిరక్షిస్తున్నాం. గత పదేళ్లుగా ఆక్రమించిన, ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన జల వనరులను మేం పరిరక్షిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంచు చెరువు భూమి కూడా కబ్జా కాలేదు. అంతేనా.. మేం ఫ్యూచర్ సిటీని సృష్టిస్తున్నాం. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటుచేస్తున్నాం.

ధాన్యం కొనుగోళ్లలో పొరపాట్లు జరగొద్దు

» కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని, ప్రభుత్వానికి అప్రతిష్ఠ తీసుకురావొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. మొదటిసారిగా సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌ను అందిస్తుందని, ఇది చరిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై శనివారం మంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో దేశానికి తలమానికంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ సీజన్‌లో 150 లక్షల టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు జరిగే అవకాశం ఉందని, ఇందుకోసం రూ.30వేల కోట్లు అవసరమవుతాయన్నారు. ఇప్పటికే రూ.20వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, అదనపు నిధులు అవసరమైనా విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యం ప్రభుత్వానికి చేరగానే మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ రిలీజ్ చేస్తామన్నారు. కొనుగోళ్ల కోసం 7,572 కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించగా.. ఇప్పటికే 4,598 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వివరించారు.

డ్రగ్స్, గంజాయి విక్రయాలపై కన్నేయండి

వర్సిటీలను ప్రక్షాళన చేయాల్సిందే.. వైస్ చాన్సలర్లకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

విశ్వ విద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి సారించాలని, విద్యార్థులను గమనించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఇటీవల నియమితులైన వైస్ చాన్సలర్లకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గతంలో వైస్ చాన్సలర్లను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వాళ్లని ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని గుర్తు చేశారు. అందుకే, యూనివర్సిటీలను వంద శాతం ప్రక్షాళన చేయాలని, వర్సిటీలపై నమ్మకం కలిగించేలా పనిజేయాలని దిశానిర్దేశం చేశారు. అన్ని యూనివర్సిటీల వీసీలు శనివారం సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంత కాలంగా యూనివర్సిటీలపై నమ్మకం తగ్గుతోందని, వాటి గౌరవాన్ని పెంచాలని సూచించారు. "విశ్వ విద్యాలయ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. వాటి పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయండి. వర్సిటీల ప్రస్తుత పరిస్థితి పై సమగ్ర అధ్యయనం చేసి చర్యలు మొదలు పెట్టండి. అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకొని నివేదిక తయారు చేయండి" అని సూచించారు. వైస్ చాన్సలర్లకి ఎవరి ప్రభావితంతోనూ పోస్టింగులు ఇవ్వలేద ని, కేవలం మెరిట్, సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక చేశామని గుర్తు చేశారు. బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సున్నితంగా హెచ్చరించారు. మంచి పని చేయడానికి వారికి స్వేచ్ఛ ఉంటుందన్నారు. అందుకు ప్రభుత్వ సహకారమూ ఉంటుందన్నారు. సీఎంను కలిసిన వారిలో సలహాదారుడు నరేందర్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం ఉన్నారు.

ఫ్యూచర్ సిటీ దిశగా వేగంగా అడుగులు

» 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూసేకరణ

» 449.27 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ

» భూ యజమానులకు పారదర్శకంగా.. పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం

» ఆ భూముల్లో క్రయవిక్రయాలు జరపొద్దని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగర శివార్లలో కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ పనులకు సంబంధించి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అక్కడికి రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజా ప్రయోజనాల రీత్యా ఆరు లేన్ల రహదారికి 449.27 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే మెట్రో రైలు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మహేశ్వరం మండలంలోని కొంగరకుర్థు-ఏ గ్రామంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలంలోని లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడివెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఈ భూసేకరణ చేస్తున్నారు. ఇందుకుగాను భూసేకరణ చట్టం ప్రకారం పారదర్శకంగా హేతుబద్ధమైన పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. భూసేకరణ చట్టం-2016 (యాక్ట్ 21/2017)తోపాటు పునరావాస కల్పన చట్టం-2013 (యాక్ట్ 20/2013) ద్వారా భూసేకరణ చేస్తున్నట్లు వెల్లడించింది. నోటిఫికేషన్ ప్రకారం.. మహేశ్వరం మండలంలోని కొంగరకుర్థు-ఏ గ్రామంలో 53.20 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడలో 1.03 ఎకరాలు, కొంగరకలాన్‌లో 55.05 ఎకరాలు, కందుకూరు మండలంలోని లేమూరులో 84.28 ఎకరాలు, రాచలూరులో 87.22 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 47.02 ఎకరాలు, గుమ్మడివెల్లిలో 32.11 ఎకరాలు, పంజాగూడలో 18.33 ఎకరాలు, మీర్‌ఖాన్‌పేటలో 62.08 ఎకరాలు సేకరిస్తున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూ యజమానులెవరూ చట్టంలోని సెక్షన్ 11(4) కింద ఈ భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని ప్రభుత్వం ఆదేశించింది. ఎలాంటి రుణాల కోసం కూడా ఈ భూములను తాకట్టు పెట్టరాదని సూచించింది. భూసేకరణపై అభ్యంతరాలుంటే 60 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలియచేయాలని పేర్కొంది. ఇదిలా ఉండగా 300 అడుగుల వెడల్పుతో నిర్మించే ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ప్రస్తుతం ఆరులేన్లకే పరిమితం చేసినప్పటికీ.. భవిష్యత్తులో దీనిని ఎనిమిది లేన్లుగా విస్తరించనున్నట్లు తెలిసింది. అలాగే దీనికి ఆనుకునే సమాంతరంగా మెట్రో రైల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

మళ్లీ క్రీడా గ్రామంగా టిమ్స్

ఆరోగ్య శాఖ నుంచి క్రీడాశాఖకు బదిలీ.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

» 2002లో జాతీయ క్రీడలకు నెలవు

» 2020 కొవిడ్ సమయంలో టిమ్స్‌గా రూపాంతరం

» స్పోర్ట్స్ వర్సిటీ నేపథ్యంలో.. సర్కారు తాజా నిర్ణయం



హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్(టిమ్స్)ఆస్పత్రికి శాశ్వతంగా తాళం పడింది. ఆ భవనాన్ని మళ్లీ క్రీడాగ్రామం(స్పోర్ట్స్ విలేజ్)గా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది ఆగస్టులో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఎన్ఎండీసీ మారథాన్ సందర్భంగా ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా.. ప్రభుత్వం తాజాగా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో.. టిమ్స్ ప్రాంగణాన్ని క్రీడాకారుల గురుకుల శిక్షణ శిబిరం, స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చాలని స్పష్టం చేసింది.

2002లో ప్రారంభమై..

గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియానికి అనుబంధంగా.. ఉమ్మడి ఏపీలో రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో అప్పటి సీఎం చంద్రబాబు 2002లో క్రీడాగ్రామాన్ని ప్రారంభించారు. 9.16 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన స్పోర్ట్స్ విలేజ్ భవనం(13 అంతస్తులు)లో 468 గదులున్నాయి. అదే సంవత్సరం జరిగిన జాతీయ క్రీడలకు ఉమ్మడి రాష్ట్రం ఆతిథ్యమివ్వగా.. హైదరాబాద్, విశాఖ నగరాల్లో క్రీడాపోటీలు జరిగాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులకు నగరంలోని ప్రముఖ హోటళ్లతో పాటు.. క్రీడాగ్రామంలో వసతి కల్పించారు. 2003లో జరిగిన ఆఫ్రో-ఏషియన్ గేమ్స్ సందర్భంగా ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన క్రీడాకారులకు ఇక్కడ బస ఏర్పాటు చేశారు. ఈ స్టేడియంతో పాటు.. యూసు‌ఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, ఎల్‌బీ స్టేడియంలో క్రీడాపోటీలు జరిగాయి. 2007లో జరిగిన ప్రపంచ మిలటరీ క్రీడలకు కూడా గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్ ప్రధాన కేంద్రంగా నిలిచింది. కాగా, ప్రపంచ మిలటరీ క్రీడల తర్వాత స్పోర్ట్స్ విలేజ్ క్రమంగా ప్రభ కోల్పోయింది. 2020లో కొవిడ్ మహమ్మారి విజృంభిస్తుండడంతో.. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ విలేజ్‌ను 1,261 ఐసీయూ పడకలతో టిమ్స్‌గా మార్చింది. వెయ్యి మందికి పైగా సిబ్బందిని నియమించి, కొవిడ్ సమయంలో రోగులకు సేవలను అందించింది.

మళ్లీ క్రీడల కోసం..

ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో.. స్పోర్ట్స్ విలేజ్‌ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్)కు అప్పగించనున్నారు. దాంతో అక్కడ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కోసం వినియోగించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లకు అవసరమైన గురుకుల శిక్షణ శిబిరాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తాజా జీవోలో పేర్కొంది.

5న రాష్ట్రానికి రాహుల్

కుల గణనపై సమావేశానికి హాజరు.. 6 లేదా 7న అఖిలపక్ష భేటీ: మహేశ్ గౌడ్



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈనెల 5న రాష్ట్రానికి రానున్నారని, బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కుల గణనపై మేధావులు, పౌర హక్కులు, విద్యార్థి, కుల సంఘాల నేతలతో జరిగే సమావేశంలో పాల్గొననున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. తాను, సీఎం రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకే ఆయన వస్తున్నారన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేనూ ఆహ్వానించామని, సమయం దొరికితే సమావేశంలో ఆయన కూడా పాల్గొనే ఆస్కారం ఉందని తెలిపారు. ఆ సమావేశంలో కుల గణనకు సంబంధించి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "దేశంలో ఏం జరుగుతున్నది అన్న దానిపై వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం ప్రధాని మోదీ ఎన్నడూ చేయలేదు. దానికి భిన్నంగా.. వాస్తవాలను తెలియాలని కోరుకునే వ్యక్తి రాహుల్‌గాంధీ. అందుకే కుల గణనపై కార్యక్రమంలో పాల్గొనేందుకు అంగీకరించారు. దీనినిబట్టే కుల గణనపై ఆయన చిత్తశుద్ధి స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. అలాగే, కుల గణనపై టీపీసీసీ తరఫున ఈనెల 6 లేదా 7న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, నాయకుల సూచనలు, సలహాలను తీసుకుని వాటిలో సహేతుకంగా ఉన్నవి స్వీకరిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ సహేతుకంగా, సజావుగా, ఎక్కడా బ్రేక్ రాకుండా జరగాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు.

పథకాల అమలు తీరు పర్యవేక్షణకు నియోజకవర్గానికో సమన్వయ కర్త

రాష్ట్రంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా కుల గణనకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగస్వామి కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఇందిరా భవన్‌లో కనెక్టింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నామన్నారు. ఈ సెంటర్ కుల గణనతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరును నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రజలకు ఏమైనా అనుమానాలుంటే ఫోన్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికో సమన్వయ కర్తను నియమిస్తున్నట్లు వెల్లడించారు.

కిషన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది

రాష్ట్రానికి సీఎం ఉండగా.. కొత్త సీఎం అంటూ ఇతర పార్టీల వాళ్లు మాట్లాడితే దానికి తాము ఏం సమాధానం చెబుతామని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఒక సదవకాశాన్ని ఇచ్చారని, దాన్ని వమ్ము చేయకుండా.. వారు కోరుకున్న విధంగా సీఎం, మంత్రులు ప్రజాపాలనను అందిస్తున్నారన్నారు. ఇక్కడ ఏకచ్ఛత్రాధిపత్య పాలన జరగట్లేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పని చేస్తున్నారని, ప్రభుత్వం సజావుగా నడుస్తోందని తెలిపారు. కాంగ్రెస్‌లో ఉండే ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ మరే పార్టీలో ఉండదని, బీజేపీలో అసలే ఉండదన్నారు. మహేశ్వర్ రెడ్డికి బీజేపీలో ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా దక్కుతున్న గౌరవం ఏమిటో ఆయన ఆలోచించుకోవాలని హితవు పలికారు. "బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు కుర్చీనే లేదు. మాకున్న సమాచారం ప్రకారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, మహేశ్వర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది" అని పేర్కొన్నారు. గ్యారెంటీలకు సంబంధించి ఖర్గే వ్యాఖ్యలను వేరుగా చిత్రించే ప్రయత్నం జరుగుతోందన్నారు. బీసీల పట్ల కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఎందుకు బయట పెట్టలేదని నిలదీశారు. మూసీని ప్రక్షాళన చేయాలా.. వద్దా అన్న దానిపై బీఆర్ఎస్ నేతలకు స్పష్టత లేదన్నారు.

'సీతారామ' లింక్ కెనాల్ పనుల అడ్డగింత

జూలూరుపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులకు శనివారం ఆటంకం కలిగింది. కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులు కాల్వ పనులను అడ్డుకున్నారు. ఎకరానికి రూ.25లక్షలు చొప్పున తమకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా ఏన్కూరుకు వచ్చినప్పుడు తామంతా కలిసి ఎకరానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని కోరామని చెప్పారు. రూ.20 లక్షలు చొప్పున చెల్లిస్తామని మంత్రులు చెప్పగా తాము రూ.25 లక్షలు కావాలని అడిగామన్నారు. అయితే, ప్రభుత్వం నుంచి మెరుగైన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ, ఇప్పుడు పట్టా భూములకు ఎకరానికి రూ.13.50లక్షల చొప్పున, పట్టాలేని ఎస్టీ, బీసీ రైతులకు వేర్వేరుగా ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని వాపోయారు. మంత్రులు తమకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేదంటే తాము ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారం

తిమ్మాజిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఓ బాలికపై 62 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన దారుణ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో జరిగింది. తిమ్మాజీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధుడు తన ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న చిన్నారిని ఇంట్లోకి పిలిచి మభ్యపెట్టి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆలస్యంగా గుర్తించిన బాలిక తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. డీఎస్పీ, సీఐ శనివారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. బాలిక ఇంటిని, వృద్ధుడి ఇంటిని పరిశీలించారు. ఈ ఘటన మూడు రోజుల క్రితమే జరిగినప్పటికీ ఇరువర్గాలను రాజీ చేసేందుకు కొందరు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టినట్లు సమాచారం.

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, గ్రామ కార్యదర్శి

జైనూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండల తహసీల్దార్, గ్రామ కార్యదర్శి రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి చెప్పిన వివరాల ప్రకారం.. జైనూరు మండలంలోని పోచంలొద్దిలో కాంట్రాక్టర్ కేంద్రె సుబోధ్ ఇటీవల రూ. 10 లక్షల నిధులతో రోడ్డు నిర్మించాడు. ఇందుకు సంబంధించిన బిల్లు మంజూరు చేయడానికి సుబోధ్‌ను జైనూరు తహసీల్దార్ తిరుపతి, గ్రామ కార్యదర్శి శేఖర్ రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సుబోధ్ రూ.12 వేలు తహసీల్దార్ తిరుపతి, గ్రామ కార్యదర్శి శేఖర్‌కి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు.

తదుపరి దర్యాప్తులో తప్పు లేదు

- ట్రయల్ కోర్టు ఆదేశాలను సమర్థించిన హైకోర్టు
- మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్‌కు ఎదురుదెబ్బ

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు చెందిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు మొహమ్మద్ రహీల్ అమీర్ అలియాస్ రహీల్ (22)కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ కేసుపై తదుపరి దర్యాప్తు జరిపేందుకు నాంపల్లి కోర్టు ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు సమర్థించింది. 2022లో జూబ్లీహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక చిన్నారి మరణించడంతోపాటు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేసిన రహీల్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, కానీ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసులో డ్రైవర్‌ను ఇరికించి తాను తప్పుకొన్నట్టు తాజాగా పోలీసులు భావిస్తున్నారు. అప్పట్లో కేసును దర్యాప్తు చేసిన పోలీసులు అమాయకుడైన డ్రైవర్‌పై కేసు పెట్టి జైలుకు పంపారని అనుమానిస్తున్నారు. మొత్తం వ్యవహారంపై తదుపరి దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇవ్వాలని నాంపల్లి క్రిమినల్ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఇందుకు అనుమతి ఇస్తూ ఈ ఏడాది మార్చి 19న ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే దర్యాప్తు పూర్తయిన కేసును మళ్లీ రీఓపెన్ చేయడం చెల్లదని పేర్కొంటూ రహీల్ జూన్ 26న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రయల్ కోర్టు ఆదేశాల్లో ఎలాంటి తప్పులేదని పేర్కొంటూ అతని వినతిని తిరస్కరించారు.

తీరిన ఆదివాసీల 'చింత'

- ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు చింతవాగుపై వంతెన పూర్తి
- 100 గ్రామాలకు తీరిన కష్టాలు... ఆదివాసీల హర్షం
- బ్రిడ్జి నిర్మాణాన్ని పలుమార్లు అడ్డుకున్న నక్సలైట్లు

చర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో పామేడు శివారులోని చింతవాగుపై రూ.10 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో చేపట్టిన భారీ వంతెన నిర్మాణం పూర్తయింది. దీంతో ఏళ్లుగా వాగును దాటలేక ఆదివాసీలు పడుతున్న కష్టాలకు విముక్తి లభించింది. రెండు సంవత్సరాలుగా ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని బ్రిడ్జిని పూర్తిచేయడం పట్ల ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో అధికారులు ఈ వంతెనను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాంతం మావోయిస్టులకు అడ్డా కావడంతో వంతెన నిర్మాణానికి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. నక్సలైట్లు పలుమార్లు ఇబ్బందులకు గురిచేశారు. పరికరాలను తగులబెట్టారు. దీంతో వందల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వంతెన వద్ద పహారా కాయడం ద్వారా పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ఆదివాసీలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన లేనప్పుడు సుమారు 100 గ్రామాల గిరిజనులు కాలినడకన లేదా నాటు పడవలపై వాగుదాటేవారు. ఈ క్రమంలో అనేకమంది వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అలాగే బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో త్వరలో అధికారులు పామేడు నుంచి బాసగూడ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి బస్సు సర్వీసులు నడిపేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.



లక్నవరంలో బోటింగ్

వాటర్ గేమ్ బెలూన్

లక్నవరంలో కాటేజీలు

లాంచీలో చలో చలో

సాగర్-శ్రీశైలం మధ్య ప్రయాణం షురూ.. ఇటు సోమశిల నుంచి శ్రీశైలానికి కూడా

- లక్నవరం సరస్సు మరింత ఆకర్షణీయం
- పర్యటక కేంద్రంగా మూడో దీవి
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు

గోవిందరావుపేట, నాగార్జునసాగర్, కొల్లాపూర్, హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నలమల అందాల మధ్య కృష్ణమ్మ ఒడిలో లాహిరి లాహిరి లాహిరిలో అంటూ నాగార్జున సాగర్ నుంచి ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలానికి శనివారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో లాంచీ ప్రయాణం ప్రారంభమైంది. 85 మంది పర్యాటకులతో 110 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలానికి 6 గంటల పాటు ఈ ప్రయాణం సాగింది. పర్యాటకుల ఆదరణ మేరకు బుధ, శనివారాల్లో లాంచీలను నడుపుతామని అధికారులు తెలిపారు. కృష్ణా నదిపై నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం శనివారమే ప్రారంభమైంది. ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలను వీక్షిస్తూ పర్యటకులు ఈ ప్రయాణాన్ని ఆస్వాదించారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో సోమశిల నుంచి బయల్దేరిన లాంచీ 7 గంటల అనంతరం శ్రీశైలం పాతాళ గంగ చేరింది. ఆదివారం ఉదయం 10 గంటలకు తిరిగి ప్రారంభమై సాయంత్రం 4 గంటల సమయానికి సోమశిలకు రానుంది.

లక్నవరం పిలుస్తోంది..

ద్వీపాలు.. ద్వీపకల్పాలు.. కొండలు.. సరస్సులు.. అడవులు.. ఇలా ఎటుచూసినా ప్రకృతి రమణీయత ఉట్టిపడే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు కొంగొత్త అందాలను సంతరించుకుంది. ఊయల వంతెనలు, దీవులు, కాటేజీలు, బోటింగ్‌తో ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్త రూపు దాల్చింది. పచ్చిక బయళ్లు, గార్డెన్, స్విమ్మింగ్ పూల్, పిల్లల పార్కు, సాహస క్రీడలు, వాటర్ స్పోర్ట్స్‌తో సరస్సులోని మూడో దీవి పర్యటక కేంద్రంగా అవతరించింది. మినీ బార్, బాంక్వెట్ హాల్, కాటేజీలు, రాత్రివేళ క్యాంప్ ఫైరింగ్ ఏర్పాటు చేశారు. అటవీ, పర్యటక శాఖల సంయుక్త భాగస్వామ్యంతో ట్రెక్కింగ్ లాంటి సదుపాయాలు కల్పించిన నిర్వాహకులు ఇక నుంచి వారాంతాల్లో మరచిపోలేని అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేశారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి, రెండో దీవుల్లో కూడా ఇదే తరహా సదుపాయాలు కల్పిస్తే లక్నవరం రాష్ట్ర పర్యాటకానికి తలమానికం కానుంది.



సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో వెళుతున్న లాంచీ

నాగార్జునసాగర్-శ్రీశైలం రివర్ కమ్ క్రూయిజ్ ప్యాకేజీ

- వన్ వే విత్ వెజ్ లంచ్ పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు (5-12 సంవత్సరాలు)రూ.1600
- టూవే విత్ వెజ్ లంచ్ పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు (5-12 సంవత్సరాలు)రూ.2400

సోమశిల-శ్రీశైలం రివర్ కమ్ క్రూయిజ్ ప్యాకేజీ

- వన్ వే విత్ వెజ్ లంచ్ పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు (5-12 సంవత్సరాలు)రూ.1600
- టూవే విత్ వెజ్ లంచ్ పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు (5-12 సంవత్సరాలు)రూ.2400

సంప్రదించాల్సిన నంబర్లు:

నాగార్జునసాగర్-శ్రీశైలం ప్యాకేజీ
9848540371, 7997951023,
సోమశిల-శ్రీశైలం ప్యాకేజీ
9848540371, 7731854994

పొగమంచు కమ్ముకొంది

పెంచికలపేట/చింతలమానేపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చలి మొదలైంది. రాత్రిపూట మంచు కురుస్తుండడంతో పాటు ఉదయం వరకు దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. శనివారం పెంచికటపేట, చింతలమానేపల్లి మండలాల్లో ప్రధాన రహదారిపై ఇదే పరిస్థితి కనిపించింది. ఉదయం 10 దాటినా సూర్యుడు కనిపించకపోవడం గమనార్హం.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేటలో ప్రధాన రోడ్డుపై దట్టమైన పొగమంచు

రైతులే కాడెడ్లుగా మారి..



చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించేందుకు సరైన రోడ్డులేక వారే కాడెడ్లుగా మారి ఎడ్లబండి లాగారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలో జరిగింది. కొత్తపల్లిలోని వ్యవసాయ తోటల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. పంటకు నీరు పారించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతుల కోసం తరలించాలని నిర్ణయించారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో.. పంట చేను మధ్యలో నుంచే అర కిలోమీటర్ దూరంలో ఉన్న మెయిన్ రోడ్డు వరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎడ్లబండిపై లాగారు.

- ఆంధ్రజ్యోతి, వేల్పూర్



ఆంజనేయులు, లావణ్య, సహస్ర, శ్రావ్య (ఫైల్)

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్
ఒకే కుటుంబంలో నలుగురి దుర్మరణం

మనోహరాబాద్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు బాలికలు ఉన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన మన్నె ఆంజనేయులు(42) తన మరదలు(సోదరుడి భార్య) లావణ్య(30), ఆమె కుమార్తెలు సహస్ర(9), శ్రావ్య(7)ను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని గ్రామ శివారులోని బస్టాప్‌కు బయలుదేరాడు. గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, లావణ్య, సహస్ర, శ్రావ్య అక్కడికక్కడే మరణించారు. స్థానిక రైతులు డబుల్ లేన్ రహదారిలో ఓ వైపు ధాన్యం ఆరబెట్టడంతో వాహనాలన్నీ ఒకే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

మార్ట్‌లో పనిచేస్తున్న
యువతిపై అత్యాచారం

- అక్కడే పనిచేస్తున్న వ్యక్తి దారుణం.. వాష్ రూంకు వెళ్లగా బెదిరించి అత్యాచారం
- నెల క్రితం ఘటన.. గర్భం దాల్చిన యువతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్టులో పనిచేస్తున్న యువతిపై అక్కడే పని చేస్తున్న ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం జరిగింది. బాధితురాలి బంధువుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పరిధికి చెందిన ఖాజాబషీర్ (35) ఓ మార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదేమార్ట్‌లో పనిచేసే అవివాహిత (20) నెలరోజుల క్రితం మార్ట్‌లోని వాష్‌రూంకు వెళ్లగా బషీర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. దారుణం గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. శనివారం మధ్యాహ్నం యువతి మార్ట్‌లో కళ్లుతిరిగి పడిపోయింది. మార్ట్ నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చి స్థానిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి ఆమె గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. యువతిని ప్రశ్నించడంతో మార్ట్‌లోని సూపర్‌వైజర్ ఖాజాబషీర్ అఘాయిత్యానికి పాల్పడినట్లు చెప్పింది. తల్లిదండ్రులు మార్ట్ వద్దకొచ్చి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడు బషీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ పరశురాం తెలిపారు.



నిందితుడు ఖాజా బషీర్ (ఫైల్)

వెంటిలేటర్‌పై విద్యార్థిని!

- వాంకిడి గిరిజన ఆశ్రమ ఉన్నత.. పాఠశాలలో అస్వస్థతకు గురైన శైలజ
- మరో 14 మందికీ వాంతులు, విరేచనాలు
- శైలజ సహా ముగ్గురి పరిస్థితి విషమం

వాంకిడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. శనివారం మరో 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా.. శైలజ అనే విద్యార్థిని వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఈ పాఠశాలలో అక్టోబరు 30 నుంచి విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం నాటికే 45 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై చికిత్స పొందగా.. ప్రస్తుతం వీరి సంఖ్య 60కి చేరింది. శనివారం అస్వస్థతకు గురైన 15 మందిలో.. 12 మందికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శైలజ, పార్వతి, కోవ లక్ష్మి అనే ముగ్గురు విద్యార్థినుల పరిస్థితి విషమంగా మారడంతో.. శైలజను మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, పార్వతిని కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోవ లక్ష్మికి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే శైలజ పరిస్థితి మరింత విషమంగా మారడంతో ఆమెను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కాగా, శనివారం ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.



ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కస్టడీ నుంచి హత్య కేసు నిందితుడు పరారీ

- గాలిస్తున్న కర్ణాటక, పోచారం ఐటీసీ పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రియల్ వ్యాపారి రమేశ్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితుడు అంకుర్ రాణా కర్ణాటక పోలీసుల కళ్లుకప్పి పరారయ్యాడు. ఈ మేరకు కర్ణాటక రాష్ట్రం సుంటికొప్ప పోలీసుస్టేషన్ సీఐ మహదేవ్.. పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపాలిటీలో నివాసం ఉండే రమేశ్ కుమార్‌ను గతనెల 4న భార్య నిహారిక, ప్రియులు అంకుర్ రాణా, నిఖిల్‌రెడ్డితో కలిసి హత్య చేసి కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా సుంటికొప్పలోని ఓ కాఫీ తోటలో కాల్చివేశారు. ఈ హత్య కేసును ఛేదించిన సుంటికొప్ప పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 29న పోలీసులు న్యాయస్థానం అనుమతితో నిందితులను కస్టడీకి తీసుకున్నారు. 30న సుంటికొప్ప పోలీసులు హత్య జరిగిన తీరుపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం రెండురోజుల పాటు పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అదే రోజు మధ్యాహ్నం ఘట్‌కేసర్ హెచ్‌పీసీఎల్ సమీపంలో హత్య చేసిన ప్రదేశంలో విచారణ చేసి అక్కడి నుంచి రమేశ్ కుమార్ నివాసం ఉండే సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఇంటికి నిందితులను తీసుకెళ్లారు. రాత్రి చౌదరిగూడ, విజయపురి కాలనీ వరంగల్-హైదారాబాద్ జాతీయ రహదారిపై ఉన్న బృందావన్ లాడ్జీలో ఆరు గదులు తీసుకున్నారు. నిందితుడు రాణా గది వద్ద హెడ్‌కానిస్టేబుల్ అష్పాక్ ఉర్ రెహ్మాన్, మరో కానిస్టేబుల్ హరీశ్ విధుల్లో ఉన్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున రాణా లాడ్జీలోని కిటికిలో నుంచి పోలీసుల కళ్లుకప్పి సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకొని.. రైలు ఎక్కి హరియాణాకు పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితుడి కోసం పోచారం ఐటీసీ పోలీసులు, కర్ణాటక సుంటికొప్ప పోలీసులు గాలిస్తున్నారు.



అంకుర్ రాణా(ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.